
ఆంధ్రప్రదేశ్



మాతామహ మహాశైలం మహస్తద్ అపితామహమ్
వందే యద్వ్యాప్రలీలాభిః భిద్యంతే విఘ్నభూధరాః

సెప్టెంబరు, 1965
25 పైసలు



ఆంధ్రప్రదేశ్

సంపుటి : 9
సంచిక : 11

సెప్టెంబరు, 1965
భాద్రపద-ఆశ్వయుజ 1887 శకం

ప్రధాన సంపాదకులు
టి. రామచంద్రరావు

సంపాదకులు :
కప్పగంతుల లక్ష్మణశాస్త్రి

ఈ సంచికలో

మొదటి అట్ట :

మాతామహ మహాశైలం మహస్తద్ అపితామహమ్!
వందే యద్వప్రలీలాభిః భిద్యంతే విఘ్నభూధరాః ।

ఎవని దంత ప్రహారక్రీడలచే విఘ్నములనెడు పర్వతములు భేదిల్లుచున్నవో, ఎవనికి హిమాలయపర్వతము మాతామహుడో, ఎవనికి పితామహుడులేడో, (గణపతికి శివుడు తండ్రి, అతడు జగత్పిత, అతనికి తండ్రి ఉండడుగనుక గణపతికి పితామహుడు లేడని భావము.) అట్టి తేజోమూర్తియగు గణాధిపతికి నమస్కరించుచున్నాను.

రెండు, మూడు, నాలుగు అట్టలు :


వర్షఋతు దృశ్యాలు

ఫోటోలు :

1, 3, 4 అట్టలు :
శ్రీ యన్. ఆర్. కె. రావు

రెండవ అట్ట :
శ్రీ డి. ఎన్. నాయుడు

ఈ సంచికలోని రచయితల అభిప్రాయాలు ప్రభుత్వానికి సంబంధించినవి కావు



ముఖ్యమంత్రి

సందేశం

ప్రియమైన చదువరీ,

ఈ రోజు మనందరి దృష్టిని ఆకర్షిస్తున్న చైనా, పాకిస్తాన్‌ల దుష్ట పన్నాగాలను గూర్చి నేను యీ ఉత్తరంలో ముచ్చటించదలచాను. ఇద్దరు భాగస్వాములూ శాంతితోను, సఖ్యంగాను జీవించడానికి వీలుగా 1947 వ సంవత్సరంలో మనదేశ విభజన జరిగిన సంగతి మీ అందరికీ తెలుసు. దురదృష్ట వశాన మన పొరుగు దేశమైన పాకిస్తాన్ మన రెండు దేశాల మధ్య స్నేహాన్ని చిగురించనీయలేదు. పాకిస్తాన్ అవతరించిన నాటినుండీ ఆ దేశం మనకు వ్యతిరేకంగా విద్వేషాన్ని, కోపోద్రేకాలను పెంచుకుంటున్నది. పాకిస్తాన్ యెన్నో దురాక్రమణ చర్యలను జరిపింది; పాకిస్తాన్ జరిపిన కొన్ని దురాక్రమణ చర్యలవలన మనదేశం ఎన్నో యిక్కట్టులను యెదుర్కొని పలు కష్టాలపాలు కావలసి వచ్చింది. వీటిలో రెండు సంఘటనలను మనం యెన్నటికీ మరచిపోలేము.

దేశ విభజన సందర్భంలో. పాకిస్తాన్ భూభాగం నుండి హింసాత్మకంగా అల్ప సంఖ్యాక వర్గాల వారిని తరిమివేసిన సంఘటన యిందులో మొదటిది. తత్ఫలితంగా మన దేశానికి వలస వచ్చిన కాందిశీకుల సమస్య రెండవ ప్రపంచ యుద్ధపు శరణార్థుల సమస్యనుగూడ మరపించివేసింది. ఈ సమస్య యింకా అపరిష్కృతంగానే మిగిలి ఉన్నది. స్వయంగా, స్వేచ్ఛగా, ఇచ్ఛానుసారంగా భారత దేశంలో విలీనమయిన కాశ్మీరులోని కొంత భాగాన్ని బలవంతంగా పాకిస్తాన్ మింగివేసింది; యిది పాకిస్తాన్ జరిపిన రెండవ దుశ్చర్య. కాశ్మీరును ముట్టడించిన దోపిడి దారుల, దొంగల మూకలు అమాయక కాశ్మీరు ప్రజలమీద విశృంఖలంగా విజృంభించినవి. వెంటనే మన సైన్యం రంగంలోనికి ప్రవేశించింది. కాని కొన్ని పరిస్థితుల ప్రాబల్యం వలన, తదితర ఒత్తిడుల కారణంగా, పాకిస్తాన్ కబళించివేసిన ప్రాంతం యెటూ తేలకుండా మిగిలిపోయింది. మనం ఐక్యరాజ్య సమితికి చేసిన ఫిర్యాదు ఫలితంగా యుద్ధ విరమణ రేఖ ఏర్పడింది; ఐక్యరాజ్య సమితి తన తుది నిర్ణయాన్ని ప్రకటించవలసి ఉన్నది. యుద్ధ విరమణ వలన ప్రయోజనాన్ని పొంది. తాను దురాక్రమణ చేసిన ప్రాంతంలో ఆజాద్ కాశ్మీరు పేరిట పాకిస్తాన్ ఒక కీలు బొమ్మ ప్రభుత్వాన్ని స్థాపించింది.

శాంతియుత పరిష్కారం కుదురుతుందనే ఆశాభావంతో భారత దేశం యుద్ధ విరమణ రేఖను ఖచ్చితంగా గౌరవిస్తున్నది. కాని పాకిస్తాన్ మాత్రం మొదటినుండే యుద్ధ విరమణ రేఖను లెక్క చేయడం లేదు. ఆక్రమిత ప్రాంతంలోని తన తొత్తుల ద్వారా, పాకిస్తాన్, లెక్కలేనన్ని సార్లు, సరిహద్దును అతిక్రమిస్తున్నది. ఇందుకు పాకిస్తాన్‌ను శిక్షించిన వారు లేరు. ఇందుకు తోడుగా పాకిస్తాన్ మన దేశానికి వ్యతిరేకంగా కలుషితమైన విద్వేష ప్రచారాన్ని కొనసాగిస్తున్నది; తిరుగుబాటు చెయ్యమని కాశ్మీరీలను పురికొల్పుతున్నది. ఇన్ని సంవత్సరాలనుండీ యీ దుష్ట పన్నాగాలన్నింటిలోను పాకిస్తాన్ పరాజయాన్ని, పరాభవాన్ని యెదుర్కొన్నది. ఒక నియంత ఉక్కు పాదాల క్రింద నలిగిపోవడంకంటే స్వతంత్ర భారత దేశంతో చేరి స్వేచ్ఛా వాయువుల్ని పీల్చడమే ఉత్తమమని కాశ్మీరీలు నిశ్చయించుకొన్నారు.

మనకు క్రొత్త సమస్యల్ని సృష్టించడానికి, మూడు సంవత్సరాల క్రిందట, చైనా మన ఉత్తర సరిహద్దులమీద దాడి చేసింది. హిమాలయా పర్వతాల్లోని విశాలమైన భూభాగాల్ని మింగేసిన తరువాత మనమైదాన ప్రాంతాల్లోనికి చొచ్చుకొనివచ్చి మరికొన్ని దురాక్రమణల్ని చేయడానికి చైనా ప్రయత్నించింది. ఈ సమయంలో, మనజాతి సమస్తం ఒకే వ్యక్తిగా, ఒక సంఘటిత శక్తిగా జాగృతమయి, శత్రువును వెనుకకు నెట్టివేయడానికి సిద్ధమయింది. ఈ దశలో యిక తనంతటతానే వెనుకకు వెళ్ళడం ఉచితం కాగలదని చైనా భావించింది.

పశ్చిమ ఖండాల్లోని ప్రజాస్వామిక దేశాలతో సైనిక సంధుల లోను, ఒడంబడికలలోను సభ్యత్వం కలిగి ఉన్నప్పటికీ యుద్ధోన్మాది అయిన కమ్యూనిస్టు చైనాతో చేతులు కలపడానికి పాకిస్తాన్ యీ అవకాశాన్ని వినియోగించుకున్నది. చైనా సహాయంతో కాశ్మీరు

తోయను సంపూర్ణంగా చేజిక్కించుకోవచ్చునని పాకిస్తాన్ విశ్వసించింది. ఈ ఒప్పందం కుదుర్చుకున్న తర్వాత పరిస్థితులు మరీ ప్రమాదకరంగా పరిణమించాయి. కిరాతక చర్యల్లోనూ, కపటోపాయాల్లోనూ పాకిస్తాను తన కొత్త మిత్రుడినే మించిపోయింది. అయిదునెలల క్రిందట అది కచ్‌లోకి చొచ్చుకొని వచ్చింది. ఇలా చొచ్చుకు రావడానికి కవ్వించే విధంగా మనమేమీ ప్రయత్నించనే లేదు. పాకిస్తాను — కచ్‌లమధ్య సరిహద్దులు ఎప్పుడూ వివాదగ్రస్తంకాలేదు. ఆదినుంచీ గౌరవింపబడుతూనే వస్తున్నాయి. అయితే 1962లో భారతదేశంమీద దురాక్రమణ చేసిన చైనా అడుగుజాడల్లోనే పాకిస్తానుకూడా నడిచి, తప్పుడు దేశపటాలు సృష్టించుకుని కచ్‌లో తనకులేని హక్కుకై వాదించడం మొదలెట్టింది. తోడేలు — మేకపిల్లకథలోలాగా కచ్‌అనే మేకపిల్లను కబళించడానికి ఏ వంక దొరుకుతుందా అని ఎదురుచూడాల్సి వచ్చింది. దానికి మనసైన్యం మరోసారి తగిన బుద్ధి చెప్పింది. తిన్నదెబ్బల్ని తడుముకుంటూ కచ్‌లోంచి పాకిస్తాను కాలికి బుద్ధి చెప్పక తప్పలేదు. మిత్రదేశాలు రంగంలోకి ఉరికి తాత్కాలిక యుద్ధవిరమణ ఒప్పందం కుదిర్చాయి.

ఈ ఒప్పందంమీద యిలా సంతకాలు జరిగాయోలేదో అలా అటు మన కాశ్మీరు సరిహద్దులపై భారీ ఎత్తున పాకిస్తాను దురాక్రమణకు పూనుకుంది. తనంత తానుగా బయటపడడం యిష్టంలేక శిక్షణ గరిపిన సాయుధ దుండగీండ్రను బహుళ సంఖ్యలో పౌరుల వేషంలో మన దేశంలోకి పంపించింది. ఈ దుండగులు కాశ్మీరులో యీ ప్రజల సాంప్రదాయ సిద్ధమైన టోపీని ధరించారు. శ్రామికుల్లాగా మట్టి గచ్చకాయరంగు వస్త్రాల్ని ధరించారు. ఆ వెనక తుపాకులు మొదలైన ఆయుధాల్ని కనిపించకుండా దాచుకున్నారు. చీకటి ముసుగుకింద ఒక్కుమ్మడిగా కాశ్మీరులోయలోంచి పొడుచుకొచ్చారు — భారీ మిలటరీ ఆయుధాలు, స్టెన్‌గన్‌లు, రాకెట్లు, ప్లాస్టిక్‌బాంబులు, యింకా ముసుగులు, విగ్గులు మొదలయిన వాటినికూడా వెంటేసుకుని అకస్మాత్తుగా ప్రవాహం మాదిరిగా చొచ్చుకొచ్చారు. ఈ గెరిల్లా దళాలకు 'జిబ్రాల్టర్ దళాలు' అని మరో సున్నితమైన నామధేయం వుంది. మన భూభాగంలో దోపిడీలు, గృహదహనాలు, హత్యలు, అల్లర్లు జరిపి తిరుగుబాటు లేవదీయడానికని పాకిస్తాను యీ దుండగీండ్రను పంపించింది. ఇదిలా చేస్తూ 'కాశ్మీరువాణి' అన్న ఒక రహస్య రేడియో కేంద్రాన్ని పాకిస్తాను నెలకొల్పింది. కాశ్మీరు ప్రజల్ని భారతదేశం పీడిస్తున్నదనీన్నీ, ఆ పీడన నుండి కాశ్మీరుకు విముక్తిని ప్రదానం చేయనున్నామనిన్నీ ఆ కాశ్మీరువాణి అభయాన్ని పలికి, తిరుగుబాటు దారులకు సహాయపడని వాళ్ళందర్నీ కాల్చి చంపేయగలమని హెచ్చరిక కూడా చేసింది. అయితే సాహసవంతులూ, మాతృ దేశాభిమానులూ అయిన కాశ్మీరు ప్రజలు ఈ కల్లిబొల్లి హెచ్చరికలను లెక్క చేయలేదు. ఆ ప్రాంతంలోని ప్రజల అండదండల్నీ సానుభూతిని సంపాదించడానికి పాకిస్తాను పన్నిన కుతంత్రం సాగలేదు. ఆ ప్రాంతంలోని ప్రజలు పాక్‌దుండగుల ఆచూకీని వెనువెంటనే మన భద్రతా దళాలకు తెలియ జేశారు. ఆ వెంటనే అనేక మంది దుండగులను ఏరివేసి పట్టుకోవడం జరిగింది. మిగిలిన దుండగుల కొరకు గాలింపు జరుగుతున్నది. త్వరలోనే వారిని కూడా పట్టుకోవడం జరుగుతుంది. కొత్తగా చేతులు కలుపుకున్న దుష్టద్వయం చైనా, పాకిస్తాను కుత్సిత బుద్ధి ప్రపంచానికి బట్ట బయలైంది.

కచ్ సంఘటన అనంతరం మన సరిహద్దు మిత్రుల రాజ్యవిస్తరణ కాంక్షకు తగు విధంగా జవాబు చెప్పేరీతిగా మన విధానాన్ని పునర్వ్యవస్థీకరించే ప్రయత్నాన్ని మన ప్రభుత్వం చేస్తున్నది. ఇంత వరకూ మనమే దురాక్రమణకు గురవుతూ వచ్చాం. మనపై దురాక్రమణం జరిగి చిన్న చిన్న సంఘటనలు అనేకం జరిగాయి. ఓర్పు వహించాం. మర్చిపోయాంకూడాను. అయితే యిప్పుడు చైనా అండదండలతో మన భూభాగాన్ని కబళించి వేయాలనే పాకిస్తాను ఆకలిని మన నాయకులు గుర్తించారు. భవిష్యత్తులో తదను గుణమైన విధానాన్ని అనుసరించాలని భావించారు. ఇలాంటి సంఘటనల్ని భారతదేశం ఎంత మాత్రమూ యిటు పై నిశ్శబ్దంగా చూస్తూ వుండిపోలేదనీ, శత్రు భూభాగంలోకి చొచ్చుకుని వెళ్ళి దురాక్రమణను ప్రతిఘటించడానికి కూడా వెనుకంజ వేయదని మన ప్రధాని ఉద్ఘాటించారు. దెబ్బకు దెబ్బ ఎదురు తీయగలమని కాశ్మీరు ముఖ్యమంత్రి కూడా ప్రకటించారు.

పాకిస్తాను చేసిన యీ ప్రయత్నాన్ని మనం వమ్ముచేశాం. బాగానేవుంది. అంతమాత్రం చేత పాకిస్తాను ప్రమాదం మనకు తొలగిపోయిందను కోవడానికి వీల్లేదు. యుద్ధవిరమణ శ్రేణిని దాటి రావడానికి అసంఖ్యాకంగా గెరిల్లా దళాలు సిద్ధంగా వున్నట్టు వార్తలు వస్తున్నాయి. అందుచేత మనం అప్రమత్తులమై, కాశ్మీరు లోయలో దురాక్రమణకు పూనుకున్న పాకిస్తాను ప్రయత్నాల్ని వమ్ముచేయడానికి కంకణం కట్టుకున్న మన కాశ్మీరు సోదరులకు అండదండలను అందజేయడానికి సంసిద్ధులమై ఉండాలి. మన స్వరాజ్యాన్ని పరిరక్షించుకోవాలీ అంటే కాశ్మీరు స్వేచ్ఛను మనం కాపాడుకోవాలి. అందుచేత మనందరమూ మనసా, వాచా, కర్మా ఏకమవుదాం. కలిసివుంటేనే కలదుబలం. మనం కలిసివుంటే ఏశక్తి మన స్వేచ్ఛకు విఘ్నంకలిగించలేదు. అందుచేత దేశ సమైక్యతకు మన రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నానికి ప్రతి పౌరుడూ సహాయ, సహకారాలని అందివ్వమని ప్రతి పౌరుడికి నేను విన్నవించుకుంటున్నాను.

జైహింద్

ప్రతిభావంతమైన మంచి కృషికి అడ్వాన్సు ఇంక్రిమెంట్లు, నగదు బహుమతులు

ప్రతిభావంతమైన చక్కటి కృషికిగాను బహుమతులు, అడ్వాన్సు ఇంక్రిమెంట్లు మొదలయిన వాటి రూపంలో ప్రభుత్వోద్యోగులకు ప్రోత్సాహాన్ని కలిగించే ఒక పథకాన్ని 1962 అక్టోబరులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఆఫీసుల్లో పనిని మెరుగుపరచడానికి, నిర్వహణ విధానాలను అభివృద్ధి పరచడానికీ సలహాలను ప్రభుత్వోద్యోగులు యివ్వడానికి వీలుగా వారిని ప్రోత్సహించే నిమిత్తం వారికి గ్రాంట్లను యిచ్చే ఒక సలహా పథకాన్నికూడా 1965 జనవరిలో ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

కొన్ని ప్రత్యేక ప్రోత్సాహ బహుమతుల మంజూరికై సిఫారసు చేస్తూ ఆయా శాఖల వద్దనుంచి వచ్చిన ప్రతిపాదనలను ప్రోత్సాహక బహుమతుల సంఘం పరిశీలిస్తున్నది. ఆయా ప్రతిపాదనలను పరిశీలించి బహుమతులను అందజేయవచ్చని ప్రభుత్వానికి సిఫారసు చేసే నిమిత్తం యీ సంఘం ఏర్పాటు చేయబడింది. తదనుగుణంగా ఈ సంఘం చేసిన సిఫారసులను ప్రభుత్వం జాగ్రత్తగా పరిశీలించి యీ దిగువ పేర్కొన్న బహుమతులను ప్రకటించింది:

జాతీయ అత్యయిక పరిస్థితిని ఆదుకోవడానికిగాను బీహారు రాష్ట్రానికి రోడ్డు రోలర్లను తీసుకువెళ్ళిన 38 మంది డ్రైవర్లకు, 34 మంది క్లీనర్లకు వారు అత్యంత క్లిష్టసమయంలో, బహు కష్టాలకు ఓర్చి చిక్కులతో కూడిన ప్రాంతంలో చేసిన సేవను, విధి నిర్వహణను గుర్తిస్తూ ఒకొక్కరికీ రెండేసి అడ్వాన్సు యింక్రిమెంట్లు.

పోలీసు ట్రాన్స్‌పోర్టు ఆర్గనైజేషన్‌లోనూ, పోలీసు ట్రాన్స్‌పోర్టువర్క్‌షాపులోనూ కొత్త పద్ధతులను కనిపెట్టి కాలాన్నీ, డబ్బునూ అధిక వ్యయానికి లోనుగానీయకుండా చేసినందుకు పోలీసు ఇన్‌స్పెక్టర్ జనరల్ కార్యాలయం లోని పోలీసు ట్రాన్స్‌పోర్టు అధికారి శ్రీ విద్యాసాగర్‌కు ఒక అడ్వాన్సు యింక్రిమెంటు.

ప్రతిభావంతమైన నేర పరిశోధక కృషికిగాను సి. ఐ. డి. క్రైం బ్రాంచి లోని డిప్యూటీ పోలీసు సూపరింటెండెంట్ శ్రీ ఎన్. రామచంద్రన్‌కు రెండు అడ్వాన్సు యింక్రిమెంట్లు.

రెవిన్యూ ఆదాయంలోని అవకతవకలను కనుగొని ప్రత్యేక శ్రద్ధతో తమ విధులను నిర్వహించినందుకుగాను రిటైర్ అయిన జిల్లా రిజిస్ట్రార్ శ్రీ యస్. కృష్ణమూర్తికి రూ. 300 ల. సబ్ రిజిస్ట్రార్ శ్రీ ఎ. నరసింహంకు రూ. 120 ల రొక్కం బహుమానం.

విధి నిర్వహణను విస్వార్థతతో నెరవేర్చి, ఎన్నికల తర్వాత ప్రభుత్వ ఎన్నికల సరంజామాను భద్రపరచిన గుడిసెకు అగ్ని ప్రమాదం సంభవించిన సమయంలో ప్రదర్శించిన ధైర్య సాహసాలకుగాను రుద్రవరం బ్లాకులోని విస్తరణ శాఖాధికారి (పశుపోషణ శాఖ) శ్రీ వి. సి. వెంకటేశుకు రూ. 250 ల రొక్కం బహుమతి.

ఆడిట్ అభ్యంతరాలను త్వరితగతిని పరిష్కరించడంలో చొరవను ప్రదర్శించి ముమ్ముందు జాగులేకుండా కార్యనిర్వహణ జరగడానికి మార్గాలను యేర్పరచినందుకుగాను పశుపోషణశాఖ డైరెక్టర్ కార్యాలయంలోని అకౌంట్సు ఆఫీసరు శ్రీ ఒ. ఎ. సోహేల్‌కు రూ. 500 ల రొక్కం బహుమానం.

కర్నూలులోని ప్రభుత్వప్రెస్‌లో పెద్దమొత్తంలో నిల్వ ఉన్న ఫారాల విషయం త్వరితగతిని పరిష్కరించినందుకుగాను ప్రింటింగ్ డిప్యూటీ డైరెక్టరు శ్రీ వి. యస్. రామస్వామికి రూ. 500 ల రొక్కం బహుమానంగా యిస్తారు.

పంచతంత్రము

సంజీవకుని అనుభవమున పింగళకుడు జ్ఞానశాలి అయ్యెను. కర్కట దమనకులకు రాజానుగ్రహము తగ్గెను. నక్క మేకతో పోరాడిచచ్చినకథను వారు తమజ్ఞప్తికి తెచ్చుకొనిరి. దేవశర్మ అను సన్యాసి సజ్జనులిచ్చిన వస్తువులను ఎవరిని నమ్మక దాచు కోగా ఆషాడభూతి అనునతడు దేవశర్మను మోసగించి అపహరించెను. ఈ దేవశర్మ ఒక సాలెవాని అతిథిగాఉండగా -

(గతసంచిక తరువాయి)

దేవశర్మను కులట తనయింటికి తీసుకువచ్చి ఒక కుక్కమంచమును అతనికి చూపి: "మహాత్మా ఇందు కూర్చుండుడు. గ్రామాంతరమునుండి వచ్చిన నా సఖురాలిని చూచి త్వరలోనే తిరిగి వచ్చెదను. అంతదాక మీరు మా యింటిలోనే జాగ్రత్తగా ఉండుడు." అని చెప్పి శృంగారముగా అలంకరించుకొని "దేవదత్తుడు" అను తన ఉపపతికడకు వెడలుచుండెను. అప్పు డామె భర్తయెదురయ్యెను. ఆతడు మద్యపుమత్తుతో వెంట్రుకలు విరబోసుకొని అడుగులు తొట్రుపడుచు మద్యభాండమును చేత పుచ్చుకొని వచ్చుచుండెను. ఆతనిని చూచి ఆమె వెంటనే పరుగెత్తుచు తిరిగి తన యింటిలో దూరి తన శృంగారాలంకారము లన్ని తీసివేసి పూర్వమువలెనే సామాన్య స్థితిలో ఉండెను. సాలెవాడు అట్లు శృంగారములు చేసుకుని పరుగెత్తుచున్న ఆమెను చూచెను. అంతకు పూర్వమే అతడు ఎన్నియో పర్యాయములు ఆమె దుశ్శీలమునుగూర్చి కర్ణపరంపరగా వినుచుండెను. అప్పుడు తనకు భార్యద్వారా వచ్చిన అపవాదమువలన మనస్సులో క్షోభపడుచు తన ఆకారమును ఇతరులకు కనవరచకుండ ఎల్లప్పుడు రహస్యముగా నేటిదాక ఉండెను. ఈనాడు ఆమె దుష్టచేష్టలను కనులార చూచెను. తాను లోగడ వినిన విషయము సత్యమే అని నిశ్చయించుకొనెను. సాలెవాడు కోపముతో యింటికిపోయి, "ఓ పాపిష్ఠురాలా! ఎక్కడికి పోవుచుంటివి?

కులట: నేను నీ దగ్గరినుండి వచ్చినతర్వాత ఎక్కడికి పోలేదు. నీవు తప్పత్రాగి అప్రస్తుతమైన మాటలు మాట్లాడుచుంటివి.

సాలె: (ఆమె ప్రతికూల వచనములు విని, శృంగార వేషమును మార్చుకొనియుండుటను చూచి) ఓ దుశ్శీలురాలా! చాలకాలము నుండి నీకు గల అపకీర్తిని వినుచునే ఉన్నాను. ఇప్పుడు నేను నీ దుష్టచేష్టితము ప్రత్యక్షముగా చూచితిని, తగినశాస్తి చేసెదను.

అని చెప్పి దుడ్డుకర్రను పుచ్చుకొని ఆమెను మెదుగకొట్టి స్తంభమునకు విరిచికట్టి అతడుకైపుచేత నిదురబోయెను. తరువాత ఆమె స్నేహితురాలు. ఒకమంగలి స్త్రీ వచ్చి. ఆ సాలెవాడు నిద్రబోవుచుండుటను చూచి ఆమెతో:

మంగలి: సఖీ! ఆ దేవదత్తుడు సంకేత స్థానములోనే నీకై వేచి ఉన్నాడు. త్వరగారమ్మ.

కులట: చూడుము నా అవస్థ. నేను ఎట్లు పోగలుగుదును? కనుక నీవు పోయి నా ప్రియునితో 'ఈ రాత్రి అతనితో కలియుటకు నాకు వీలుపడదు అని చెప్పుము.

మంగలి స్త్రీ: సఖీ! నీవు అట్లు అనకూడదు. ఇది కులటాధర్మము గాదు.

కులట: అట్లయిన నే నీ బంధనములతో అక్కడికి ఎట్లు వెళ్ళగలను? పాపాత్ముడైన నా పతి యిక్కడనే ఉన్నాడు.

మంగలి స్త్రీ: సఖీ! ఇతడు మద్యము త్రాగి కైపులో పడిఉన్నాడు. శరీరమునకు సూర్యకిరణములు తాకినప్పుడే మేల్కొనగలడు. అందువలన నీ కట్లు విప్పెదను. నీ స్థానములో నన్ను కట్టివేసి నీవు త్వరగా పోయి దేవదత్తుని తృప్తిపరచి తిరిగిరమ్మ.

కులట: అట్లే కానిమ్మ.

అప్పుడు మంగలి స్త్రీ ఆ కులట కట్లను విప్పి తాను కట్టుబడిఉండి ఆమెను దేవదత్తునివద్దకు పంపెను.

ఆ తరువాత కొంతసేపటికి సాలెవాడు మేల్కొని కొంచెము కోపము శాంతించినవాడై కైపు తగ్గగా ఇట్లనెను, "ఓ పాపిష్ఠీ! నేటి నుండి నీవు ఇంటినుండి బయటకు వెళ్ళకూడదు. పరుషములు మాట్లాకూడదు. దీనికి నీవు అంగీకరించిన యెడల నీ కట్లు విప్పెదను." ఆ మాటలు విని ఆ మంగలి స్త్రీ తాను బదులు చెప్పినచో కంఠస్వరము మారును అనుభయము చేత అత డెన్నిసార్లు ప్రశ్నించినను ఆమె బదులు చెప్పకుండెను. అది చూచి అతడు మిక్కిలి కోపపడి పదును కత్తితో ఆమె ముక్కును కోసెను. "ఓ కులటా! నీవు ఇలాగే ఉండుము. ఇక ఎప్పుడుకూడ నేను నిన్ను ఆదరించను." అని వదరుకొనుచు మరల నిదురపోయెను.



తనకు కలిగిన ధననాశమువలన చింతించుచు నిద్రపట్టక ఆ కుక్కిమంచముపై అక్కడనే కూర్చున్న దేవశర్మ ఆ స్త్రీ ప్రవర్తనంతయు కనిపెట్టుచుండెను.

కొంత సేపటికి ఆ సాలెవానిభార్య దేవదత్తుని వద్దనుండి తిరిగి యింటికివచ్చి మంగలిస్త్రీతో "సఖీ! నీకు క్షేమమా? నేను వెడలినతర్వాత యీ పాపాత్ముడు మేల్కొనలేదుకదా?" అని అడిగెను. ఆ మాటలకు ఆమె "ముక్కువినా అంతా క్షేమమే. నీ పతి నన్ను కనిపెట్టుటకు పూర్వమే తొందరగా నా కట్లను విప్పుము. ఇంటికి వెళ్ళెదను" అని చెప్పెను. సాలెవానిభార్య అలాగే ఆ మంగలిస్త్రీని విడిచి పంపెను.

కొంతసేపటికి సాలెవాడు మేల్కొని భార్యతో "ఓ దుర్మార్గురాలా! ఇప్పటికి కూడ నీవు మాట్లాడవా? మాట్లాడకున్నచో చెవులుకూడ ఛేదించెదను." అని అనెను. అది విని ఆమె కోపముతో అతనిని అధిక్షేపించెను: "ఓ మూఢుడా! మహాపతివ్రతనైన నన్ను బాధించుటకుగాని నిందించుటకుగాని ఎవరు సమర్థులు. ఓ దేవతలారా! వినుడు. నేనే పతివ్రతనైతినేని, మనస్సులో కూడ పరపురుషుని కోరని దాననైతినేని, మీరు తిరిగి నా ముక్కును ఉన్నదున్నట్లుగా చేయుడు. అట్లుకాక నా మనస్సులో పరపురుషునిగూర్చిన తలంపుకూడ ఉండెనేని నన్ను దహించి భస్మము చేయుడు." అని ప్రార్థించినట్లు నటించెను. భర్తతోకూడ "ఓ దుర్మార్గుడా! చూడుము నా పాతివ్రత్య మహిమచేత నా ముక్కు పూర్వమువలెనే తిరిగి వచ్చినది." అని అనెను. ఆ మాట విని అతడు ఒక మండుచున్న కొరవి వెలుగుతో ఆమెముక్కు యథాస్థితిలో ఉండుటను, క్రింద పడిఉన్న మఱియొక ముక్కును, రక్త ప్రవాహమును చూచి ఆశ్చర్యపడెను. అప్పుడు కట్లు విప్పి ఆమెను చేరదీసి సంతోషపరచెను. ప్రక్కన ఉన్న దేవశర్మ ఆశ్చర్యపడుచు ఆ రాత్రి అతికష్టముతో గడిపెను.

ఆ దూతి ముక్కు తెగి తన యింటికి పోయి, "ఇప్పుడు నేను ఏమిచేయుదును. నాకు కలిగిన యీ అవమానమును ఏ విధముగా కప్పిపుచ్చుదును." అని చింతించుచుండెను. రాత్రియంతయు రాజుగారి బంగళాలో ఉద్యోగములో నుండిన ఆమెభర్త తెల్లవారేసరికి ఇంటికి వచ్చి ఊరిపని అవసరముగా ఉన్నందువలన మంగలిపొదిని తొందరగా ఇవ్వమని తన భార్యను అడిగెను. ముక్కుతెగియున్న ఆమె

సమయోచితప్రతిభ కలదై ఇంటిలోనే ఉండి పొదిలోనుండి ఒక కత్తిని తీసి అతనికి పంపెను. ఆ ఒక్క కత్తినిమాత్రము చూచి కోపానిష్టుడై దానిని తిరిగి ఆమెకడకే పంపెను. ఇంతలో ఆ దుష్టురాలు చేతులు పైకెత్తి పెద్దగా మొరపెట్టుచుండగాను యింటి నుండి బయటకు వెళ్ళెను. "అయ్యో! యీ పాపిష్ఠుడు అమాయకురాలనైన నాముక్కును కోసినాడు చూడుడు. నన్ను రక్షించుడు. రక్షించుడు." అని బిగ్గరగా అరచెను. ఇంతలో రక్షకభటులు వచ్చి ఆ మంగలివానిని కర్రలతో కొట్టి భార్యతో కట్టి ముక్కుతెగిన భార్యతోపాటు న్యాయస్థానమునకు తీసుకొని పోయిరి. అక్కడ న్యాయాధికారులతో "ఓ సభ్యులారా! వినుడు, ఈ మంగలివాడు నిరపరాధురాలైన స్త్రీని హింసించినాడు. ఇతనికి తగిన శిక్ష విధింపుడు." అని చెప్పగనే న్యాయాధిపతులు "ఓరీ! మంగలీ ఎందుకు నీవు భార్యను హింసించితివి? ఈమె పరపురుషుని కోరెనా? లేక, నీకు ప్రాణాపాయము తలపెట్టెనా, లేక దొంగతనము చేసెనా? ఈమె చేసిన అపరాధమేమి?" అని అడిగిరి. ఆ మంగలివాడు దెబ్బలబాధచే మాటలాడలేక సొమ్మసిల్లి ఉండెను. మాటాడకుండ ఉన్న అతడు అపరాధి యని తలచి న్యాయస్థానమువారు "ఆహా! రక్షకభటులమాట సత్యమే. ఈ పాపాత్ముడు నిర్దోషురాలైన యీ అమాయక స్త్రీని హింసించెను. ఇతడు దుష్టుడు. స్త్రీ హింసకుడు తప్పక వధార్హుడు. అందువలన ఇతనిని ఉరితీయవలెను." అని చెప్పిరి. ఆ నిర్ణయము ప్రకారము వధ్యస్థానమునకు అతడు తీసికొనిపోబడుచుండెను. అప్పుడు



దేవశర్మ చూచి న్యాయాధికారులతో "ఓయీ! ఏమియెరుగని యీ మంగలివానిని అన్యాయముగా చంపించుచున్నారు. సత్యమైన సమాచారమును నేను చెప్పెదను వినుడు." అని దేవశర్మ లోగడ జరిగిన నక్క, ఆషాఢభూతి, దూతి యీ ముగ్గురికథలను చెప్పెను. అదివిని అందరు విస్మయపడి, మంగలిని విడిచిరి. దూతిచేసిన అపరాధమునకు నాసికాచ్ఛేదము ఆమె దుష్కృత్యము వల్లనే జరిగినది, ఇప్పుడు ఆమె చెవులుకూడ కోసి రాజదండనము విధించవలెను — అని ఆమె కర్ణచ్ఛేదనము చేసిరి. ఆ సంఘటన చూచిన దేవశర్మ ధననాశమువలన తనకు కలిగిన శోకమును విడిచినవాడై తన మఠమునకు తిరిగిపోయెను.

అందువలన పై మూడు కథలకు సంబంధించిన వృత్తాంతమును నేను తొలుత సూచించితిని అని దమనకుడు అనెను.(సశేషము)

బతికిన కాలేజీ

పాలగుమ్మి పద్మరాజు

సీరియల్ : 6

జరిగినకథ

శంకరయ్య జ్యోతిషంలో దిట్ట. ఆ యింటిలోని అందరికందరూ తలా ఒక తరహా మనుషులు. కూతురు రాధ పెళ్ళి సంబంధం నిమిత్తం వెళ్ళిన పెళ్ళిళ్ళ పేరయ్యా పట్టూ మరికొంతమంది పరివారంతో అకస్మాత్తుగా అడుగు పెడతాడు. పెళ్ళిళ్ళ ప్రస్తావన జ్యోతిషంమీదకు ఎగిరి, సిద్ధాంత, రాద్ధాంతాలతో సిగపట్లగోత్రంవరకూ వచ్చేసరికి, ఆ యింటి యిల్లాలు శాంతమ్మ అతి తెలివిగా ముందుచూపుతో కళ్ళుతిరిగి పడిపోవటంతో గొడవ మాని ఎవరి దారిన వాళ్లు చల్లగా జారుకుంటారు. అయితే రాధ అందంలో చిక్కుకున్న పట్టూ, పేరయ్య సహాయంతో స్నేహితుడైన చింతా సలహాకై అతనివద్దకు వెళతాడు. చింతా సలహాతో రంగంలో దిగిన పేరయ్య రామయ్యవద్దకు వెళ్ళి పెళ్ళి ప్రస్తావన తెచ్చి పట్టూ రాధనే పెళ్ళి చేసుకోవాలనుకున్న సంగతి తెలియజేస్తాడు. రామయ్య మంగలిరాముడి సహాయంతో పట్టూ పథకానికి అడ్డుపుల్ల వేసి తన బాధ్యత నెరవేర్చుకుంటాడు. కాని పరిస్థితి తీవ్రమై కుమారుడు ఇల్లు వదిలేస్థితిలో రామయ్య తాను ఓడిపోయానని గ్రహించినా, దానికిమాత్రం సమ్మతించడు. రామయ్యను ఈ వివాహానికి ఒప్పించి, పెళ్ళిళ్ళ పేరయ్య రాధ తండ్రి శంకరయ్యనుకూడా ఒప్పించి, పెళ్ళికి ముహూర్తం పెట్టిస్తాడు. శాంతమ్మగారికి వచ్చిన వంశానికి సంబంధించిన అనుమానాన్ని ఒక ఆకాశ రామన్న ఉత్తరం ద్వారా పరిష్కరిస్తారు. పెళ్ళి ఏర్పాట్లన్నీ జరుగుతూ ఉంటాయి. రాధ తన ఆలోచనలో మునిగిఉండగా, పట్టూ తన కారును బాగుచేయిస్తాడు.

మొగపెళ్ళివారి పార్టీ ముగ్గురే. పట్టూ, రామయ్యా, సుబ్బమ్మా. పట్టూ కారు తోలుతున్నాడు. రామయ్యా, సుబ్బమ్మా వెనకాలసీటులో కూర్చున్నారు. వాళ్ళ ముఖాలమీద అపనమ్మకం ముద్ర వేసినట్టు స్థిరపడి పోయింది. కొన్నేళ్లుగా మూల పడుకున్న కారది. ఏ క్షణంలోనన్నా విశ్రమించాలన్నకోరిక బలవత్తరమైతే అది ఆగి పోవచ్చని వాళ్ళ భయం. అదీగాక, దాని గురగురలూ, ఫెటఫెటలూ, ఆకస్మిక గుంయూటాలూ చూస్తే పట్టూచేతుల్లోంచి తప్పించుకోవాలని అది తాపత్రయపడుతున్నట్టు వాళ్లకి అనుమానం. పట్టూ కాస్త పట్టు సడలించాడంటే, దాన్ని వెనకటి నిద్రమత్తు మళ్ళీ ఆవహిస్తుందని వాళ్ళ నమ్మకం.

అయితే ఏ అవాంతరం లేకుండా సగం దూరం పైగా లాగేసింది కారు. అంచేత ఇంక అడంగుకి చేరుకోవచ్చునన్న నమ్మకం కలిగింది ముసలా ళ్ళిద్దరికీ, వాళ్ళు మెల్లగా జోగారు. నిద్రపోయారు.

రాత్రిళ్ళు కారు తోలేవాడికి పక్కవాళ్లు మెలుకువగా ఉండాలి. ఎవళ్ళన్నా జోగితే, తోలేవాడికీ కునుకొస్తుంది. వెనకసీటులోంచి రెండుగుర్రులు తన్ని జో కొడుతుంటే ఎంతసేపని మెలకువగా ఉండగలడు పట్టూ? తనకి తెలీకుండానే జోగాడు.

విధిలాగే, కారుకూడా మనం ప్రమత్తులమై ఉన్నప్పుడే గట్టిదెబ్బ తీస్తుంది. గండం గడిచిపోయిందనుకుంటాం. ఇంక మనకేం ఫరవాలే దనుకుంటాం. నిశ్చింతగా నిద్రపోతాం. కలలుకూడా కంటాం — తియ్యని కలలు. అనుకోకుండా అకస్మాత్తుగా అవి పీడకల లై పోతాయి.

పట్టూ తీయని కలలు కంటున్నాడు. కనడం మొదలుపెట్టాడు. నుదురు పగిలేటట్టు పడింది దెబ్బ. అతను కళ్లు తెరిచేసరికి కారు దీపాలు రెండూ అమితవేగంగా ఒక గోడ వేపు వెడుతున్నాయి. చర్రున ఎడంపక్కకి తిప్పాడు పట్టూ, రోడ్డు అటుందని భ్రమపడి. అకస్మాత్తుగా పశువులకొట్టం ఒకటి కారు మీదికి దాడి చెయ్యబోయింది. దాని ప్రమాదాన్నించి కారుని తప్పించబోతే గడ్డిమేటి ఎదురైంది. ఆఖరికి పట్టూ ఒక కోడిపెట్టని తరుముతూ కారుని మురికికాలవ దాటించాడు. కోడిపెట్ట పదిమందిపెట్టు గోల చేస్తూ అడ్డదిడ్డంగా పరుగెత్తింది. కారు దాన్ని వదలకుండా తరిమింది. కోడిపెట్ట ఆత్మరక్షణం కోసం ఒక తూముకింద దూరింది. కారు తూములోకి పోలేని కారణంచేత, దానిమీది కెక్కి, కోడిపెట్టమీదికి ఎక్కాలన్న గర్వంతో ఆ తూము తాలూకు అడ్డుగోడని పరామర్శించింది. ఆ ఊపుతో వెనక నిద్రపోతున్న రామయ్యా సుబ్బమ్మా ముందుసీటుమీదికి ఎగిరిపడ్డారు. పట్టూ గుండెల్లో నడిపేచక్రం బలంగా గుచ్చుకుంది. సుబ్బమ్మ నుదుటిమీద ఉసిరికాయంత బొప్పి కట్టింది. రామయ్య చెవి కొంచెం కోసుకుపోయింది. కారు ఆగిపోయింది. అప్పుడు అందరికీ నిద్రమత్తు వొదిలింది.

పట్టూ దిగాడు. బోనెట్ ఎత్తాడు. చీకట్లో అతనికేమీ కనిపించలేదు. బోనెట్ దింపాడు. కారు స్టార్ట్ చెయ్యడానికి ప్రయత్నం చేశాడు. ఇంజన్ పూర్తిగా నిద్రపోయింది. ఎంత బలవంతపెట్టినా అందుకోలేదు. ఇంతలో

నలుగు రయిదుగురు జనం చేరారు. పట్టూ వాళ్ళని తొయ్యమన్నాడు. వాళ్ళు తోశారు. పట్టూ గేరు వేశాడు. కారు ముందుకీ వెనక్కీ గుంజింది, మళ్ళీ తోశారు జనం. పట్టూ మళ్ళీ ప్రయత్నించాడు. ఈవిధంగా ఆ పల్లెనుంచి ఒక మైలుదూరం తోశారు. పట్టూ డబ్బిస్తానన్నాడు. డబ్బిచ్చి అడంగుదాకా తోయిస్తాడేమోనని జనం జవాబు చెప్పకుండా వెళ్ళిపోయారు.

పెళ్ళివారి ఊరి కింక పదిమైళ్లుంది. ఆఖరి బస్సు వెళ్ళిపోయిందట. మర్నాడు ఉదయం ఎనిమిదిగంటల ప్రాంతాన్ని మొదటిబస్సు ఆదారిని వస్తుందట. ఈ పదిమైళ్ళూ పట్టూ నడవగలిగినా, తలి తండ్రులు నడవలేరు.

"నాన్నా! ఆ ఊళ్ళో రెండెడ్లబళ్ళు ఎవరన్నా కడతారేమో కనుక్కొస్తా." అన్నాడు పట్టూ. సుబ్బమ్మా రామయ్యా మౌనంద్వారా తమ నిరసనాన్ని వ్యక్తపరిచారు.

పట్టూ ఊళ్ళోకి వెళ్ళి ప్రయత్నించాడు. రెండెడ్లబళ్లు కొన్ని ఉన్నాయిగాని ఎడ్లు ఊళ్ళోలేవు. దూడలన్నీ కుప్పనూర్పిలికి పొలాల్లో ఉన్నాయి. అసలా పల్లెటూరు ఒక ఊరేకాదు. రోడ్డుకి రెండుపక్కలా పది పదిహేను ఇళ్ళున్నాయి. అవి ఇళ్ళూకాదు, కొంపలు. అందులో ఒకఇంట్లో ఊరి కంతకీ ఒకచేదుకాణం ఉంది. కిరాణా సరుకులు, కూరలు, కాఫీఫలహారాలు, బీడీ కిళ్ళీలూ అన్నీ అక్కడొక్కచోటే దొరుకుతాయి.

పట్టూ అతికష్టంమీద, ఇరుగుపొరుగు సహాయంతో దుకాణదారుని లేపాడు. దుకాణదారు కిరసనాయిలుబుడ్డీ దీపం వెలిగించి, రాత్రికూడా మూగిన ఈగల్ని కుంచికర్రతో తోలి, తనదగ్గరున్న తినుబండారాలు చూపించాడు. అవన్నీ ఆరోజుని చేసినవేనని హామీ ఇచ్చినమీదట, పట్టూ ఒక్కపకోడీ రుచి చూశాడు. అది కంఠం దిగి కడుపులో విప్లవం రేకెత్తించకుండా, అతికష్టంమీద దాన్ని ఉమ్మేసి, అంత ప్రమాదం లేని వస్తువు లేమన్నా ఉన్నాయేమోనని కొట్టంతా కలియవెతికితే, సగం మాగిపోతున్న అరటిపండ్లు కంట బడ్డాయి.

రాత్రిభోజనం, మంజుమలె దజను అరటిపళ్ళూ, ఒకగిన్నెడు మజ్జిగా పట్టుకుని పట్టూ కారుదగ్గిరికి తిరిగొచ్చాడు. బండి దొరకలేదని చెప్పినప్పుడు కూడా రామయ్య మౌనంగానే వున్నాడు. దొరకదని, తనకిముందే తెలిసినట్టు. ఆమౌనం, పట్టూ పట్టుదల ఎక్కువచేసింది. ఉద్రేకంగా కారుకింద వెల్లగిలా దూరాడు. దానికిటుకేదో కిందిభాగంలో ఉన్నట్టు చీకట్లో చేతితో ఇక్కడా అక్కడా తడిమాడు. ఉద్రేకం తగ్గాక నీరసంగా బయటికి వచ్చాడు.

"ఈ దొక్కుకారుని నమ్మలేంరా అని చిలక్కి చెప్పినట్టు చెప్పా, వింటేనా!" అన్నాడు రామయ్య.

ఈసారి పట్టూ మౌనం వహించాడు. ఏంచెయ్యడానికీ తోచక కారెక్కి సీట్లో వెనక్కి జేర్లబడ్డాడు. కునికాడు క్రమంగా. ముగ్గురూ కునికారు.

పట్టూకి ఎన్నో కలలు. అందులో ఎన్నో కార్లు, ఆకార్లు దారితప్పి, కొన్ని గాలిలోనూ, కొన్ని నీటిమీదా నడుస్తున్నాయి. నీ రెందుకొచ్చిందంటే, అసలు పట్టూ నీటిమధ్య ఒక చిన్న ఇసకతిన్నెమీద చిక్కుపడిపోయాడు. అంతకంతకీ నది పొంగు



తోంది. అప్పుడే తిప్ప మునిగిపోయింది. మోకాలులోతు అనుకుంటుండంగానే నీళ్లు మొలలోతుదాకా పెరిగాయి. చటుకుని ఒక కారు హెలికాప్టరుగా మారి అతని కోతాడు తగిలింది. అది అతను తట్టుకుని పైకి ఎగబాకబోతుంటే అది ఎగిరింది. అత నల్లాగే వేళ్లాడుతున్నాడు. అకస్మాత్తుగా పెళ్ళిపందిరి కింద కనబడింది. సన్నాయి హోరుకి చెవులు తిమ్మిరెక్కుతున్నాయి. గాస్‌లైట్లు శరవేగంతో తనమీది కొస్తున్నాయి. కెవ్వుని కేక వేశాడు పట్టూ. కళ్ళు తెరిచి చూశాడు ఒక పెద్దలారీ పెద్ద చప్పుడు చేస్తూ తన కారుని దాటిపోతోంది. ఒక్క గెంతు గెంతి, కేకలేస్తూ, లారీ వెనకాల పడ్డాడు. అరమైలు తంటాలు పడ్డాక లారీ ఆగింది.

"ఏంటయ్యా," అన్నాడు లారీడ్రైవరు.

"తెలీదు. కారే...ఆగిపోయింది–పెళ్ళి రేపొద్దున్న కొప్పాకలో," అన్నాడు పట్టూ వాగురుస్తూ.

"తెల్లారీసరికి ఇసాక పట్టం సేరాలయ్యా," అన్నాడు డ్రైవరు.

"పెళ్ళంట్రా పాపం," అన్నాడు కండక్టరు.

"ఈ పెళ్ళిసంగ తట్టా ఉణ్ణీ, మస్తాన్ సాయిబ్బు మన పెళ్ళి సెయ్యడా రేపొద్దు కాళ?" అన్నాడు డ్రైవరు.

అంతవరకూ నిద్రపోతూ అప్పుడే లేచిన మూడో ఆసామీ, "షైరు పోయిందంటే, మస్తాన్‌సాయిబ్బు సూడొచ్చాడా?"

"అబ్బాయిగారు మన కట్టం ఉంచుకోరులే బామ్మరిదీ," అన్నాడు.

పట్టూ తో ప్రమేయంలేకుండానే బేరసారాలు ఆ ముగ్గురిమధ్యా జరిగిపోయాయి. పట్టూ కారుని లారీవెనక తాటితో కట్టేసి, కొప్పాకదాకా లాగించినందుకు పట్టూ లారీ వాళ్ళకి పాతికరూపాయ లివ్వడానికి నిర్ణయమైపోయింది. చాలా తేలికలో పడ్డాననుకున్నాడు పట్టూ.

లారీ తిప్పి కారు ముందు పెట్టడం, రెంటినీ కలిపి తాడుతో కట్టడం అయిదు నిమిషాల్లో ముగించారు లారీవాళ్ళు. లారీ డ్రైవరు పట్టూకి కొన్ని హెచ్చరికలు చేశాడు.

"తంపురు నిద్దరోతే అంతా గల్లంతే. కోడికును కొచ్చినాసరే, గుద్దేశామన్నమాటే ఎడ్డులెత్తేసుకునే తోలండి. రెండు కార్లకీ మద్దిన తాడు టంచన్ గుండాలి. అది సళ్ళత్తే మీ సక్రాలకింద మాడతడిపోద్ది–సచ్చాంవన్నమాట, లడీయా?"

కార్లు కదిలాయి లారీ దుమ్మెత్తిపోసింది. పట్టూ ఉక్కిరిబిక్కిరైపోయి స్టీరిం గొదిలేశాడు. కారు సర్కసులో అరితేరిన హాస్యగాడిలాగ ఎన్ని చిత్రాలైనా చేసింది. రోడ్డుపక్కనున్న పంటకాలవలోకి దిగాలన్న దాని కోరికను పట్టూ ఆఖరి క్షణంలో వమ్ముచేసి, బలవంతంగా రోడ్డు మీదికి తిప్పాడు. ఇంతలో కుడివైపు చక్రం కుంటడం మొదలెట్టింది. పట్టూ బలంగా హారన్ నొక్కాడు కాని లారీ హోరులో వెనక హారన్ లారీ డ్రైవరుకి వినపడ లేదు. అతడు తన్ను కాదన్నట్టు లారీ తోలుకుపోతుంటే, వెనక కారు మొగ్గలు వేసే స్థితి కొచ్చింది. ముగ్గురూ పెద్దగా అరిచారు. ఆఖరికి లారీ ఆగింది. ఆతరవాత పట్టూని పక్కకి కూచోమని, లారీ కండక్టరు కారు బాధ్యత పుచ్చుకున్నాడు ఆ తరవాత ఏం జరిగిందో పట్టూకి అంతగా తెలీదు.

ఏదో ఇంటిదగ్గర కారాగింది. ఎవరో అతన్ని లేపారు. అతడు లేచి వెళ్ళి ఏదో అరుగుమీద పడుకున్నాడు.

* * *

భజంత్రీలు మోతగా వాయించడం మొదలుపెట్టారు. పట్టూ ఆ బాజాలు నిర్లక్ష్యం చేసి రెండో పక్కకి తిరిగిపడుకున్నాడు. ఓ పందమంది కలిసి అతన్ని లేపినట్టు అతనికి గుర్తు. అతను లేవగానే చొక్కా విప్పించి కంకరదుమ్ము పెద్ద మేఘంలా లేచినట్టు చూచాయగా అతనికి తెలుసు. ఆ తరవాత నీళ్ళగదిలో మంగలి అతని తల మీద నూనె మర్దన చేస్తున్నప్పుడు అతను మళ్ళీ నిద్రపోయాడు. వెచ్చగా నీళ్ళు అతని తలమీదినించి శరీరం మీదికిజారుతుంటే అతని మత్తు మరికాస్త ఎక్కువైంది. అకస్మాత్తుగా కారు ఇంజన్ చప్పుడు వినబడింది. అతనికి మెలకువ వచ్చింది. బయటికి పరుగెత్తాడు. తడితొడలాగూ, ఒంటినిండా సగం వొదిలిన సున్నిపిండీ,– అతని ఆకారం చూసి, పెళ్ళికి వచ్చిన ఆడవాళ్ళు మొగాలు చాటుచేసి నవ్వుకున్నారు సన్నగా. రామయ్య భూతాల పిచ్చెయ్యని కూడా తీసుకురానందుకు తన్ను తాను నిందించుకున్నాడు. అయితే పట్టూకి ఇదేమీ తెలియదు. అతనికి తెలిసిందల్లా తన కారు పని చేస్తోందని.

ఇంజన్‌మీద లారీ డ్రైవరూ, కండక్టరూ వంగి చూస్తున్నారు. అతను దగ్గరగా రాగానే కండక్టరు తప్పుకున్నాడు. అతన్ని చూసి వాళ్ళేమీ ఇబ్బంది పడ లేదు. ఎందుకంటే, అతనికన్నా తక్కువదుస్తుల్లో ఉన్న మొగాళ్ళని వాళ్ళు ప్రతినిత్యం చూస్తూనే ఉంటారు.

"ఇంజరం సెడిపోలేదయ్యా, ప్లగ్గు తీగలూడినై–మూడు తీగలు. ఆటిని తగిలిస్తే పద్రుని అందుకుంది," అన్నాడు డ్రైవరు.

జరగవలసిన మరమ్మత్తు ఇంత తేలికగా చేసేసినందుకు పట్టూ వాళ్ళని మనస్సులో అభినందించుకున్నాడు. ఇంత చిన్న విషయం తను కనిపెట్టలేకపోయినందుకు నిరసనగా తన తలమీద తనే మొట్టికాయ వేసుకున్నాడు–అంటే మనస్సులోనే. లారీ వాళ్ళకి పారితోషికం పందపరకూ పెంచి, అతను తిరిగి అరుగుమీద నిద్రపోబోతుంటే, మంగలి అతన్ని మళ్ళీ నీళ్ళగదిలోకి వడిపించుకుని వెళ్ళాడు.

నిద్ర మంచి సుఖమైనస్థితి. ఆ స్థితిలో అసుఖంగాని, అందవికారంగాని తెలీదు. రాళ్ళపరుపు హంసతూలికా తల్పమైపోతుంది తలనొప్పి పుట్టించే చప్పుళ్ళు అమరగానమైపోతుంది. చూస్తే దోకొచ్చే

వికృతాకారం అజంతాశిల్ప మైపోతుంది.

పట్టూని మొత్తంమీద స్నానం చేయించి, అతని చేత కొత్తబట్టలు కట్టించి, ఎలాగైతేనేం, పీటల మీద కూర్చోబెట్టారు. ఒక పక్క నాటుసన్నాయి మేళం భూకంపాలు పుట్టిస్తోంది. మరో పక్క పెద్దల నవ్వులు, పిన్నల ఏడుపులు, ఆడవాళ్ళ అరుపులు, బ్రాహ్మల మంత్రాలు తుపానులు చెలరేగిస్తున్నాయి. కాని సగం మగతలో ఉన్న పట్టూకి వినబడ్డవి- కోయిల పాటలు, సెలయేటి గలగలలు, తుమ్మెదల రొదలు.

స్నాతక వ్రతం కొన్ని చిన్న అవాంతరాలు తప్పిస్తే సవ్యంగానే జరిగిపోయింది. ఉదాహరణకి; అగ్నిలో పొయ్యమన్న నెయ్యి అతడు పురోహితుడి ఒడిలో పొయ్యడం, కాశీ యాత్రకు బయలుదేరినప్పుడు తినగ్నా పెళ్ళి కారులో పడుకోడంకామన్న బెల్లంముక్క అతని గడ్డంమీద పెడితే, దాన్ని కామన్న చెయ్యితో సహా తినెయ్యడానికి ప్రయత్నించడంవంటివి, అంతపట్టించుకోవలసినవి కావు. సానుభూతితో చూసే తలిదండ్రులకి ఇవన్ని ఏదో వేళాకోళపు వ్యవహారంగా తోచినా, పెళ్ళికూతురు తరపువాళ్ళకి, వీటి మూలంగా అతని మెదడు విషయమై కొంత అనుమానం తగిలి ఉండొచ్చు. ఆ అనుమానం అప్పుడెవ్వరూ వ్యక్తపరచలేదుగాని, తరవాత, పరిస్థితులు విషమించిన సందర్భంలో మొదట్లోనే తమకి అర్థమైపోయిందని వాళ్ల వాదించడానికి అవకాశం చిక్కింది.

పట్టూకి మాత్రం ఇవేమీ తెలియవు. అసలు అత నీ లోకంలోనే లేడు.

పట్టూ కారుని పూలతో అలంకరించారు. సన్నాయి మేళం కారుముందు నిలబడింది. పెళ్ళివారు ఇటూ అటూ నిలబడ్డారు. రామయ్యా, సుబ్బమ్మా పెళ్ళికొడుక్కి చెరో పక్కా వెనకసీట్లో కూచున్నారు. అప్పుడొచ్చింది కారు నడిపే దెవరన్న ప్రశ్న. లారీవాళ్ళు టిఫిన్ సేవించి వెళ్ళిపోయారు. ఇంక కారుతో కాస్త ముఖపరిచయ మున్న ఆసామీ ఎవడూ ఆ ఊళ్ళో లేడు. ఈ విధంగా పెళ్ళిపెద్ద లంతా కిందా మీధా పడుతుంటే, పదేళ్ళ కుర్రాడొకడు డ్రైవరు సీట్లోకి గెంతి, ఈమీటా ఆమీటా లాగడం మొదలెట్టాడు. కారు నడపడానికి అతనికి గల అర్హతను గురించి తీవ్రమయిన చర్చ ఫలితంగా తేలిన విషయం ఏమిటంటే. ఆ కుర్రాడి మేనమామ బస్సు డ్రైవరు. అప్పుడప్పుడు ఆ మేనమామ స్టీరింగు అతని చేతి కిచ్చి బస్సు నడిపించడం కద్దు. అందుచేత ఏది లాగాలి, ఏది నొక్కాలి అన్నది అతనికి తెలుసునని అతని వాదం. ఒకవేళ అది నిజమే అయినా, పెళ్ళిపెద్దలకి కనబడ్డ మరోనిజం ఏమి టంటే, డ్రైవరు సీటులో ఆకుర్రాడు కూచున్నప్పుడు, అతని కాళ్ళకి కింద పెడల్సు అందడం లేదు. అంచేత, అతన్ని చక్రం పట్టుకోడానికి తోపుడుశక్తిని వినియోగించడం మంచిదని నిర్ణయించారు పెద్దలు.

మొదట ఇద్దరుతోశారు. కారు కదలలేదు. ఇద్దరూ నలుగురయారు. అప్పటికీ కారు కదల్లేదు, మగవాళ్ళంతాకలిసి ప్రయత్నించి, ఇంక ఆ మొగమాటంవిడిచి ఆడవాళ్ళని కూడా ఒకచెయ్యి వెయ్యమని అడగబోయే సమయంలో – పట్టూకి ఒక రెప్పపాటుసేపు మెలకువవచ్చి, "బ్రేకు," అని గొణిగాడు.

కుర్రవాడు బ్రేకు వదిలాడు.

కారు శరవేగంతో పరధ్యానంగా సన్నాయి వాయిస్తున్న భజంత్రీలమీదికి దాడి చేసింది. వెనకశక్తినంతా ఉపయోగించి తోస్తున్న పెళ్ళిపెద్దలకు ఏంజరిగిందో తెలిసేలోగా, వాళ్ళ మోకాళ్ళు కొట్టుకుపోయాయి. అనుకోకుండా కారువాళ్ళని మోసం చేసి ముందుకి పోవడంతో అంతా ఒకళ్ళమీద ఒకళ్ళుపడి పరస్పరం తిట్టుకోడానికి సిద్ధపడ్డారు. భజంత్రీలుమాత్రం పక్షులకన్నా వేగంగా ఎగిరి తమ శరీరాలకు ప్రమాదం రాకండా కాపాడుకున్నారు.

కుర్రవాడు అందీ అందని బ్రేకుపెడలు కాళ్ళుసాచి ఎల్లాగైతేం నొక్కాడు, కారు చక్రుని తిరిగి ఒకగుమ్మంలో ప్రవేశించబోయింది. ఊరేగింపు చూట్టానికి గుమ్మంలో నిలబడ్డ అమ్మలక్కలు లోపలదూకి రి తలుపులు మూసుకున్నారు.

ఆతరవాత మనుషుల్ని వేటాడే ప్రయత్నం మానుకుని, కారు కాస్త సాధువులా ప్రవర్తించింది, ఊరేగింపు ఆడపెళ్ళివారి యింటిముందు ఆగింది.

చాకలిపేరయ్య పాంకోళ్ళు తీసి కారుతలుపుపక్కని పెట్టాడు. రామయ్యా సుబ్బమ్మా పట్టూని అతి ప్రయత్నంమీద కారు దింపారు. అతనిచేత పాంకోళ్ళు తొడిగించారు. పెళ్ళిపందిట్లో పట్టూని చెరోపక్కా నిలబడి నడిపించడంలో, వాళ్ళ కాళ్ళు పాంకోళ్ళ కిందపడి కాస్త పచ్చడయాయి.

ఆతరవాత పట్టుకుని పురోహితుడే కర్మకాండంతా నడిపించాడు. అకస్మాత్తుగా భజంత్రీలు ఆకాశం అదిరేటట్టు వాయించారు. పట్టూకి మెలుకువవచ్చింది ఇంటి గుమ్మంవేపు చూశాడు అతనితలమీద ఏవరో పెద్దరోకలితో కొట్టినట్టైంది.

పర్వతంలాంటి శాంతమ్మ, పెళ్ళికూతురు కళ్యాణిని నడిపించి పెళ్లిపీటల దగ్గిరికి తీసుకొస్తోంది. ఆ అమ్మాయి అతడు చూసిన పెళ్ళికూతురు కాదు. తను తల్లిదండ్రులతో దెబ్బలాడింది, మిస్టర్ చింతా సహకారంతో బ్రహ్మాండమంత పన్నాగం పన్నింది. తను ఆఖరికి పిచ్చివాడన్న అపనిందకు పాల్పడింది, ఈ అమ్మాయికోసం కాదు. మోసం. తన్ని మోసగించారు. అన్యాయంగా ఇంకో అమ్మాయికి తనని కట్టబెట్టాలని చూస్తున్నారు. తన తలిదండ్రులుకూడా ఈ కుట్రలో ఉన్నారేమో. తనీ అమ్మాయిని చచ్చినా చేసుకోడు ప్రాణంపోయినా సరే

పట్టూ ఒక్క ఎగురులో పురోహితుణ్ని దాటి, నాలుగు అంగల్లో కారులోకి గెంతి కారు స్టార్ట్ చేసి, మెరుపులా అదృశ్యమైపోయాడు.

పెళ్ళి పందిరంతా నిర్ఘాంతపోయింది, అందరూ కళ్ళు అప్పగించి నోరు తెరుచుకుని వెళ్ళిపోయిన కారువంక చూస్తూ కూచున్నారు. అందరికన్నా ముందు తేరు

కున్నది కల్యాణి. ఆమె చర్రున లోపలికి పరుగెత్తి వెళ్ళిపోయింది. శాంతమ్మ కెవ్వుమని అరిచి మూర్ఛపోయింది. రాధ అక్కగారిని అనుసరించింది. మేకలాంటి శంకరయ్య రామయ్యమీదికి భీముడిలా లేచాడు. పదిమందీ అతన్ని పట్టుకున్నారు.

"నువ్వా మనిషి వేనా ? ఎప్పుడో నిన్నవమానించానని, ఆ కసి ఈవిధంగా తీర్చుకున్నావా ?...నీ రక్తం కళ్ళచూస్తా నీ వేళ నీ తోలొలిచి ఎండెయ్యకపోతే నా పేరు..."

ఏమీ ఎరగని రామయ్య సుబ్బమ్మతో సహా వీలయినంత వేగంగా జారిపోయాడు. కొడుకు పిచ్చివాడన్న సంగతి అతనికి రూఢై పోయింది. సుబ్బమ్మ పైకి చప్పుడవకండా ఏడుస్తోంది.

గదిలో కళ్యాణి వెక్కి వెక్కి ఏడుస్తోంది. రాధ ఏడుస్తోనే అక్కగారిని ఊరుకోబెడుతోంది. కల్యాణికి మొదటినించీ ఈ వ్యవహారం అంతా ఏదో అబద్ధంగానే కనబడుతూ వచ్చింది. అయినా కళ్ళ ఎదట నడుస్తున్న ప్రయత్నాల్ని ఆమె కాదనలేకపోయింది. ఏదో అవాంతర మొచ్చి ఇదంతా ఆగిపోతుందని ఆమె మనస్సులో ఎక్కడో ఒక చిన్న భయం ఉండేది. ఇన్నాళ్ళూ అయినా పెళ్ళి ఈ విధంగా ఆగిపోతుందని ఆమె ఎన్నడూ అనుకోలేదు. ఇన్నాళ్ళూ ఆమె మౌనంగా భరించిన ఆందోళనంతా కట్టలు తెంచుకుని కన్నీళ్ళుగా ప్రవహించింది.

పక్కనే సర్వాంగాసనంలో ఉన్న కామన్నని వీళ్ళు చూడలేదు.

"ఏం ? తంతంతా అయిపోయిందా ?" అన్నాడు కామన్న.

రాధ తారాజువ్వలా లేచింది.

"అయితే నీకేం, కాకపోతే నీకేం." మేం చచ్చామో బతికామో నీ కేమన్నా కావాలి గనకనా ? ఆరాక్షసు డేమో అక్కయ్య జీవితంలో చిచ్చుపెట్టి పారిపోతే. ఇక్కడ తాపీగా ఆసనాలు వేసుకుంటూ తంతయిపోయిందా అంట ! సిగ్గులేకపోతేసరి—"

కామన్న తన జీవితంలో మొదటిసారి ఆసనం వ్యవధిపూర్తవకండా లేచిపోయాడు

"ఏం జరిగింది ?"

"ఏంజరిగితే నీకేం ? మీ మొగాళ్ళంతా పచ్చినెత్తురుతాగే రాక్షసులు. ఆడదంటే పురుగు మీదృష్టిలో. కాలికింద నిర్దాక్షిణ్యంగా నలిపిపారేస్తారు."

రాధ తనుకూడా వెక్కి వెక్కి ఏడవడం మొదలెట్టింది.

కామన్న పందిట్లోకి వెళ్ళాడు — సంగతేమిటో కనుక్కోడానికి.

పందిట్లో పరిస్థితి వర్ణించడాని కేముంది? అందరూ ఒక్కసారిగా మాట్లాడుతున్నారు.

మూర్ఛపోయిన శాంతమ్మనోట్లో మజ్జిగ పోసేదాతెవరూ లేకపోయారు. (సశేషం)

అజరామరత

పిలకా గణపతిశాస్త్రి

సతతమ్ము కాలాహి వితతవదనాన జీ
వితము కబళించునని విజ్ఞు లందురు గాని,
జనన మరణమ్ము లింకే నాటికయిన నీ
జగతిలో విడివడని జంటయే యగుగాని,

నే నెన్నడయిన మరణించినా నను వార్త
వినిన ఒక్కింతయిన విశ్వసింపకు సుమీ !
నిజము ముమ్మాటికిది అజరామరత నంది,
నీ రాకకై సదా నిలిచెద నిరీక్షనై !

సోలి నిదురించు వెన్నెలల ఆమనిరేల,
జాలిగా వకుళాలు జారు వేకువవేళ,
పూలేమొ ! అని లోన తలతు వేమోసుమా !
రాలె నా వేడి కన్నీళులే ప్రియతమా !

నా మహా కవన భవన ప్రాంగణములోన
ప్రేమ ప్రవాళ దీపిక నిలిపినా నిదే,
నీ మార్గమున వెలుగు నిత్యతారళ్యమై,
శ్యామసంధ్యల శాంత చరణ మణికటకమై !

పరిమళాలు

శ్లో॥ ఇదం తు మమ దీనస్య మనో భూయః ప్రకర్షతి.
యదిహాస్య ప్రియాఽఖ్యాతుః న కుర్మి సదృశం ప్రియం
ఏష సర్వస్వభూతో మే పరిష్వంగో హనూమతః.

—వాల్మీకి.

—"నాకు ప్రియమును తెలుపు ఈ హనుమంతునకు, అట్టి ప్రియమునకు తగిన ప్రియమును చేయ లేకున్నాను" అను విషయము మాత్రము దీనుడ నగు నా మనస్సును బాధించుచున్నది. ఏ వస్తువు ఇచ్చినను హనుమంతుడు నాకు చేసిన ప్రియమునకు ఈడైనది ఈ లోకములోనే దొరకదు కాబట్టి నా సర్వస్వమైన యీ గాఢాలింగనమును హనుమంతునికి ఇచ్చుచున్నా నని శ్రీరాముడు బ్రహ్మాదులకును అలభ్యమైన తన కౌగిలింపుతో అతనిని మహోన్నతముగా సంభావించెను.

శ్లో॥ దీపో యథా నిర్వృతిమభ్యుపేతః
నైవావనిం గచ్ఛతి నాంతరిక్షమ్.
దిశం న కాంచిత్ విదిశం న కాంచిత్
స్నేహక్షయాత్ కేవలమేతి శాంతిమ్॥

—అశ్వఘోష కవి.

ఏలాగైతే దీపము తైలము క్షయ మగుటవలన ఆరినప్పు డది భూమిని, ఆకాశమును, దిక్కును, విదిక్కును గాని చేరక కేవలము ఉన్నచోటనే శాంతించునో అలాగే, ప్రాపంచిక స్నేహము నశించుటవలన జీవుడు గూడ ఎక్కడకును పోవక అచ్చటనే నిర్వాణశాంతిని పొందును.

కృష్ణుని బాలక్రీడలు

సీ॥ తనువున నంటినధరణిపరాగంబు, పూసిననెఱిభూతిపూఁత గాఁగ;
ముందర వెలుగొందుముక్తాలలామంబు, తొగలసంగడికానితునుక గాఁగ;
ఫాలభాగంబునఁ బరఁగుకావిరిబొట్టు, కాముని గెల్చినకన్ను గాఁగ;
గంఠమాలికలోనిఘననీలరత్నంబు, కమనీయ మగు మెడకప్పు గాఁగఁ;
ఆ॥ వె॥ హారవల్లు లురగహారవల్లులు గాఁగ; బాలలీలఁ బ్రౌఢబాలకుండు,
శివునిపగిది నొప్పె; శివునకుఁ దనకును వేఱు లేమి దెలుప వెలసినట్లు.

—పోతనామాత్యుడు.

కృష్ణుడు క్రీడించునప్పుడు శరీరమునకు అంటిన దుమ్ము విభూతిపూతగను, తలపై వెలుగొందు ముత్యము అర్ధచంద్రుడుగాను, నొసటియందు ఒప్పు ఎఱ్ఱనిబొట్టు మూడవకన్నుగను, కంఠమాలికయందలి నీలమణి కుత్తుక విషముగను, ముత్తెములహారము సర్పహారములగను ఒప్పగా, కృష్ణుడు, శివునకు తనకుభేదము లేదు అను హరిహరైక్యమును తెలుపుటకు వెలసినాడా యనునట్లు శివునివలె ప్రకాశించెను.

సాయంసంధ్య

తే॥ గీ॥ గగనహారినీలశైలశృంగముననుండి డొల్లిపడెఁ బ్రొద్దు జేగురుఁగల్లువోలెఁ;
దన్నిపాత సముద్ధూతధాతుధూళిచందమునఁ దోచె దివసావసానసంధ్య.

—శ్రీనాథ కవి.

ఆకాశమనెడు ఇంద్రనీలపర్వత శిఖరముపైనుండి దొర్లిపడునట్టి యెఱ్ఱరాయివలె సూర్యుడు ఒప్పెను. అంత పై నుండి పడుటవలన పైకి లేచిన ధాతువుల ఎఱ్ఱని దుమ్మువలె సాయంకాల సంధ్యారాగము ఒప్పెను.

సీ॥ ఎలదీఁగఁ గప్పినలలితపరాగంబుక్రియ మేన మేదినీరేణు వొప్పఁ;
జంపకంబున నవసౌరభం బెసఁగెడుకరణి నాసిక వేఁడిగాడ్పు నిగుడఁ;
దోయజదళములతుది మంచు దొరఁగెడుగతిఁ గన్నుఁగవ నశ్రుకణము లురుల,
నిందుబింబముమీఁదికందుచందంబునఁ గురులు నెమ్మొగమున నెరసి యుండ

తే॥ గీ॥ సర్వజనవంద్య యైనపాంచాలి సింహబలునిచే నివ్విధంబున భంగపాటు
దనకు వచ్చిన నెంతయు దైన్య మంది యవ్విరాటునిసభఁ జేర నరిగి నిలిచె.

— తిక్కన సోమయాజి.

లత పైన గ్రమ్మిన దుమ్మువలె ఆ లతాంగిశరీరముపై గప్పిన నేలదుమ్ము ఒప్పగా, సంపంగి నుండి వెడలు పరిమళమువలె ఆమె ముక్కునుండి వేడినిట్టూర్పు వెడలుచుండగా, తామరరేకుల కొనకు మంచు రాలుచున్నట్లు, ఆ తామరసాక్షి కన్నులనుండి కన్నీరు ఒలుకగా, చంద్రబింబములోని కళంకమువలె ఆ చంద్రముఖి వెంట్రుకలు ముఖముపై నిండియుండగా, సర్వజనమునకును వందనీయురాలగు ద్రౌపది కీచకునిచే భంగ పడి మిక్కిలి దీనురాలై విరాటరాజు సభకు వచ్చి నిలిచెను.

శా॥ సంపన్నుం డొరుఁ గాన లేఁడు; తనువున్ సంసారమున్ నమ్మి హిం
సింపం జూచు; దరిద్రు డెత్తువడి శుష్కీభూతుఁడై చిక్కి హిం
సింపం డన్యుల; నాత్మకున్ సములుగాఁ జింతించు; నట్లౌటఁ ద
త్సంపన్నాంధున కంజనంబు వినుమీ! దారిద్ర్య మూహింపఁగన్

— పోతనామాత్యుడు.

సంపద గలవానికి అన్యులు కానరారు. తన శరీరము, సంసారమే శాశ్వతమని నమ్మి ఇతరులను హింసింప జూచును. పేదవాడు ఎత్తు పడి, కృశించియుండి కూడ ఇతరులను హింసింపడు. అందరును తనకు సమానులే యనుకొనును. కనుక సంపదలచే కన్నుగానక అంధులైనవారికి అంజనము సుమా దారిద్ర్యము.

ఉఱుములతోడి మేఘములు

మ॥ ఎది సౌదామనితాండవంబునకు నెంతేనిన్ మృదంగాఽరవా
భ్యుదయం బై తగు; శక్రచాపమున కుద్ద్యోతించుటంకారమె
య్యది; మత్తేంద్రగజేంద్రకంఠలుఠితాన్యగ్రోగ్రగర్జాఘనం
బదె యత్యంబు వియోగినీవ్యథకునై యభ్రస్థలిం గ్రుమ్మరున్.

—ఆంధ్ర బిల్హణ.

ఏ ఉఱుము మెఱపుతీగె నాట్యము చేయుతరి మృదంగము మ్రోగుచున్నట్లుండునో, ఇంద్రధనువుయొక్క టంకారధ్వనివలె నుండునో ఐరావతగజముయొక్క ఘీంకారముతో కలసి ఉగ్రమైయుండునో అట్టి ఉఱుములతో గూడిన మేఘము, విరహిణులైన స్త్రీలను బాధించుటకుగాను ఆకాశస్థలిలో తిరుగాడుచున్నది.

పోతనగారితో కొన్ని క్షణాలు

మధురాంతకం దొరస్వామి

శ్రీ కమనీయ గానలహరీ సుభగంబయి శబ్దార్థాలంకార శోభితంగా ఎపుడు జాలువారిందో పోతన గంటంనుండి భాగవత రూపంలో ఆ మహాకవిత...

గంగకుం జని పోతన మనోవీథిలో...కాదు...కాదు...యెట్ట యెదుటనే శ్రీరామ సాక్షాత్కారాన్ని చవిగొన్న మహనీయుని కవనం అనిర్వాజంతో భక్తిభావాల పుంజీభూతంతో జాలువారిన ఆ కవితకు అధినాథుడు శ్రీరామచంద్రుడు.

అందుకే "పలికెడిది భాగవతము...పలికించెడివాడు రామభద్రుడు," అని వాక్రుచ్చాడా మహాశయుడు గ్రంథారంభంలోనే_

చేతులారంగ శివుని పూజింపడేని
నోరు నొవ్వంగ హరికీర్తి నుడువడేని
దయయు సత్యంబు లోనుగా దలపడేని
కలుగ నేటికి తల్లుల కడుపుచేటు.

ఎంత కమ్మని భావగీతం...

శివకేశవుల అభేదత్వాన్ని చక్కగా నిరూపించాడు. ఒక్క శివకేశవుల అభేదత్వాన్నేమిటి భగవంతుని అనంత స్వరూపం సాక్షాత్కరింపనిది ఏ యణువు యీ యిలాతలంలో లేదని భగవంతుని గొప్పతనాన్ని నిరూపించాడు.

వామనావతార ఘట్టంలో వామనుడు పెరగడం చూడండి,

ఇంతింతై వటు డింతయై, మఱియు దా నింతై, నభోవీథిపై
నంతై, తోయదమండలాగ్రమున కల్లంతై, ప్రభారాసిపై
నంతై, చంద్రుని కంతయై, ధ్రువునిపై నంతై మహర్వాటిపై
నంతై, సత్యపదోన్నతుండగుచు బ్రహ్మాండాంత సంవర్ధియై.

...ఇంతింతై..అంతై...వటుడు బ్రహ్మాండాంత సంవర్ధియైనాడు.

మఱియు,

రవిబింబం బుపమింపఁ బాత్రమగు ఛత్రంబై, శిరోరత్నమై
శ్రవణాలంకృతియై, గళాభరణమై, సౌవర్ణకేయూరమై
ఛవివత్కంకణమై, కటిస్థలి నుదంచద్ఘంటయై నూపుర
ప్రవరంబై, పదపీఠమై వటుఁడు దా బ్రహ్మాండమున్ నిండుచోన్.

ఎంతటి మహనీయమైన వర్ణన! వామనుడు పెరుగునపుడు మొదట సూర్యుడు, గొడుగు, పిదప శిరోభూషణము, పిదప గళాభరణము, ఆపిదప సౌవర్ణ కేయూరము, వరుసగా మొలగంట, పదనూపురము తుదకు పాదపీఠమైనాడు. తానుగాక సర్వమేదియు లేదనడానికి యింతకన్న ప్రబలతార్కాణము లేదు.

అందుకే ప్రహ్లాదుడు "ఎందెందు వెదకి చూచిన అందందే హరి కలడని," నొక్కి వక్కాణించాడు.

గాలిని, కుంభిని, దిక్కుల, త్రికాలముల, త్రిలింగ వ్యక్తులందంతటను ఈశ్వరు డున్నాడని చాటాడు. ప్రేమతోనైనా భయంతోనైనా, భక్తితోనైనా హరిని చేరడం సుగమమన్నాడు.

భయంతో కంసుడు, విరోధంతో శిశుపాల దంతవక్త్రులు, ప్రేమతో గోపికలు హరిని చేరి ధన్యజీవులైనారు.

అదిగో! గోపికా గీతములు వినుంగొనుడు. ఆ లతానికుంజముల దాగిన కృష్ణునికై వెతకుచుఁ ప్రతీక్షించు గోపికల యుత్కంఠతను వీక్షింపుడు.

నల్లనివాడు, పద్మనయనంబులవాఁడు, కృపారసంబుపైఁ
జల్లెడివాడు మౌళి పరిసర్పిత పింఛమువాఁడు నవ్వురా
జిల్లెడి మోమువాఁ డొకడు చెల్వల మానధనంబు దెచ్చెనో
మల్లియలార! మీ పొదలమాటున లేఁడుగదమ్మ చెప్పరే!

ప్రేమ పరకాష్ఠ నందుకొన్నది. అందుకే మాట్లాడుతాయా లేదా? అన్న వివక్షణే లేదు. అది మధురభావన, మధురవేదన. అందుకే తమ మనోనాయకుని రూపం, నల్లనివాడట, పద్మ నయనంబుల వాడట. కృపారసం అపారంగా పైన విరజిమ్మేవాడట, నెమలి పింఛం ధరించేవాడట, అని గుర్తులన్నీ చెప్పి ఓ మల్లియలారా! మీ పొదలమాటున ఉన్న చెప్పరాదా! అని బతిమాలుకొంటున్నారు. లతాంగులు లతల నడగటంలో అతిశయ మేముంటుందిగనుక.

గోపాలనలో కృష్ణుడు అందెవేసిన చేయి. అల్లదిగో ఆ మత్తాళి యూథంబులోఁ... కలహంస యూథమ్ముల క్రేంకారములతో గూడిన సరసులతో, మదకేకిజాలమ్ముల నాట్యగరిమతో వనగజయూథమ్ముల సొబగు నడకలతో గడిదేరిన అరణ్యమున ఆ ప్రకృతి రమణిని పులకింపజేయుచు ఆ పరాత్పరుడు...గోమాతలను పిలుచు విధమును గనుడు......

రా పూర్ణచంద్రికా, రా గౌతమీగంగ!
రమ్మ భగీరథ, రాజతనయ!
రా సుధాజలరాసి, రా మేఘమాలిక
రమ్మ చింతామణి, రమ్మ సురభి
రా మనోహారిణీ, రా సర్వమంగళ
రా భారతీదేవి, రా ధరిత్రి
రా శ్రీ మహాలక్ష్మి, రా మందమారుతి
రమ్మ మందాకిని, రా శుభాంగి!
యనుచు మఱియు, గలుగు, నాఖ్యలు గలగోవు
లడవిలోన దూర, మందు మేయ
ఘన గభీర భాషఁ, గడునొప్పఁ జీరునా
భీర జనులు వొగడ, బెంపు నెగడ ___

గజేంద్రుని మొర వినండి...అది...అతి రమణీయమైన అతి వాస్తవికమైన...వేదాంత...సారం..."ఎవ్వనిచే జనించు,"...

"కలుగడే నాపాలి." మున్నగు పద్యాలు అన్ని మతాలకు అన్ని కులాలకు అన్ని కాలాలకు ఉపయుక్త మైనవి. ఆస్తికత్వ భావాలను పుంజీభూత మొనర్చే అతి నిర్మల భావ లహరీ సంసక్తాలు... ను...మనోజ్ఞవాణికి నిదర్శనాలుగ ఐ ఒప్పారినవి...

గజేంద్రుని "పాహి...పాహి," అను కుయ్యాలించి. అల వైకుంఠ పురంబులో, ఆమూల సౌధంబులో, రమాకాంతాలలామంబుతో పాచికలాడే రమానాథుడు... సిరికిం జెప్పడు. శంఖ చక్రయుగమును. పరివారమును గైకొనక శ్రీ కుచో పరిచేలాంచలమైనా వీడక, భక్తపాలనైకచిత్తుడై గగనంలో వేంచేస్తున్నాడు. తనవెంట లక్ష్మి. గరుడుడు, శంఖ చక్ర నికాయము. నారదుడు, వైకుంఠమున గలవా రాబాలగోపాలము, వినువీధిలో బారులు గట్టారు.

ఎంతటి భావసౌందర్యం! ఎంతటి కమనీయమైన ఉహాచిత్రణం!
ఆ భగవానుణ్ణి చూచి...యిలా ఆనందించారు అమరులు.

వినువీథిం జనుదేర గాంచి రమరుల్ విష్ణున్ సురారాతి జీ
వన సంపత్తి నిరాకరిష్ణు గరుడావర్ధిష్ణు యోగీంద్ర హృ
ద్వన వర్ధిష్ణు సహిష్ణు కృష్ణు విజభృందా ప్రాభవాలంకరి
ష్ణు నవోద్యోల్లసదిందిరా పరిచరిష్ణుం జిష్ణు రోచిష్ణునిన్ !

వినువీథిలో జగన్నాధుని వెంట వెళ్ళుచు మహాలక్ష్మి పాపం... తొందరపాటుకు కారణం అడగటానికి గమకించిన "అడిగెదనని కడువడిజను." అట్లు అడిగిన..."మగుడ నుడువడని నడయుడుగును"... మరలా "జిడిముడి తడబడగా అడుగు లుంచుతూంది..." జిడిమతో మరలా మందగమన బౌతోంది.

శ్రీదేవి విష్ణుదేవుని వెన్నంటిపోయే ఘట్టాన్ని తిలకించండి. ఆమెను శృంగారరసాధిదేవతగా అభివర్ణిస్తాడు పోతన— శిల్పి తన శిల్పకళా ఖండాలను లోకాతిసహజంగా చిత్రించినట్టే— తనరంగు కుంచెతో చిత్రించగలడు పోతన...

లక్ష్మీదేవి విష్ణుదేవుని వెంబడిస్తూంది కదా!

తాటంకాచలనంబుతో భుజనటద్ధమ్మిల్ల బంధంబుతో
శాటీముక్తకుచంబుతో నదృఢచంచత్కాంచితో శీర్ణలా
లాటాలేపముతో...మనోహరకరాలగ్నోత్తరీయంబుతోన్
కోటీందుప్రభలతో ఉరోజభరసంకోచద్విలగ్నంబుతోన్!

కమ్మలయొక్క కదలిక, భుజముపై నటియించు క్రొమ్ముడి, తొలగింపబడిన పయ్యెద, అనగాసంరంభమున వెళ్ళునప్పటి తొందర పాటులో ఆకాస్త చేలాంచలం వెన్నుని చేతిలోనుండి లాగబడుచున్నది గనుక, అట్లున్న దనుట. ఒదులు చేయబడిన మొలనూలితో, చెదిరిపోయిన తిలకముతో, విష్ణుమూర్తి చేతిలో గల ఉత్తరీయముతో, కోటిచంద్రుల ప్రకాశముతో స్థనభారమున వంగిన నడుముల దైనదట. మరియు వియత్పథమున వెళ్ళునప్పుడు ఆమె నిటలాలకములంట తేంట్లు, మెయిదీగతో మెరుపులు. కుచయుగంబుతో చక్రవాకములు, కన్నులతో దేవగంగానదిలోని చేపలు పోటీ పడ్డవట! ఎంత మనోహరమైన యుత్ప్రేక్ష. సీసంలో పొదిగిపై శార్దూలానికి ముందే నిలిపాడు. ఈమనోహర భావాంబర వీచికలను, తన భాగవతంలో పోతన...భీష్మనిస్తుతిని తిలకించండి...

భీష్మునితో అర్జునుడు యుద్ధం చేయలేని తరుణంలో కృష్ణునికి భీష్మనిపై ఆగ్రహం జనిస్తుంది. అలాంటి కృష్ణుని జూచి, భీముడు యేమంటున్నాడు...

త్రిజగన్మోహన నీలకాంతి తను వుద్దీపింపఁ బ్రాభాత నీ
రజ బంధుప్రభమైనచేలము పయిన్ రంజిల్ల నీలాలక
వ్రజసంయుక్త ముఖారవింద మతిసేవ్యంబై విజృంభింప మా
విజయుం జేరెడి వన్నెకాడు మది నావేశించు నెల్లప్పుడున్!

శ్రీకృష్ణుని స్వరూపం. అతడు యేరూపంతో విజయుణ్ణి చేరుతున్నాడో, యీ పద్యంలో హృద్యంగా వర్ణింపబడింది.

భీష్మణ్ణి తన చక్రధార కెర చేయా లన్నంత కోపం వచ్చింది కృష్ణునకు. కుప్పించి యెగసినా డందులకు. అప్పటి ఆతని దివ్య మంగళ రూపాన్ని తిలకించి భీష్ముడు యేమంటున్నాడు.

కుప్పించి యెగసిన కుండలంబుల కాంతి
గగనభాగంబెల్లఁ గప్పికొనగ
ఉరికిన నోర్వక యుదరంబులో నున్న
జగముల వ్రేగున జగతి గదలఁ
జక్రంబు చేబట్టి చనుదెంచు రయమునఁ
బైనున్న పచ్చని పటము జార
నమ్మితి నాలావు నగుబాటు సేయకు
మన్నింపు మని క్రీడి మరలఁ దిగువఁ
గరికి లంఘించు సింహంబు కరణి మెఱసి
"నేడు భీష్మునిఁ జంపుదు నిన్నుఁ గాతు
విడువు మర్జున!" యనుచు మద్విశిఖవృష్టిఁ
దెరలి చనుదెంచు దేవుండు దిక్కు నాకు!

ఆ భీష్మడే గాదు. మనకు సైతం ... కుండలముల కాంతి... బొజ్జలోని పదునాలుగు లోకాలు ... కనిపించినట్లుంది ...


శత్రుడని మిత్రుడని విభేదం మూఢులకు. మహాత్ముని చేరడానికి అన్ని మార్గాలే ... భూమిని వడమరగా పయనించి తూర్పునకు చేరవచ్చు ... ఏలా తిరిగినా గమ్యస్థానాన్ని చేరుకోవచ్చు ... అలాగే భగవంతునిలోనికి అన్ని మతప్రవాహాలూ ... కానీ భక్తిమార్గం చాలా సాన్నిహిత్య సాధనం ... దాని ద్వారా తరించడం అతి సుగమమైన కార్యం ...

భారతానికి ప్రతిఫలరాహిత్యంతోఁ గూడిన నిష్కామకర్మ ప్రాముఖ్యం కాగా ... భాగవతానికి భక్తియోగం ఏకైక సాధనం అయింది. అది పండిత పామరైకవేద్యం ...


అంత్యప్రాస యమకాన్వితమై, చిరంతనమైన భక్తిప్రబోధం... ఒక్క మహనీయుడైన పోతనకే వారసత్వం అయింది...

పోతన మహాకవీ! నీ కివే నాధన్యవాదములు.


నగరంలో స్వాతంత్ర్య దినోత్సవాలు



పరేడ్ మైదానంలో ముఖ్యమంత్రిని ఆహ్వానిస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్




పరేడ్‌ను తిలకిస్తున్న ప్రధాన కార్యదర్శి తదితర ప్రముఖులు






ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంలో సైనికవందనాన్ని స్వీకరిస్తున్న ముఖ్యమంత్రి




స్వాతంత్ర్య దినోత్సవ సైనికవిన్యాసాలను వీక్షిస్తున్న డాక్టర్ యమ్. చెన్నారెడ్డి, శ్రీ యన్. రామచంద్రారెడ్డి, శ్రీ ఏ. సి. సుబ్బారెడ్డి మొదలయినవారు




పరేడ్‌ను చూస్తున్న ప్రముఖులు




"ఈ క్లిష్ట పరిస్థితిలో ప్రధానమంత్రికి మన సంపూర్ణమైన సహకారాన్ని అందించి అండగా నిలువడానికి ప్రతినపూనుదాం..."
సైనికవందనం సందర్భంలో ముఖ్యమంత్రి ఉద్బోధ



జీపులో వెళ్ళుతూ ముఖ్యమంత్రి ప్రజల్ని అభినందించారు



సైనికదళాల వందనాన్ని స్వీకరించుతున్న ముఖ్యమంత్రి




పరేడ్‌ను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి



సైనిక విన్యాసం



పదాతిసైన్యం, ఆర్టిలరీ, వైమానిక బలం, హోంగార్డ్సు, పోలీసు, యన్. సి. సి. లకు సంబంధించిన దళాలు పరేడ్‌లో పాల్గొన్నవి



ఆగస్టు 8వ తేదీన, ఆంధ్రప్రదేశ్ సివిల్ అసిస్టెంట్ సర్జన్స్ అసోసియేషన్ ఇబ్రాహింపట్నంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యకేంద్రానికి ఆరోగ్యశాఖామంత్రి శ్రీ వై. శివరామ ప్రసాద్ ప్రారంభోత్సవం కావించారు




స్వాతంత్ర్య దినోత్సవంనాడు, అవార్డు విజేతలయిన సినిమా కళాకారులకు సమర్పించిన బహుకృతి ఫోటోగ్రాఫ్




ప్రశంసాపాత్రమైన సేవలకుగాను, స్వాతంత్ర్య దినోత్సవం నాడు జరిగిన పరేడ్ సందర్భాన ముఖ్యమంత్రినుండి పతకాలను పొందిన ఎనిమిదిమంది పోలీసు అధికారుల గ్రూపు ఫోటో


ఎడమనుండి కుడికి :– శ్రీ కె. వెంకటేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు, గుంటూరు జిల్లా; శ్రీ యం. అరుణాచలం పిళ్లె, డిప్యూటి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు, నల్లగొండ; శ్రీ యమ్. మునిస్వామి నాయుడు, డిప్యూటి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు, అవినీతి నిరోధక శాఖ; శ్రీ యస్. ఎ. హాఫ్, డిప్యూటి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు, క్రైమ్ బ్రాంచ్, సి. ఐ. డి. హైదరాబాద్; శ్రీ ఇ. యన్. పురుషోత్తమన్, డిప్యూటి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు, స్పెషల్ బ్రాంచ్, సి.ఐ.డి. హైదరాబాద్; శ్రీ మీర్ జమీన్ అలి, డిప్యూటి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు, సూర్యాపేట, నల్లగొండ జిల్లా: శ్రీ ఆర్. ఆర్. ఆడమ్స్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు, స్పెషల్ బ్రాంచ్, సి. ఐ.డి. హైదరాబాద్; శ్రీ బి చలపతి రెడ్డి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు, అవినీతి నిరోధక శాఖ. ఐ జి పి. శ్రీ ఎ కె కె. నంబియార్, అడిషనల్ ఐ. జి. పి, శ్రీ శివకుమార్‌లాల్ చిత్రం మధ్యలో ఉన్నారు.



ఉత్తమ తెలుగు చిత్రాల నిర్మాతలకు సమర్పించిన 'నంది'– ఇది రామప్ప దేవాలయంలోని నంది విగ్రహానికి అనుకృతి



అగస్టు 22 వ తేదీన శ్రీ టి. వి. రాఘవులు, క్యాబినెట్ హోదాతో పబ్లిక్‌వర్క్స్ శాఖామంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు




అగస్టు 22వ తేదీన శ్రీ యన్. చెంచురామానాయుడు, స్టేట్ హోదాతో, మ్యునిసిపల్ పరిపాలన, అటవీ శాఖల మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు




హైదరాబాద్ జిల్లా ఇబ్రాహీం పట్నం లోని ఉచిత వైద్య కేంద్రంలో



అగస్టు 11 వ తేదీన జూబిలీహాలులో శ్రీ వేదాంతకవిని సన్మానించిన సందర్భాన ప్రసంగించుతున్న న్యాయశాఖ మంత్రి శ్రీ పి. వి. నరసింహారావు. సాంస్కృతిక వ్యవహారాలమంత్రి శ్రీ యమ్. ఆర్. అప్పారావు, శ్రీ వేదాంత కవిగారలుగూడా చిత్రంలో ఉన్నారు




జూలై 6వ తేదీన తాడేపల్లిగూడెంలో భూసార పరిశోధన కేంద్రానికి ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం జరిపారు.




ఆ సందర్భంలో ప్రసంగిస్తున్న శ్రీ ఎ. బలరామిరెడ్డి.



హైదరాబాద్‌లో జూలై 16వ తేదీన ఇండియన్ సొసైటీ ఆఫ్ ఇంటర్నేషనల్ లా సభ్యుల సమావేశంలో ప్రసంగిస్తున్న సుప్రీం కోర్టు న్యాయమూర్తి శ్రీ కె. సుబ్బారావు. ఆంధ్రప్రదేశ్ ప్రధాన న్యాయమూర్తి శ్రీ పి. సత్యనారాయణరాజు అధ్యక్షత వహించారు.




"వ్యవహారాలను శీఘ్రంగా పూర్తిచేయడం పరిపాలనలో చాల ప్రధానమైన విషయం-" జూలై 16వ తేదీన జూబిలీహాలులో కలెక్టర్ల సమావేశాన్ని ప్రారంభిస్తూ గవర్నర్ ఉద్ఘాటించారు.




"పొదుపును, వ్యావసాయిక ఉత్పత్తిని అధికంచేయడం- యీరెండూ కలెక్టర్లు తదితర అధికారుల ముందున్న ముఖ్యమైన కార్యాలు"- ముఖ్యమంత్రి.




"భూమిశిస్తు, ఎక్సైజు బకాయీలు, తక్కావీరుణాలు వసూళ్ళ విషయం యీ సమావేశం ఆలోచించాల్సిన ప్రధాన అంశం" సమావేశానికి అధ్యక్షత వహించిన రెవిన్యూ మంత్రి శ్రీ రామచంద్రారెడ్డి.







కలెక్టర్ల సమావేశందృశ్యాలు.




కలెక్టర్లు పరిష్కరించవలసిన కొన్ని సమస్యల్ని గూర్చి
ప్రసంగిస్తున్న బోర్డు ఆఫ్ రెవిన్యూ రెండవసభ్యుడు
శ్రీ జె. పి. యల్. గ్విన్, ఐ. సి. యస్.




కలెక్టర్ల సమావేశంలో న్యాయశాఖామంత్రి. ప్రభుత్వ
ప్రధాన కార్యదర్శి.




జూలై 18 వ తేదీన సికింద్రాబాద్‌లోని మహంకాళీ దేవాలయంలో
విజిటర్స్ బుక్‌లో సంతకంచేస్తున్న గవర్నర్.




దేవాలయ ప్రవేశస్థలంలోని మహంకాళీ విగ్రహం.




"ఒంగోలు, నాగార్జునసాగర్ ప్రాజెక్టు, సికింద్రాబాదులను కలిపే 200 మైళ్ళ రైలుమార్గం విషయంలో పరిశీలనలు జరుగగలవు"— శ్రీ యస్. కె. పాటిల్.




ఆ సందర్భంలో ప్రసంగిస్తున్న శ్రీ పి. యల్. భండారి.




ఆసందర్భంలో మాట్లాడుతూ నాగార్జునసాగర్ ప్రాజెక్టు క్రిందనున్న భూములనుండి 15 లక్షల టన్నులబియ్యాన్ని ప్రక్క ప్రాంతాలకు తరలించే సుందర భావినిగురించి ముఖ్యమంత్రి ముచ్చటించారు.




రైల్వేబోర్డు అధ్యక్షుడు శ్రీ బైజ్‌లాల్ – "ఒకకొత్త రైల్వే మండలాన్ని యేర్పరచడం ద్వారా యిప్పుడున్న రైల్వే మండలాలలోని రద్దీని తగ్గించడం అవసరంగా భావించబడింది."




అతిథులను అహ్వానిస్తున్న కేంద్ర రైల్వేజనరల్ మేనేజర్ శ్రీ రతన్‌లాల్.




రైల్వేబోర్డు అధ్యక్షుడు, కేంద్రరైల్వే జనరల్ మేనేజర్‌తో ముఖ్యమంత్రి.




"ఒంగోలు, నాగార్జునసాగర్ ప్రాజెక్టు, సికింద్రాబాదులను కలిపే 200 మైళ్ళ రైలుమార్గం విషయంలో పరిశీలనలు జరుగగలవు"— శ్రీ యస్. కె. పాటిల్.




ఆ సందర్భంలో ప్రసంగిస్తున్న శ్రీ వి. యస్. [illegible].




అనంతరం శ్రీ మాట్లాడుతూ నాగార్జునసాగర్ ప్రాజెక్టు క్రిందనున్న భూములలో పండే 10 లక్షల టన్నుల ధాన్యాన్ని ప్రక్క ప్రాంతాలకు తరలించే నిమిత్తం ఈ విషయం గుర్తించి ముఖ్యమంత్రి ముచ్చటించారు.



రైల్వేబోర్డు అధ్యక్షులు శ్రీ కర్నైల్‌సింగ్— "ఒక కొత్త రైల్వే మండలాన్ని యేర్పరచడం ద్వారా ఇప్పుడున్న రైల్వే మండలాలలోని రద్దీని తగ్గించడం అవసరంగా భావించబడింది."



అతిథులను ఆహ్వానిస్తున్న కేంద్ర రైల్వే జనరల్ మేనేజర్ శ్రీ రతన్‌లాల్.




రైల్వేబోర్డు అధ్యక్షుడు, కేంద్ర రైల్వే జనరల్ మేనేజరుతో ముఖ్యమంత్రి.




నూతన రైల్వేమండలం పరిపాలనా కార్యాలయ భవనాల శంఖు స్థాపన ఉత్సవ సందర్భంలో ప్రసంగిస్తున్న శ్రీమతి అమ్మన్న రాజా, ఎమ్, పి.




జూలై 24వ తేదీన కళాభవన్‌లో హంగేరియన్ ఫొటో ప్రదర్శనాన్ని తిలకిస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి.



"పారిశ్రామిక ప్రగతి పథంలో అకుంఠితంగా ఆంధ్రప్రదేశ్ పురోగమించుతున్నది–" జూలై 26వ తేదీన శాసనసభ, శాసనమండలి సంయుక్త సమావేశంలో ప్రసంగించుచున్న గవర్నర్.



జూలై 28వ తేదీన ఢిల్లీకి వెళ్ళుతూ దేశ వ్యవహారాల శాఖామంత్రి శ్రీ గుల్జారీలాల్‌నందా కొద్దిసేపటికొరకు బేగంపేట విమానాశ్రయంలో ఆగినప్పుడు ఆయనను అభినందిస్తున్న ముఖ్యమంత్రి.




శ్రీ గుల్జారీలాల్‌నందాతో ఆర్థికమంత్రి డాక్టర్ యమ్. చెన్నారెడ్డి, పద్మభూషణ మీర్ అక్బర్ అలీఖాన్.




విమానాశ్రయంలో హోంశాఖామంత్రి శ్రీ మీర్ అహమదలీఖాన్ శ్రీ గుల్జారీలాల్‌నందాను అభినందిస్తున్న దృశ్యం.




ఆగస్టు 7 వ తేదీన ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఆహార విషయాల్ని గురించి యేర్పాటుచేయబడిన ఒక సదస్సుకు ఆర్థిక, పరిశ్రమల శాఖామంత్రి డాక్టర్ యమ్. చెన్నారెడ్డి ప్రారంభోత్సవం చేశారు.



ఆహారం కల్తీకిసంబంధించిన ప్రదర్శనాన్ని చూస్తున్న డాక్టర్ యమ్. చెన్నారెడ్డి.



ఆగస్టు 8 వ తేదీన రవీంద్రభారతిలో ఆంధ్రప్రదేశ్ ఫిలిం జర్నలిస్టుల అసోసియేషన్ యేర్పాటుచేసిన అయిదవ ఫిలిం అవార్డుల ఉత్సవంలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి.



ఆసందర్భంలో ప్రసంగిస్తున్న శ్రీ బి. వి గురుమూర్తి.



ఆదేసందర్భంలో ఉపన్యసించుచున్న హైదరాబాద్ కార్పొరేషన్ మేయర్ శ్రీ శ్యామ్‌రావు.



ప్రఖ్యాత పాత్రికేయుడు, రచయిత శ్రీ ఖ్వాజా అహ్మద్ అబ్బాస్ ముఖ్యమంత్రినుండి అవార్డును అందుకుంటున్నారు.

విమానాశ్రయంలో



జూలై 27వ తేదీన శ్రీమతి ఇందిరాగాంధీకి సుమాంజలితో సుస్వాగతం పలుకుతున్న శ్రీమతి రాఘవమ్మ బ్రహ్మానందరెడ్డి.




కేంద్ర సమాచార ప్రసార శాఖామంత్రిణికి పూలదండలు వేస్తున్న వివిధ సంస్థలు

హైదరాబాదులో శ్రీమతి ఇందిరాగాంధీ






విమానాశ్రయంలో ముఖ్యమంత్రితో శ్రీమతి ఇందిరాగాంధీ.




జూలై 27వ తేదిన జూబిలీ హాలులో శ్రీమతి ఇందిరాగాంధీకి శ్రీ యస్. రామచంద్రారెడ్డి, శ్రీ యమ్. ఆర్. అప్పారావు, శ్రీ బి. వి. గురుమూర్తి, శ్రీ పి. వి. రాజుగారలను పరిచయం చేస్తున్న ముఖ్యమంత్రి.



జూబిలీ హాలులో ముఖ్యమంత్రి, శ్రీమతి ఇందిరాగాంధీ.



ముఖ్యమంత్రి ఇచ్చిన ఒక విందులో శ్రీమతి ఇందిరాగాంధీ.



జూబిలీ హాలులో శ్రీమతి ఇందిరాగాంధీతో హోంమంత్రి శ్రీ మీర్ అహ్మద్ అలీఖాన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తదితరులు.



విందు తరువాత శ్రీమతి సీత, శ్రీమతి అనసూయ ఆంధ్ర జానపద గీతాలను వినిపించారు.

'అప్సరసలో' ఒక్క రోజు

హైదరాబాదు యాత్రికునికి 'అప్సరస'లో

ఒకరోజు మర్చిపోని అనుభూతి

అది అతనిని

గోల్కొండకోట	నెహ్రూ జూలాజికల్ పార్క్
చార్ మినార్	సాలార్జంగ్ మ్యూజియం
పబ్లిక్ గార్డెన్స్	ఉస్మానియా విశ్వవిద్యాలయం

మొదలయిన స్థలాలకు తీసుకొని వెళ్తుంది.

శుక్రవారం మినహా ప్రతిరోజూ పర్యటించవచ్చు

సాలార్జంగ్ మ్యూజియం

ప్రవేశరుసుముతో సహా

రూ. 6·50 మాత్రమే

రిజర్వేషన్లు చేయించుకోవలసిన స్థలము - అప్సరస బయలుదేరు స్థలము :

రాష్ట్ర టూరిస్టు సమాచార కేంద్రం, సమాచార పౌర సంబంధాల శాఖ

గాంధీభవనం ఎదుట, హైదరాబాదు.

ఫోను నం. 43281 మరియు 43282.

అడవి మల్లె

సీరియల్ (గత సంచిక తరువాయి)

జరిగిన కథ

చిన్ననాడే తల్లిదండ్రులను పోగొట్టుకున్న చంద్రం, తన అన్న కృష్ణారావు చుట్టూ ఆశలతీవెల్ని చుట్టుకుని భవిష్యత్తుకలలు కంటుండగా, వదిన కాంతమ్మ సుడిగాలిలా వచ్చి తీగెల్ని కుప్పగా నేలకూల్చి, అతని బంగారు కలలపంట మీద ఆగ్రహాన్ని అగ్నిలా కురిపించి, భవిష్యత్తును మసిబొగ్గు చెయ్యబోయింది. భార్యకు జడిసి, తమ్ముడిమీద దొంగతనాన్ని రుద్ది, పశువులపాకలో రాటకు కట్టివేశాడు అన్న. అనురాగాలు నుసిబొగ్గయి అంధకారం అలముకున్న చీకట్లో చంద్రునికి ఒకేఒక ఆశాకిరణం పక్కింటి ప్రసాదరావుగారి కుమార్తె హేమమాలిని. కాని మరోమూల అతి బీదగా రెండు చిన్న అమాయకపుకళ్ళు మిణుకుమిణుకుమని వెలిగాయి. అతనిమీద జాలిని కురిపించాయి ఆకళ్ళు. అమాయకురాలైన గౌరిమీద దుర్మార్గపు వ్యాపారం చేసే నాగేంద్రం. ఆ దెమ్మలకు సానుభూతి కలుగుతుంది. స్వతహాగా అవినీతి వ్యాపారం చేస్తూ వుండే నాగేంద్రం గౌరిని పెళ్ళిచేసుకోవాలని చూడగా, ఆ దెమ్మ తన చాక చక్యంతో, తన పాపపరిహారార్థం బాలిక అయిన గౌరిని అనాథశరణాలయంలో చేర్చి తన జీవితం మంచిమార్గంలో గడుపుతుంది. గొడ్లచావిడినుండి తప్పించుకున్న చంద్రం ఆకలితో రైలుస్టేషను చేరి, ఆత్మహత్య చేసుకోబోతున్న ప్రకాశంను కాపాడుతాడు. దీనివలన చంద్రంకు జబ్బుచేయగా, ప్రకాశం తండ్రి భద్రయ్య కృతజ్ఞతతో వైద్యంచేయించి అతనిని ప్రయోజకుడ్ని చేయడానికి ధనసహాయం చేస్తాడు. భద్రయ్య కృష్ణారావుకు వైరియే అయినా చంద్రంవిషయంలో కృతజ్ఞతగానే ఉంటాడు.

6

ఎనిమిది సంవత్సరాలకాలం యిట్టే గడిచిపోయింది. సంఘ జీవితంలో చెప్పలేం కాని, వ్యక్తిజీవితంలో ఎన్నో మార్పులు కలగటానికి ఎనిమిది సంవత్సరాలు చాలు.

కృష్ణారావు నడుపుతున్న చిన్న పొగాకు కంపెనీ పెద్ద ఫ్యాక్టరీగా మారింది. పాత సైన్‌బోర్డు స్థానాన్ని, 'శేఖర్ టుబాకో ఫ్యాక్టరీ' అన్న కొత్తబోర్డు ఆక్రమించుకున్నది. గుంటూరు టౌనుకు చిన్న సిటీ లక్షణాలు ఏర్పడినై. మెడికల్ కాలేజీతో పాటు, మరికొన్ని కొత్త కాలేజీలూ, హాస్పిటల్సూ వచ్చాయి. పల్లెటూళ్ళలో నివసించే ధనిక కుటుంబాలవాళ్ళు చాలామంది పిల్లల చదువుకోసం అంటూ పట్టణం మీదికి ఎత్తివచ్చారు. బీద కుటుంబీకులు, విడవకుండా కూలీనాలీ దొరుకుతుందన్న ఆశతో గ్రామాలు వదిలి లేచివచ్చారు.

పైచూపులకు పట్టణం బాగా మారింది. వాతావరణం మరింతగా మారింది. కాని ఫ్యాక్టరీలలో, కార్ఖానాలలో కష్టించి పనిచేసే కూలీల జీవిత విధానంలో మార్పులేదు. కృష్ణారావు యాజమాన్యంలో నడుస్తున్న పొగాకు ఫ్యాక్టరీకి అంతదూరంలో వున్న మైదానంలో మరికొన్ని కొత్తపూరిగుడిశెలు లేచాయి. వాటితోపాటు అక్కడ మురికీ, బీదతనం కూడా మరికొంత పెరిగింది.

పూర్వం వేలల్లో నడిచిన కృష్ణారావు వ్యాపారం యిప్పుడు లక్షలమీద నడుస్తున్నది. పాతడాబా యింటి స్థానంలో, రెండతస్తుల విశాలమైన మేడ కట్టించాడు. అతడిప్పుడు నవనాగరిక జీవితానికి అవసరం అయిన అన్ని హంగులూ ఏర్పాటు చేసుకున్నాడు. ఇంటికి కావలసిన ఫర్నీచరంతా ఆర్డరిచ్చి బొంబాయినుంచి తెప్పించాడు.

కృష్ణారావు ఏకైక పుత్రిక రజనికి యిప్పుడు పన్నెండోఏడు. రజనిని అందరూ అచ్చం బాబాయి పోలిక అంటారు. చంద్రం యిల్లు వదిలిపోయినప్పుడు రజని మూడేళ్ళ పిల్ల. ఆ కారణంగా ఆమెకు చంద్రం ఏమీ గుర్తులేదు కాని, హేమ దగ్గరకు వెళ్ళినప్పుడల్లా రజని చంద్రాన్ని గురించి అడుగుతూండేది. ఎలాంటివాడు? కోపధారా? నిదానస్తుడా? ఎర్రగా వుండేవాడా? చామనచాయా? ఈ ప్రశ్నలెప్పుడైనా తల్లినడిగితే, ఆవిడ కస్సుమనేది. తండ్రినడిగితే ముభావంగా తలవంచుకు వూరుకుని, బాధపడుతున్నట్టు కనబడేవాడు

చంద్రంబాబాయికి తానంటే చాలా ప్రేమ అనీ, ఎప్పుడూ భుజంమీద వేసుకుని తిప్పుతుండేవాడనీ, హేమ ద్వారా తెలుసుకుని రజని చాలా ఆనందపడేది. బాబాయి యిప్పు

వాసిరెడ్డి సీతాదేవి

డెంత ఎత్తు పెరిగివుంటాడు? ఏనాటికైనా ఇంటికి తిరిగివస్తాడా? ఇలాంటి ప్రశ్నలతో రజని సతమతమైపోతూవుండేది.

రజని చాలా చురుకైన పిల్ల. తల్లిదండ్రులకు ఏకైక సంతానం కావడంవల్ల ఎంతో అల్లారుముద్దుగా పెంచుకుంటున్నారు. తల్లి కాంతమ్మకు రజనిమీద ఈగ వాలినా ఎక్కడ కందిపోతుందోనన్నంత భయం. రజని మాటకు ఎదురుచెప్పే ధైర్యం ఆ ఇంట్లో ఎవరికీ లేదు. కొంచెం కోపగిస్తేచాలు, అలిగి కూర్చునేది. ఆమెకు సినీమా పత్రికలూ, డిటెక్టివు నవలలూ చదవడంలో వున్న శ్రద్ధ, స్కూలు పుస్తకాలమీద లేదు. అందువల్లనే, రజని రెండు సంవత్సరాలుగా థర్డ్‌ఫారంలోనే వుండిపోయింది. కృష్ణారావు కూతురు చదువు అశ్రద్ధచేస్తున్నదని తెలిసి, గట్టిగా కోప్పడాలనుకునేవాడు. కాని, కాంతమ్మకు భయపడి అత డామెను మందలించలేకపోతున్నాడు.

కాంతమ్మ దృష్టిలో తన కూతురు చదవటం, పరీక్షలు ప్యాసవటం–అంతా వట్టి హైరాన. ఎంత పెద్దచదువు చదివిమాత్రం తన కూతురు ఉద్యోగాలు చేయబోతున్నదా? ఊళ్ళేలబోతున్నదా? తనబిడ్డ గొప్ప అదృష్టవంతురాలు. బిడ్డ వయసుతోపాటు తమ సంపదకూడా పెరుగుతున్నది. దానికి చదువుమీద యిష్టంలేకపోతే, చదవమని బలవంతం చెయ్యటం ఎందుకు? ఇంకో అయిదారేళ్ళు గడిస్తే, తమ హోదాకు సరితూగే కుటుంబంలోని కుర్రవాణ్ణెవర్నయినా తెచ్చి, దానికి ముడేసి, ఇంట్లోనే ఇల్లరికం వుంచుకుంటే సరిపోతుంది.

కాంతమ్మ కెప్పుడూ యిలాంటి ఆలోచనలే. ఆమె వట్టి ఆలోచనలతో సరిపెట్టుకుని యింట్లో కూర్చోక, తమ అంతస్థుకు తగినవారనుకున్న కుటుంబాలవాళ్ళతో పరిచయాలూ, స్నేహాలూ ప్రారంభించింది. డబ్బుతోపాటు కాంతమ్మ మానసికంగా కూడా కొంత పెరిగింది. ధనంవల్లగాని, ఉద్యోగరీత్యాగాని గొప్పవాళ్ళని ఆమె అనుకున్న వ్యక్తులతో, సమానఫాయాలో మాట్లాడటం నేర్చుకున్నది.



ఉన్నట్టుండి ఒక శుభముహూర్తాన కాంతమ్మ లేడీస్ క్లబ్బులో మెంబరుగా చేరింది. అక్కడి కొచ్చేవారంతా కొద్దో గొప్పో చదువుకున్నవాళ్ళు, పెద్దపెద్ద ఆఫీసర్ల భార్యలూ వారి సంతానమూనూ. కాంతమ్మ తన భర్తదగ్గిర ఓపికవున్నప్పుడల్లా నాలుగు ఇంగ్లీషుముక్కలు నేర్చుకుని, వాటిని సందర్భశుద్ధి వున్నా లేకపోయినా క్లబ్బులో ధారాళంగా వుపయోగించేది. విన్నవాళ్ళు – విరగబడి నవ్వబోయి పెద్దింటావిడ ఏమనుకుని పోతుందో అని చిరునవ్వు నవ్వే ప్రయత్నంలో వికవిక పకపక మనేవాళ్ళు. అలాంటి సందర్భాల్లో కాంతమ్మకు అరికాలిమంట నెత్తికెక్కేది. 'డిగ్రీలూ, ఉద్యోగాలూ వున్నా, లక్ష్మి లేనివాళ్ళకు, మర్యాదా మన్ననా ఏం తెలుస్తుంది?' అనుకునే దావిడ యీసడింపుగా. ఆ నవ్వినవాళ్ళ నందర్నీ నాగరికత తెలియని పశువులకింద జమకట్టేసేది.

క్లబ్బు కొచ్చేవాళ్ళల్లో రిటైర్డ్ హైకోర్టు జడ్జి సుందరంగారి భార్య అంటే కాంతమ్మకు మహాచెడ్డకోపం. కాంతమ్మకూ, ఆమెకూ

ప్రతి చిన్న విషయంలోనూ వాదోపవాదాలు జరుగుతూండేవి. ఇక కలెక్టరు భార్య కళావతి వున్నది. ఆమె అక్లబ్బుకు వచ్చే వారందరిలోకీ సౌందర్యవతి, విద్యావతి. ఆమె ఎవరి మనసూ నొప్పించకుండా తాను నవ్వుతూ అందర్నీ నవ్విస్తూండేది. ఆమెఅన్నా కాంతమ్మకు పడదు, కాని పైకి మాత్రం ఎంతో అప్యాయతా, గౌరవం కనబరుస్తూండేది.

ఒకనాడు క్లబ్బులో అందరూ పేకాడుతున్నారు. మధ్య మధ్య మిసెస్ సుందరం, కాంతమ్మా ఒకరినిమించి ఒకరు గొప్పలు చెప్పుకుంటున్నారు. మిసెస్ సుందరం ఒక్కతే కాంతమ్మతో యిలాంటి కబుర్లు పెట్టుకుంటుంది. తతిమ్మావారు ఆమెసంగతి అంతగా పట్టించుకోరు.

"మీరు కట్టినచీర బావుంది, కొత్తదా?" అనడిగింది మిసెస్ సుందరం కాంతమ్మను.

"అబ్బే, లేదు; డ్రైవాష్‌నుంచి వచ్చింది. నేను పట్టుచీర ఒక్కసారికంటే ఎక్కువ కట్టను. డ్రైవాష్‌కు వేసేస్తాను, అదీ ఫ్యాషన్స్ కంపెనీవాళ్ళకే. వాళ్ళు చీరకు రెండు రూపాయిలు చార్జి చేస్తారు. అదెంత లెండి! మా వారికి నేను నలిగిన చీర కట్టుకోవటం బొత్తిగా యిష్టం వుండదు." అన్నది కాంతమ్మ గర్వంగా.

"మీవారే నయం! మా వారు వాష్‌కు వేసిన చీర కట్టుకుంటే కోప్పడతారు. అందుకని, కొత్తచీర ఒకేసారి కట్టి, దాన్ని మా పనిపిల్ల కిచ్చేస్తాను. అది ఆ చీరల్ని డ్రైవాష్‌కు వేసిగాని మరికట్టుకోదు. అదిప్పుడిప్పుడే కాస్త బడాయి నేరుస్తున్న పిల్ల లెండి!" అన్నది మిసెస్ సుందరం వచ్చే నవ్వు ఆపుకుంటూ.

ఈ మాటలు విన్నవాళ్ళందరూ గొల్లుమంటూ నవ్వారు. కాంతమ్మకు ఒంటిమీద తేళ్ళు జెర్రులూ పాకినట్టయింది. ఒకే మోతాదులో యింత అవమానాన్నెమేనాడూ మింగవలసిరాలేదు. ఆనాటితో ఆమె క్లబ్బు ఛాయలకేసికూడా పోవటం మానుకున్నది.

కాంతమ్మను గృహసమస్యలుకూడా కొన్ని బాధించసాగినై. ఆదాయం పెరగటంతో, ఆ అంతస్తుకు తగినట్టు బతుకుదామని కాంతమ్మ ఇంట్లో నౌకర్లనూ, చాకర్లనూ కొందరిని చేర్చింది. తిండీ, ఇరవై పాతికరూపాయిల నెలజీతాలకు వచ్చిన వీళ్లు అవకాశం దొరుకుతే ఎన్నెన్ని దొంగతనాలు చేయగలరో, ఆమె ఆలోచించుకుని బెదరిపోతుండేది. ఈ నౌకర్లలో ఒక్కర్నీ నమ్మటానికి లేదు. వంటవాడు కాస్త సందుదొరికితే పాలూ పెరుగులు మెక్కేయటమేగాక, కూరానారా అలగా వాళ్ళందరికీ పంచేస్తాడు. ఇల్లూడ్చే పిల్లా, పక్కలు పరిచే మునలిదీ ... వీళ్ళను అసలు ఆదమరిచి వుండేందుకే లేదు. నెలాఖర్న వీళ్ళందరికీ జీతం డబ్బు లిచ్చేప్పుడు కాంతమ్మకు ప్రాణం కడబట్టినంత పనయ్యేది. పనీ పాటూలేని వాళ్ళందరికీ తాను ఊరికే డబ్బు ధారపోస్తున్నట్టు బాధపడేది. కాని, ఇంటికి యీ హంగులన్నీ తప్పవు. పెళ్ళీడుకు వస్తున్న పిల్లవున్నది. ఏ క్షణాన ఎలాంటి సంబంధాలు వస్తాయో చెప్పలేం.

కృష్ణారావులో కూడా రోజు రోజుకూ పెరిగిపోతున్న ఆదాయం చాలా మార్పులు తెచ్చింది. ఏనాడూ రాజకీయాలజోలికి పోని కృష్ణారావు అవంటే ఎంతో అనక్తి కనబరుస్తున్నాడు. ఏదైనా ఎన్నికలొస్తే, అతని ఇంటికి వచ్చిపోయే కార్లసంఖ్య చెప్పటం కష్టం. అసెంబ్లీకి నిలబడవలసిందిగా కొంద రతణ్ణి గట్టిగాకోరారు. అంత తొందరేం వచ్చిందిలే; అన్న ధోరణిలో కృష్ణారావు మాట్లాడాడు. ఇలాంటిసంగతులు తెలిసినప్పుడల్లా కాంతమ్మభర్త అంత ప్రయోజకుడై పోవటానికి కారణం తనే అనుకుంటుంది. ఆమె పలుకుబడివల్లే కావచ్చు, ఒకప్పుడు నాస్తికుడిలామాట్లాడే కృష్ణారావు యిప్పుడు గొప్ప ఆస్తికుడూ, వెంకటేశ్వరస్వామి భక్తుడూ అయిపోయాడు. సింహద్వారం దాటి ఇంటో ప్రవేశించగానే, నిలువెత్తు ఏడుకొండలవాడి విగ్రహం అందర్నీ ఆకర్షిస్తుంది. భార్యాభర్త లిద్దరూ తప్పకుండా శనివారాల్లో ఉపోషాలు చేస్తూంటారు.

డబ్బూ, పలుకుబడీ, ఆరోగ్యం, చక్కని కుమార్తె, యిన్నివున్నా, ఎటో పారిపోయిన తమ్ముడు చంద్రాన్నిమాత్రం కృష్ణారావు మరిచిపోలేకపోతున్నాడు. అతడు గుర్తు వచ్చినప్పుడల్లా, కృష్ణారావు తమ్ముడిపట్ల తానుచేసిన దౌష్ట్యానికి బాధపడుతూండేవాడు. దొంగతనం చేసినా, తమ్ముణ్ణి తానలా గొడ్లచావిటిలో గుంజకు కట్టివేయవలసిందికాదు. ఈ పాడుపని చేయటం ద్వారా తను మరణించిన తల్లిదండ్రుల్ల ఆత్మలకు శాంతి లేకుండా చేసివుండవచ్చు. చంద్రం యింకా బతికేవున్నాడా?

తమ్ముణ్ణిగురించిన యీ అనుమానం కృష్ణారావుకు సరిగ్గా ఆఫీసుకు బయలుదేరే సమయాల్లో ఎదురవుతూండేది. ఆరోజునా ఎందుకనో చంద్రం హఠాత్తుగా గుర్తుకు వచ్చాడు. కృష్ణారావు ఆఫీసుకు వెళ్ళే ప్రయత్నం మాని, తనగదిలోకి వెళ్ళి పడుకున్నాడు. భార్యవచ్చి అడిగితే ఒంట్లో బాగోలేదని చెప్పాడు.

గోడ గడియారం పన్నెండు కొట్టింది. బయట ఎండ మండిపోతున్నది. గదిలో ఫాన్ తిరుగుతున్నా, గాలి మరింత వేడెక్కిపోతున్నది. ఫాన్ ఆపితే ఎక్కడలేని ఉక్క.

కృష్ణారావు మంచం మీంచిలేచి వరండాలోకెళదామనుకునేంతలో, అప్పుడే భోజనం చేసిందేమో, ఆయాసపడుతూ కాంతమ్మ గదిలో ప్రవేశించి, "చూడండి, యిక్కడ ఎంత ఉక్కగా వుందో! ఒక్కగదన్నా ఎయిర్‌కండిషన్ చేయించమంటే చేయించారూ? ఆ జడ్జి సుందరంగారు చూడండి, ఉన్నదాన్లోనే ఎంతగొప్పగా కనబడతారో. మూడుగదులు ఎయిర్‌కండిషన్ చేయించారట:" అన్నది.

ఈ మాటలు వింటూనే కృష్ణారావుకు ఒళ్లు మండిపోయింది. తన భార్య ఒక్కవా

డైనా తన తమ్ముణ్ణి గురించి అడిగిన పాపాన పోలేదు. వాడింకా బతికుంటే ఎక్కడో వికారిలా జీవితం గడుపుతూండి వుంటాడు. ఆ స్తిలో వాడికీ వాటా వున్నది. అయినా వాడికి అనుభవించే రాతలేదు. ఉన్నది చాలక తన భార్య ఎయిర్‌కండిషన్లు కావాలంటుంది. చంద్రం తిరిగి రాకపోవటమే ఆమె కోరుకుంటున్నట్టు కనబడుతుంది. అప్పుడు ఆస్తంతా తన కూతురికే దక్కుతుంది. ఈ మనిషిలో మానవత్వం ఉందా ?

"ఉలకరూ పలకరూ, ఏమిటంత యిదిగా ఆలోచిస్తున్నారు ? ఒంట్లో మరీ అంత బావోపోతే; డాక్టరుకు ఫోన్ చేయండి. అయినా, నామాట మీరేనాడు లెక్క చేశారు గనక !" అంటూ కాంతమ్మ ముఖం ముడుచుకుని, దూరంగా పోయి కూర్చున్నది.

కృష్ణారావు భార్య అన్నమాటలకు ఏ జవాబూ యివ్వలేదు. అతడికి ఆలోచనల మీద ఆలోచనలు వస్తున్నవి. కాంతమ్మ మాట తనెప్పుడు కాదన్నాడో అతడికి గుర్తు రావటంలేదు. నిజంగానే, ఆమె మాట పాటించక, ఆమెను తగిన హద్దుల్లో ఆమె నుంచి వట్టయితే, తన తమ్ముడు దేశాలుపట్టి పోవలసిన అవసరం కలిగేదికాదేమో ! ఈనాడు లక్షల ఆస్తికి వారసుడైన చంద్రం పొట్టకోసం ఎన్నెన్నిబాధలు పడుతున్నాడో, భగవాన్ ! తను చేసిన పాపానికి నిష్కృతి లేదు.

కృష్ణారావు చెమ్మగిల్లిన కళ్ళను తుడుచుకుంటూ మంచంమీద ఓ పక్కకు వత్తిగిలి పడుకున్నాడు. చంద్రం జాడలు తెలుసుకునేందుకు తాను చేయవలసినదంతా చేశానన్న తృప్తి అతడికిలేదు. చంద్రం ఎక్కడ వున్నదీ తెలియపరిచినవారికి పెద్ద బహుమానం యిస్తానని. అతడు పత్రికల్లో ప్రకటనలు చేయించాడు. ఫలితం లేక పోయింది. గురుకుల్ వాళ్ళకు రాస్తే, చంద్రమోహన్ అనే తెలుగు కుర్రవాడొకడు కొత్తగావచ్చి చేరినట్టు జవాబిచ్చారు. తన తమ్ముడు చంద్రశేఖర్, చంద్రమోహన్ అని పేరు మార్చుకున్నాడేమో అన్న అనుమానం తనకు కలుగకపోలేదు. కాని, అనుమానం అనుమానంగానే వుండి పోయింది. వ్యాపార గొడవల్లో పడిపోయి, తాను విషయం అంతటితో వదిలేశాడు. తాను ఒక్కసారి ఆ గురుకుల్‌కు వెళ్ళివస్తే ఎంత బావుండేది. కాని, తనాపని చేయలేదు. ఆఫీసు.. వ్యాపారం... లాభాలు... భగవాన్.

భర్తపక్కకు తిరిగి పడుకుని, ఎంత సేపటికీ మాట్లాడకపోయేసరికి, కాంతమ్మకు ఉక్రోషం వచ్చి, చివాలున గదిలోంచి హాల్లోకి వెళ్ళి, అక్కడ యీజీచైరొకటి లాక్కుని పడుకున్నది. ఇంతకాలం జరిగినా దొంగతనం చేసి యింట్లోంచి పారిపోయిన తమ్ముడిమీద తన భర్తకు ప్రేమ తగ్గక పోవటం ఆమెకు వింతగా తోచింది. ఆనాడు చంద్రం విషయంలో కల్పించుకుని, భర్తచేత ఎన్నడూలేంది చెంప ఛెళ్ళుమని పించుకున్న తరవాత కాంతమ్మ మరిది ప్రసక్తి భర్తదగ్గిర ఏనాడూ తేలేదు. భర్త అతణ్ణిగురించి ఏమైనా చెబితే వినేది, ఊకొట్టేది, అంతే.

కాంతమ్మకు కొంచెం కునుకు పట్టేవేళకు, ఎవరో తన భర్త గదిలోకి వచ్చిన అలికిడి వినబడింది. ఈ వేళప్పుడు ముందు పిలవా పెట్టకుండా అంత స్వతంత్రంగా గదిలోకి వచ్చేవా ళ్లెవరై వుంటా రబ్బా? అనుకుంటూ కాంతమ్మ యీజీచైరులోంచి లేచి తలుపు దగ్గిరకు వెళ్ళింది. గదిలో సంభాషణ సాగుతున్నది. ఆ వచ్చినవాడు ప్రసాదరావు.

ప్రసాదరావు వుత్తినేరాడు; ఆ సంగతి కాంతమ్మకు బాగా తెలుసు. వచ్చినప్పుడల్లా చంద్రాన్నిగురించి హోరెత్తిపోయేట్టు అదీ యిదీ మాట్లాడేస్తాడు. ఈ వేళ కాని వేళ వచ్చాడు గనుక యిందులో ఏదో విశేషమే వుంటుంది.

కాంతమ్మ గదిలోకి రెండడుగులు వేసి, గోడపక్కగా వున్న టేబిల్‌మీద కాయితాలూ అవీ సర్దుతున్నట్టు నటిస్తూ, భర్తముఖంకేసీ, ప్రసాదరావు ముఖంకేసీ పరీక్షగా చూసింది. ప్రసాదరావు ముఖంలో ఏదో సంతోషం తాండవిస్తున్నది. భర్త ముఖంలో అంతకు ముందున్న చిటపటలు పోయి, ఆ స్థానాన్ని మందహాసం ఆక్రమించుకుని వున్నది. అత డేదో పత్రికను శ్రద్ధగా పరికించి చూస్తున్నాడు. కాంతమ్మ టేబిల్‌పక్కనే వున్న సోఫాలో కూర్చుని ఆముదం తాగబోయే ముఖం పెట్టి భర్తకేసి చూస్తూ వుండి పోయింది.

కృష్ణారావు హఠాత్తుగా పత్రిక మీంచి తలఎత్తి, కాంతమ్మకేసి చిరునవ్వుతో; చూస్తూ, "కాంతం! యిలారా, చూడు. యీ ఫోటో మన చంద్రానిదే, సందేహం లేదు " అన్నాడు.

కాంతమ్మ ఏదో పుట్టి మునిగినట్టు హడావిడిగా సోఫాలోంచి లేచి భర్తదగ్గిరకు పోయి, అతడందించిన పేపరు తీసుకుని, ఫొటోకేసి చూసింది.

"ఏమండీ, కాంతమ్మగారూ! చంద్రమే గదూ?" అని ప్రశ్నించాడు ప్రసాదరావు.

"అవునండీ. అచ్చం చంద్రంలాగే వున్నాడు. కాని, పేరు చంద్రమోహన్ అని వుంది, మరి!" అన్నది కాంతమ్మ. కంఠస్వరంలో ఆశ్చర్యం, దాన్ని మించిన అనుమానం స్ఫురింపజేస్తూ.

"మన చంద్రమే! అనుమాన పడేందుకాస్కారమే లేదు," అంటూ కృష్ణారావు ప్రసాదరావుకేసి తలతిప్పి, "ప్రసాదరావు గారూ, మీకు బాగా గుర్తేగా? చంద్రం పారిపోయిన కొత్తలో మనం గురుకుల్ వాళ్ళకు వుత్తరం రాశాం. వాళ్ళు చంద్రశేఖర్ అనే కుర్రవా డెవడూ తమ గురుకుల్‌లో లేడనీ, కాని చంద్రమోహన్ అనే కుర్రవా డొకడు కొత్తగా వచ్చి తమవద్ద చేరాడనీ బదులు రాశారు. చంద్రశేఖర్, చంద్రమోహన్ అని పేరు మార్చుకుని వుండొచ్చని మనకు కాస్త అనుమానం కలిగి కూడా, ఆ విషయాన్ని అంతటితో ఎందుకు వదిలేశామో, యీ నాటికీ నాకు అర్థం కావటం లేదు. శేఖర్... మోహన్, ఎంత

చిన్న మార్పు! అయినా. మనం అమాయికుల్లా ఆ సంగతి నంతటితో వదిలేశాం. చంద్రం సేరెందుకు మార్చుకుంటాడులే అని సర్ది చెప్పుకున్నాం." అన్నాడు ఎంతో బాధపడుతూ.

అవును. పెద్ద పొరపాటే జరిగిపోయింది. మనం అమాయికుల్లా కాదు, సొంతం మతి పోయినవాళ్ళలా ప్రవర్తించాం. గురుకుల్ వాళ్ళకు డబ్బు పంపి, ఆ చంద్రమోహన్ అనే కుర్రవాడి ఫొటో పంపమని రాసినా, అప్పట్లోనే నిజం బయటపడేది. ఇదంతా యిప్పు డనుకుని ఏం లాభం లెండి! పత్రిక పొద్దునే వచ్చినా, ఆ ఫొటో నేను గమనించనే లేదు ఇంతకుముందే ఆమ్మాయి హేమ చూసి ఆ సంగతి నాకు చెప్పింది. పాపం, దాని కెంత సంతోషం కలిగిందనుకున్నారు? బాల్య స్నేహం కదా!" అన్నాడు ప్రసాదరావు.

కాంతమ్మ పత్రికను భర్తచేతికిస్తూ "అమ్మయ్య, దేవుడి దయవల్ల చంద్రం క్షేమంగా వున్నట్టు తెలుసుకున్నాం. ఇప్పు డెక్కడున్నదీ ... ఆ అడ్రసు మీకు తెలుసు గద? వెంటనే వెళ్ళి తీసుకురండి." అన్నది.

కాంతమ్మలో యింత హఠాత్తుగా, యింత మంచిమార్పు రావటం కృష్ణారావుకు చాలా ఆనందం కలిగించింది ప్రసాదరావు కూడా సంతోషించాడు. 'ఎంత కాదన్నా స్త్రీ హృదయం కదా మరి' అనుకున్నా డాయన.

"కృష్ణారావుగారూ. ఇది మనందరికీ ఎంతో సంతోషసమయం" అంటూ ప్రారంభించాడు ప్రసాదరావు. "నేను ఒకరోజు మీతో అన్నాను, గుర్తుందా; చంద్రం మంచి రచయిత అవుతాడని? ఇప్పుడు చూడండి, చంద్రం రాసిన, 'సాహిత్యమూ-సంస్కృతీ' అన్న పుస్తకానికి అకాడెమీ బహుమతి లభించింది. చంద్రాన్ని గురించిన పరిచయ వాక్యాలు చదివారుగదా! చంద్రం రాసిన నాలుగు నవలలు యింతకుముందు అచ్చయాయట," అన్నాడు.

ప్రసాదరావు మాటలు వింటూంటే కృష్ణారావుకు సంతోషం దుఃఖంకూడా ముంచుకు వస్తున్నది. "ఆలస్యం ఎందుకు? నేను రేపే బయలుదేరి వెళతాను," అన్నా డాయన.

"మీ రెళ్ళేవరకూ ఢిల్లీలోనే వుంటాడని నమ్మకం ఏమిటి? అది అతను స్థిరంగా వుండే చోటు కాదుగదా! కనక, స్థిరంగా వుండే అడ్రసేదో ముందు తెలుసుకు మరీ బయలుదేరండి," అని సలహా యిచ్చింది కాంతమ్మ

"అదీ నిజమేనండీ, కృష్ణారావుగారూ! సెంట్రల్ సాహిత్య అకాడెమీకీ, యీ ఫోటో ప్రకటించిన హిందూస్థాన్ టైమ్స్ పత్రికకూ చంద్రం అడ్రసుకోసం రాస్తాను. అది తెలియగానే, మీరు బయలుదేరి వెళ్ళ వచ్చు" అన్నాడు ప్రసాదరావు.

కృష్ణారావుక్కూడా అలా చేయడమే బావుంటుం దనిపించింది. ప్రసాదరావు కుర్చీలోంచి లేచి, వెళ్ళొస్తా నని చెప్పి బయలుదేరగానే, కృష్ణారావు అతనివెంట గేటుదాకా పోయి సాగనంపి, "మీ రొచ్చే ముందు నేను చంద్రాన్నిగురించే ఆలోచిస్తున్నాను. మీరు మంచి శుభవార్త తెచ్చారు. చాలా కృతజ్ఞుణ్ణి." అన్నాడు.

"చంద్రం మీకూ, మాక్కూడా సమానంగా ప్రేమపాత్రుడు ఇంతకాలానికి హేమ ముఖంలో ఆనందం. కొత్తకాంతి చూశా నంటే నమ్మండి." అన్నాడు ప్రసాదరావు

ప్రసాదరావు గేటదాటి వెళ్ళిపోగానే, కృష్ణారావు గబగబా ఇంట్లోకివచ్చి, శరీరంలోకి నూతన శక్తి వచ్చినవాడిలా చప్పట్లు చరుస్తూ రజనీ! రజనీ! ఎక్కడ?" అంటూ కేకలుపెట్టాడు.

రజని డిటెక్టివ్ నవల ఒకటి తెరచిపట్టుకుని తనగదిలోనుంచి అయిష్టంగా బయిటికి వచ్చి, "ఏం, డాడీ! కథ మంచిక్లయిమాక్స్‌లో వున్నప్పుడు పిలుస్తూంటారు, మీరు. ఏటో తొందరగా చెప్పండి." అన్నది కొంచెం విసుగ్గా

"మరేంలేదమ్మా! ఎవరేంచెప్పినా నమ్మి హడావిడి చేస్తూంటారు మీనాన్న." అన్నది కాంతమ్మ దెప్పిపొడుస్తున్నట్టు

కాంతమ్మ మాటల్లో యింతలోనే అంత పెద్దమార్పు వచ్చినందుకు ఆశ్చర్యపడుతూ, కృష్ణారావు పత్రికను కూతురు చేతి కిచ్చి, "ఆఫొటో ఎవరిదో తెలుసా?" అని అడిగాడు.

రజని ఫొటోకేసి ఓమారు చూసి కింద వున్న పేరు, చంద్రమోహన్ అని చదివి, "నాన్నా! ఈయని ఫొటో లోగడే ఎక్కడో చూశాను. ఆఁ, గుర్తుకొచ్చింది. ఈయన రాసిన నవల ఒకటి...దాని పేరేం టబ్బా... ఆఁ, 'తిరస్కృతి' రాజా యిస్తే చదివాను. చాలా బాగా రాశాడు. ఆ నవల అట్టమీద కూడా యిదే ఫొటోవుంది. అప్పుడుకూడా అనుకున్నాను. ఈ మొహం ఎక్కడో చూసినట్టుందే అని." అన్నది రజని.

"ఆ నవల నా కివ్వనేలేదే! ఎన్నాళ్ళ కిందట చదివావు?" అని ప్రశ్నించాడు కృష్ణారావు.

"ఓఁ, ఆర్నెల్లయిపోయింది. నీకెందు కివ్వాలి? నువ్వసలు నవలలు చదవనే వద్దంటావుగా," అన్నది రజని చిరుకోపంగా.

"చూడమ్మా, నీ పెట్టెలో వున్న బాబాయి ఫొటో ఒకసారి తెస్తావా?"

"ఎందుకూ? యిప్పుడే తెస్తాను," అంటూ రజని ఒక్కపరుగున పోయి, పెట్టెలోంచి ఫొటో తీసుకువచ్చి తండ్రి కిచ్చింది.

అంతదూరంలో నిలబడి తండ్రీకూతుళ్ళ హడావిడంతా గమనిస్తున్న కాంతమ్మ, "కాస్తకే అంత మురిసిపోతే ఎలా? మనిషిని పోలిన మనుష్యులు ఎందరో వుంటారు," అన్నది మూతి తిప్పుతూ. రజనికి మాట లేమీ అర్థంకాలేదు.

"చూడమ్మా! ఈ రెండు ఫొటోలకూ పోలికలున్నవేమో?" అంటూ కృష్ణారావు, పత్రికనూ, ఫొటోనూ కూతురు కిచ్చాడు. అతడు భార్య అన్నమాటలు, వినిపించు

కున్నట్టే లేదు.

రజని రెండు ఫొటోలనూ ఒకదాని పక్కన ఒకటి పెట్టి, ఓ క్షణకాలం పోల్చి చూసి, "అవును డాడీ! ఈ ఫోటోలో ఉన్నది బాబాయే! సందేహం లేదు. ఇంటి కెప్పుడొస్తాడో" అంటూ పెల్లుబికిన ఆనందంతో రెండుచేతులతోనూ తండ్రిని చుట్టి వేసింది.

"దొంగతనం చేసి ఇంట్లోనుంచి పారిపోయిన తుంటరికుర్రాడు అంత గొప్పవాడవుతాడంటే, నాకు నమ్మకం కలగటం లేదు. తండ్రీ కూతుళ్ళు మరీ అంత తన్మయత్వం పడకండి?" అన్నది కాంతమ్మ విసురుగా.


"శకునపక్షిలా పలక్క, అలా నోరు మూసుకు కూర్చో. నీ నమ్మకాలూ, అపనమ్మకాలతో నన్ను వేధించకు. నీకు తోచిందేతప్ప, ఇతర్లు చెప్పింది ఏనాడూ నమ్మావు, కాబట్టి!" అన్నాడు కృష్ణారావు కోపంగా.

ఈ మాటలతో కాంతమ్మ ముఖం కందగడ్డలా చేసుకుని, "కూరాకులో పురుగులా నన్ను దులిపెయ్యకండి. కాస్త లోకం తెలిసినవాళ్ళెవరికైనా, దొంగతనం చేసి దేశాలు పట్టిపోయిన కుర్రాదేమవుతాడో వూహించటం కష్టం కాదు. చంద్రం ఎప్పుడో ఆకలిదప్పులకు అలమటించి పోయివుంటాడు. అలాకాక, బతికివుంటే, ఏ జేబులు కొట్టే వృత్తిలోనో ప్రవేశించి సగం కాలాన్ని జైళ్ళల్లో గడుపుతూండి వుంటాడు," అన్నది.

కృష్ణారావు భార్య మాట పూర్తిచేసే లోపలే రౌద్రమూర్తి అయిపోయి, చేయి పైకెత్తి ఆమెకేసి ఒక అడుగు వేశాడు. కాంతమ్మ భయపడిపోయి, చల్లగా అక్కణ్ణుంచి వెళ్ళిపోయింది.

కృష్ణారావు కోపాన్ని అణచుకునే ప్రయత్నంలో కళ్ళల్లో నీళ్ళు తిరిగినై. అతడు సోఫాలో ఉస్సురంటూ కూలబడి, రజనిని దగ్గిరకు తీసుకుంటూ, "మీ అమ్మ వుండుండి అనవసరంగా నాకు కోపం తెప్పిస్తుంది సరే, అది మామూలుగా యీ కొంపలో జరుగుతున్నదే అనుకో. నువ్వెందుకు ముఖం అలా పెట్టుకున్నావ్? ఏం భయం లేదు. బాబాయి ఎక్కడున్నా వెతికి తీసుకు వస్తాను. వాడికి నువ్వంటే ఎంత ప్రేమ! ఎప్పుడూ భుజాన వేసుకుని తిప్పుతూ, ఆడిస్తూండేవాడు," అన్నాడు.

రజని పసిహృదయానికి బాబాయిని చూడాలన్న కోర్కె కలచివేసింది. ఆపన్నేండేళ్ళపిల్లా, తండ్రి ఒడిలోంచి లేచి, హాలులో వున్న నిలువెత్తు వేంకటేశ్వరుడి పటం దగ్గిరకు వెళ్ళి, చేతులు జోడించి, "వేంకటరమణా! మా బాబాయి యివ్వాళే యింటికొచ్చేట్టు చెయ్యి. యిలా చెయ్యమని నిన్ను చాలాసార్లు అడిగాను. ఈ సారికైనా తప్పక చేస్తావా?" అంటూ నమస్కరించింది. కృష్ణారావుకూడా అప్రయత్నంగా కూతురుతోపాటు, లేచి నిలబడి, ఆ పటానికి తల వంచి నమస్కరించాడు. —సశేషం.



"నీవు అతనికి ఎదురుతిరిగి కొట్టిన దువలన. నీ శిక్ష ఒకమాసం పెంచి సాపెట్టారు. అదే నాబోటివాడితో అయితే, సంవత్సరము పెరిగి వుండును"

"అలాగా! సంతోష బాబయ్యా. ఈసారి సంవత్సరం పెరిగేందుకు ప్రయత్నిస్తాను!"



"అవును నిన్ననే తీసికెళ్ళాను. ముందు ఈ విషయం చెప్పు పెన్సిల్ చెక్కుతుందా ఇది?"

నన్నెచోడుని కావ్యంలో ప్రజాజీవనం

డాక్టర్ ఎం. కులశేఖరరావు

సాహిత్యానికి, సామాజిక జీవితానికి సర్వ కాలాల్లోను సన్నిహిత సంబంధం ఉన్నది. కావ్యరచన చేసే కవికూడ, సమాజంలో ఒకడుగా ఉండడంచేత, తన నిత్య జీవితంలో అతడు కన్నవీ, విన్నవీ, అతని కావ్యంలో చోటు చేసికొంటవి. కవి, దీనిని ప్రయత్నపూర్వకంగా చేయవచ్చును, లేదా యాదృచ్ఛికంగా జరుగవచ్చును. మొత్తం మీద సాహిత్యంపై సమాజానికి గల ప్రభావం బలీయమైన దనడంలో సందేహం లేదు. అందుచేతనే కాబోలు సాహిత్యం సమాజానికి ప్రతిబింబం అని విజ్ఞులు భావిస్తారు.

ఆంధ్ర సాహిత్యంలో ఈ నాటివలె ప్రాచీనకాలంలో, సమకాలీన వస్తువును గ్రహించి కావ్యం వ్రాయడం సంప్రదాయంగా ఉండేదికాదు, మన ప్రాచీనకవులందరి దృష్టి సంస్కృతంలో ఉన్న పురాణాలపైకే ఉండేది. వాటినే మార్పు చేర్పులతోను, ఒక్కొక్కసారి యధామూలకంగాను తెలుగు భాషలో వ్రాసేవారు. ఇట్టి రచనావిధానంలో ఆ నాటి సాంఘిక ప్రజాజీవితాలు కావ్యాల్లో చేరడానికి వీలులే దనిపిస్తుంది. కాని నిశితంగా వీటిని పరిశీలిస్తే వీటిలోకూడ సమకాలీన జీవితం ప్రతిబింబించిన మాట సుస్పష్టంగా కనిపిస్తుంది. కవి, పరిసరాల ప్రభావానికి లోనుకాకుండా ఉండడం అసాధ్యం కావడమే దీనికి కారణం. నన్నయగారి భారతంలో గోదావరినది, తత్పరిసరక్షేత్రాలు వర్ణితం కావడం, తిక్కన కావ్యంలో ఆంధ్రుల యుద్ధవిద్య విపులీకరించబడడం వంటి విశేషాలను ఈ సందర్భంలో ఉదాహరణలుగా గ్రహించవచ్చును.

ఆంధ్ర భాషలో కుమారసంభవం అనే కావ్యం వ్రాసిన నన్నెచోడుడు ప్రబంధ కర్తలలో ప్రథముడుగా భావించబడుతున్నాడు. ఈతడు వ్రాసిన ఈ గ్రంథం శైవమత పారమ్యానికి, వర్ణనాస్వత శైలికీ ప్రాధాన్యం వహించినప్పటికీ, ఇతని కాలంలోని ప్రజాజీవనానికి సంబంధించిన అనేక విశేషాలు ఈ కావ్యంలో కనిపిస్తున్నవి. ఇతడు స్వయంగా మహారాజే అయినప్పటికీ, సామాన్యులైన సామాజికుల జీవితాన్నికూడ చక్కగా పరిశీలించినవాడు అనడానికి ఈ కావ్యంలో అనేక ఆధారా లున్నవి. క్రమంగా వాటి నుల్లేఖిస్తాను.

దాక్షాయణి వరప్రసాదంవలన, హిమవంతునికి, మేనకకు, గౌరి కుమార్తెగా అవతరించింది. కుమార్తెలు లేనిలోటు తీరిన జననీజనకుల సంతోషానికి మేరలేదు. ఉమ వారి ఆదరంతో పెరుగుతున్నది. ఆ బాలికకు తల్లిదండ్రులు విద్యాభ్యాసం చేయించినారు. అట్టి సమయంలో గిరిసుత విద్యారంభంలోనే సుస్వర మొదవగ 'ఓం నమశ్శివాయ' అని పలికినదట. తెలుగు అక్షరాలు ప్రారంభిస్తున్న విద్యార్థులు నాటికి, నేటికి పలికే మాట యిదే. తెలుగువారి యీ అక్షరాభ్యాస సంప్రదాయాన్ని నన్నెచోడకవి పార్వతీదేవికి సైతం ఆరోపించి ఆనాటి ప్రజాజీవనాన్ని ప్రతిబింబింప చేసినాడు.

పార్వతీదేవి ఆటలాడే సమయంలో అనేకమంది బాలికలామెతో చేరుదురట. వారందరుకలిసి ఆటలాడుదురు. అవి యిట్లుండునని కవి వర్ణించినాడు.

తరుణులు చిల్కబొమ్మలును
దంతపుబొమ్మలు మేలిగాజు బ
న్నరులును, మ్రావిచొప్పికలు
నల్లడ నోలిని పేర్చి లీల జో
కుర బొమ్మరిండ్లఁ జేయనగు
గూళ్లను వందుచు బొమ్మపెండ్లి మా
సరముగజేసి యాడుదురు........

చిలుక బొమ్మలు. దంతపు బొమ్మలు, గాజుతో చేసిన వస్తువులు బాలికల ఆటలలో ప్రముఖపాత్రనే వహించునుకదా! ఇక బొమ్మరిండ్లు కట్టుట, బొమ్మ పెండ్లిండ్లు చేయుట బాలికలకు నిత్యవినోదాన్ని కలిగించే ఆటలు. పార్వతి ఎంతటి రాజకుమారియైనా, ప్రజాజీవనానికి సంబంధించిన ఈ వినోదాలను అధిగమించలేకపోయిం దనే చెప్పాలి. దీనివలన కవికి ఈ విశేషాలమీద ఉండే ఆసక్తి వ్యక్తమవుతున్నది.

వివాహంకాని కన్యలు వివిధ విద్యలను అభ్యసిస్తారు. వారు నేర్చుకోవలసిన విద్యలను ప్రత్యేకంగా నన్నెచోడుడు పేర్కొని ఉన్నాడు. 'నాట్యవిషయములు, గీత భేదములు, చిత్రవిద్య, కుసుమబంధములు' ఇవన్నియు కన్యలు నేర్వవలయునట. ఇది నాటి సంప్రదాయము. ఈ సంప్రదాయాన్ని అనుసరించే కథానాయికయైన పార్వతి వీని నభ్యసించిందని కవి వ్రాసినాడు.

భారతీయులకు అందును తెలుగువారికి తాంబూలమన్న ఆదరాభిమానాలధికము. ఆంధ్రులు తాంబూలాన్ని సర్వ శుభావసరములందును ఉపయోగిస్తారు. వివాహాది శుభకార్యాలు తాంబూలంలేనిది జరుగవుకదా! ఇట్టి ప్రజాదరాన్ని పొందిన తాంబూలాన్ని నన్నెచోడకవి తన కావ్యంలో సముచిత స్థానంలోనే ప్రవేశపెట్టినాడు. తారకాసురుడు చేసే దౌష్ట్యాన్ని భంగం చేయాలంటే శివ

పార్వతులకు కలుగబోయే కుమారుడే సాధనమని నిశ్చయమయింది. దేవేంద్రుడు మదనుణ్ని పిలిపించి, నిర్ణయాన్ని విశద పరచి శివపార్వతులకు ప్రేమానురాగాలు కలిగించి, వారిని దాంపత్య జీవితంలో ప్రవేశపెట్టమని ప్రార్థించినాడు. ఇది విన్న మన్మథునికి చాల సంతోషం కలిగింది. "శూలి సేకొన్న తపమెల్ల నాలి సేసి — యతని దేహంబునందు సామాలిఁ జేసి — కామ కింకరుజేసి నాకడిమి నెరప — గంటి. నీ ప్రస్తవము దీర్పగంటి..." అని దర్పాలు పలికి "నాకుందగిన నెలసనంబుగంటి, దీని కింతకుమైకొంటి, తాంబూలంబు దయసేయ" మని కాముడు ఇంద్రుని కోరినాడు. రాజులు వీరులైన యోధులను రణరంగానికి పంపుతూ, ఉన్నతాధికారంలో నియోగించే సమయంలో చేసే తాంబూలదాన సంప్రదాయమే యిచట చేరింది. దీనివలన నాటి వీరులకు రాజుచేసే తాంబూల సత్కారము తేటపడింది.

తెలుగుదేశవాసులకు పూవులంటే చాల ప్రీతి. ప్రజలు పుష్పాలను ఎంతగా అభిమానించినారో, కవులుకూడ వాటి నంతగా ఆదరించినారు. ఏదో సందర్భాన్ని పురస్కరించుకొని కవులు పూవులను తమ వాక్యాల్లో వర్ణిస్తూనే ఉంటారు. నన్నెచోడుడు వర్ణించిన పూవులు — అకాల వసంతంలో పుష్పించినవి — చూస్తే తెలుగు వారికి ప్రియమైనవే జ్ఞాపకం వస్తవి. ఈ పద్యం పరిశీలించదగి ఉన్నది.

"పొన్నలు పూచెఁ బొన్న లొగిఁ
బూవక ముందఱఁ బూచె గోగులా
పొన్నలుఁ గొండగోగులును
బూవకముందఱఁ బూచె బూరువుల్
పొన్నలుఁ గొండగోగులును
బూరువులు న్నొగి పూవకుండగా
మున్న వనంబునం గలయ
మోదుగులొప్పఁ గబూచెనామనిన్."

శివుడు తపస్సు చేసుకొంటూ ఉన్న హిమవత్పర్వత ప్రాంతంలో వసంత ఋతువులో పూచిన పూవులను గురించి చెప్పే పద్యమిది. ఇందు వర్ణితమైన పొన్న పూవులు, కొండ గోగులు, బూరుగు పుష్పాలు, మోదుగు పూవులు తెలుగు ప్రజలకు, అందును జానపదులకు నిత్యోపయోగాలు. ఈ పూవు లన్నీ హిమవంతంలో పుష్పిస్తాయో లేదో కాని, తెలుగు దేశంలోని అన్ని ప్రాంతాల్లో వెదక కుండా కనిపిస్తవి. కవి తెలుగుదేశవాసుడు కాబట్టి, అవి హిమవంతందాకా వెళ్ళినా, మనం ఆశ్చర్యపడ నక్కరలేదు.

మన దేశంలో పూర్వకాలంనుంచీ ఆటవిక జాతులవారు నివసిస్తూనే ఉన్నారు. వీరు సామాన్యంగా జనపదాలవైపు రాక అడవుల్లోనే నివసించడంచేత వీరిని చూచి నప్పుడు నాగరికులకు సంభ్రమాశ్చర్యాలు కలుగుతూనే ఉంటవి. తపశ్చర్యకు పూనుకొన్న పార్వతి వనంలో ప్రవేశించే సమయంలో ఎఱుకులు అనే ఆటవికులు ఆమెకు కన్పించినారట. వారి నిట్లు వర్ణించినాడు కవి.

పరిచుమ్మఁదలలును, బఱుడులు దబ్బర
మిడిసిన గ్రుడ్డులు, బడకి చెవులు,
గందుబండ్లు, బఱికిగడ్డంబులును, నఱ
పొలాదులవంటి రూపులును, గుఱుచ
కోజేతులు, నిఱికిగోళ్లను నొక్కు బ్ర
క్కలు, బొక్కిరొమ్ములు, కఱకుద్రొండి
కడుపులు, మువిరి మ్రోకాళులు పొరలెత్తి
నెఱసిన యడుగులు, గుఱువుగట్టి
పరళులెత్తియున్న పరుసంపు టొడళును
నడవిలోన గలయ మొదురేగి
గదరు వలచు కంపు, కాళిమచ్ఛాయయు
గలుగు నెఱుకు మునిడి గనిరి సతులు.

ఈ స్వరూప స్వభావాలు కలిగిన ఆటవిక జాతివారు తెలుగుదేశంలోని వనసీమల్లో నివసించేవారే. కవి వారిని చూచియున్నాడు కాబట్టి వీరే హిమవత్పర్వత ప్రాంతంలోను ప్రవేశించినారు. వారి స్త్రీలనుకూడ కవి ఎంత చక్కగా వర్ణించాడో చూడండి.

"హరినీలమణులకు నాయువు వచ్చెనాఁ
గమనీయమగు తనుకాంతు లెసగ
మెఱుగుదీగలు గండుమీలపై వెలసెనా,
దృగ్భాసురద్యుతుల్ దేజరిల్లఁ
జమరీసుకేశపాశములఁ దుమ్మెదపిండు
దగిలెనాఁ గుటిల కుంతలము లమర
కాంచనకుంభముల్ కరిగుంభకర్కశ
మెనసెనాఁ బాలిండ్లు నొనరితనర.
పాపవశమున శాపంబుపడి విహీన
జనులసంగతి కర్హమై పొనరగన్న
యమర సతులలో దర్శనీయాంగలైన
యెఱుకులేమలగాంచె శైలేంద్రతనయ."

ఇందు అలంకారాలు చోటుచేసుకొన్నా, ఎఱుకులేమల సౌందర్యాన్ని కవి సహజంగానే వర్ణించినాడని చెప్పాలి.

ఈనాడు మనకు ప్రత్యక్షంగా తెలియక పోయినా, ఆనాటి ప్రజాజీవనంలో మునులకూ, మున్యాశ్రమాలకూ చాల ప్రాధాన్యం ఉండేది. రాజులు, ప్రజలు ఈ ఆశ్రమాలను గౌరవంతో పోషించడం కూడ కలదు. కవులుకూడ తమ కావ్యాల్లో మున్యాశ్రమాల ప్రసంశలేనిదే పరిపూర్ణంగా భావించేవారుకారు. నన్నెచోడకవి సందర్భాన్ని కల్పించుకొని వర్ణించిన తపోవనాలు, అందలివ్యక్తులు నాటి ప్రజాజీవనానికి ప్రతిబింబాలుగా ఉన్నవి. తపస్సు చేసికొనడానికి వెళుతున్న పార్వతికి కనిపించిన మునికన్యలు పార్వతికేకాదు మనకుకూడ విభ్రమాన్ని కలిగిస్తారు.

"అనులేపనములు మండనములు లేకయు
భాసురాంగము లింతదేసి యగునే?
లలితాంబరములు మేఖలలు లేకయు హారి
జఘనంబు లింత మాసరము లగునె
వరహారములు బత్రవల్లికల్ లేకయు
వలిసన్ను గవలింత చెలువ మగునె
భ్రూలతానటనంబు పొలపంబులేకయు
విచలేక్షణములింత రుచిర మగునె
కమ్మనూనియ మెఱుగెక్క గలయదువ్వి
కురులు దీర్పకయును కచభరము లింత
పొలుచునే యని చూచె నా భూసురాధి
రాజకన్యలఁ బర్వతరాజకన్య"

ఈ ఆశ్రమాల్లోనే నివసించే "నిష్ఠాపరులు ఉరువేదానుష్ఠాన సమాచరులు, మనో

హతులు, మహా శ్రేష్ఠాత్మకులు, అమలులు, పరమేష్ఠిసములు, సర్వసత్త్వ మిత్రులు పాత్రులు" అయిన మునులు, ఋషులు కూడ నాటి సాంఘికజీవితానికి ముఖ్యాంగముగానే భాసిస్తారు. ఇటువంటి ప్రాధాన్యం ఉన్నవారు కాబట్టే నన్నెచోడకవి వీరికికూడ తన కావ్యంలో స్థానం కల్పించిఉన్నాడు.

కుమార సంభవంలో ముఖ్యఘట్టమైన గౌరీమహేశ్వరుల వివాహవర్ణనము చూస్తే ఆనాటికీ ఈనాటికీ మనదేశంలోని వివాహాల్లో మార్పులేదనిపిస్తుంది. మొదట హిమవంతుడు తనమందిరాన్ని అలంకరించినాడట. ఆ అలంకారాల్లో రంగవల్లులు, అరటి స్తంభములు, పచ్చని పందిళ్ళు, తోరణాలు, కంబములకు దివ్యాంబరాలు, పూర్ణకుంభములు, ఉన్నవి. ఇక వధువును అలంకరించిన పద్ధతి — మేన చందనమ లదుట, పూవులు కొప్పులో తురుముట, అంజనము కన్నుగవ నమర్చుట, బంగారు సరిగంచుల వస్త్రములు కట్టుట, నాటికీ నేటికీ మనం అనుసరిస్తున్న ఆచారాలనే జ్ఞప్తికి తెస్తుంది. వివాహానంతరం నారదతుంబురులు గానం చేసినారు. వారి గానం "తేనియ ముసురో, అమృతపు వానయో, పుండ్రేక్షు రసము వఱ్ఱోడిన పెల్లో" అనిపించినదట. రంభచేసిన నాట్యం చూడండి :

"అలతులు నిల్పుహస్తములు
హస్తవిలాసముతో బెవంగ జూ
డ్కులు దెలి చూడ్కులందెలమి
గూడి రమింప మనంబు తమ్మనో
బలమున నుల్లసిల్ల నిజ
భావము భావవిశేనసంపదల్
వెలయ రసంబులం దభిన
యించెరసంబులు సొంగకంబుగాన్"

పాడి ఆడినది దివ్యులైనా, వాటిని విని చూచి ఆనందించినది మహేశ్వరాదులైనా. సంప్రదాయం మాత్రం ప్రజలదే అనడంలో సందేహంలేదు కదా!

ప్రజాజీవితంలో రాజనీతికి ప్రాధాన్యం ఉన్నది. యథాశక్తి ప్రజలకు కూడ రాజనీతి తెలియవలెను కదా! రాక్షస గురువైన శుక్రు డుద్దేశించిన మీరాజనీతి అన్నికాలాలకు అన్వయిస్తుంది.

"శ్రీ పానాక్ష మృగ వ్యధ
నాపహ పరదండ నిష్ఠురాలాపములన్
పాపగ సప్తవ్యసన
వ్యాపారములుడుగవలయువకు ధేశునకున్."

"చన వెఱిగి నడవవలయును
వినయోచిత వృత్తి సంధి విగ్రహ యానా
సన సంశ్రయణ ద్వైధులు
నను షాడ్గుణ్యము నిజామాత్యులతోన్."

"తన కధికుల కతిభక్తియు
మనమున నెయ్యంబు, తన సమానులకునుహీ
నునియందు కృపయు జేకొను
మనుజునకు వగయు కలదె మది పరికింపన్."

ఇట్లే సామ దాన భేద దండములను చతురోపాయములను గురించి, దేశకాల విశేషములను గురించి, శత్రువుల బలాబలాలను గురించి, ప్రస్తావించి ప్రజా జీవితంతో ఉన్నాడు. వీ టన్నిటికీ సంబంధం ఉన్నది.

నన్నెచోడుని కావ్యంలో ప్రజాజీవితాన్ని గురించి చెప్పినపుడు అతడు వర్ణించిన యుద్ధ విధానాన్ని చెప్పనిదే పరిపూర్ణంగా ఉండదు. ఆ కాలంలో దేశంలో అప్పుడప్పుడు యుద్ధాలు వస్తూనేఉండేవి. దానికి నాటి సాంఘిక వ్యవస్థయే కారణం కావచ్చును. రాజులకు, ప్రజలకు యుద్ధంతో ప్రత్యక్ష సంబంధంకూడ ఉంటుంది. నన్నెచోడుడు మహారాజా కావడంచేత, అతడు స్వయంగా యుద్ధం చేసిఉండవచ్చు. అనేక యుద్ధాలు నిర్వహించిఉండవచ్చు. అందుచేతనే అతని యుద్ధవర్ణనము చాలా సహజంగా ఉంటుందని విమర్శకులు భావిస్తారు.

దేవతలకు నాయకుడుగా కుమారస్వామి రాక్షసులపై యుద్ధానికి వెడలినప్పుడు మొదట ప్రస్థాన భేరి మ్రోగింపచేసినాడు. దానితో సైన్య మాయత్తమైనది. ఎలగోలుసైన్యము–Advance Army వంటిది – ముందు నడవగా, సైనిక సామగ్రితో అశ్వదళము అగ్రభాగంలో నడిచింది. బాకాలు, శంఖాలు మ్రోగినవి. గజదళాలు ముఖ్య సైన్యాన్ని వెంబడించినవి. రాజులవి, మంత్రులవి అంతఃపురాలు, వాటిని కాపాడడానికి తగిన సైన్యములు వెంట నడిచినవి. అంతఃపురాలు కూడ యుద్ధానికి వెళ్ళే సైన్యంతో వెళ్ళడం నాటి ప్రత్యేకతగా కనిపిస్తుంది. ఇక యుద్ధం ప్రారంభమైంది. ఇరుపక్షాల సైనికులు దుందుభులు, వీరమద్దెలలు, తప్పెటలు, కొమ్ములు, ఢక్కలు మ్రోగించినారు. మూడువైపులనుంచి సేనానులు సంరక్షిస్తూ ఉండగా సైన్యంలోని భటులు కుంతములు, ఈటెలు, ఛురియలు, బల్లెములు, కత్తులు, ధనుర్బాణములు, గదలు ధరించి శత్రువులపై విజృంభించిరి. రథగజతురగపదాతులీ యుద్ధంలో పాల్గొన్నవి. దినమంతా యుద్ధంచేసి చీకటి పడగానే యుద్ధం చాలించేవారట. రాత్రి విరామసమయంలో యుద్ధంలో గాయపడినవారికి కట్లు కట్టడం, ఉపచారాలు చేయడంవంటి పనులు జరిగేవి.

నిజం పరిశీలిస్తే దివ్యశక్తులు కలిగిన దేవతలకుగాని, మాయాజాలంలో ప్రవీణులైన రాక్షసులకుగాని సరిపోయే యుద్ధవిధానం కా దిది. వారికీ ఆయుధాలతో ప్రయోజన మేమిటి? వెలుగు చీకట్లతో పనేమిటి? ఇవి నన్నెచోడుని నాడు మనుష్యులు చేసే యుద్ధాలే. కవికి వాటి పరిజ్ఞానం ఉండడంచేత తన కావ్యంలో చేర్చి ఉన్నాడు.

ఇటువంటివే ప్రజా జీవనానికి సంబంధించిన అనేక విషయాలు, నన్నెచోడుని కుమార సంభవంలో కనిపిస్తవి. ★

సీరియల్ నవల

6

జరిగిన కథ

డాక్టరు కనకంగారికి ప్రతినెలా పాతిక – ముప్ఫయి రూపాయిల ఆదాయానికి కారణమైన దీర్ఘరోగులు యిద్దరువున్నారు. అదే సంపాదన ఆయనది. అంతకన్నా ఎక్కువ ఆశించడు. ఆశించినా జనం అటువైపు తొంగిచూడనన్నా చూడరు. బలవంతంగా రోగులమీద సాహిత్యాన్ని రుద్దడానికి అయన చేసే ప్రయత్నం ఆయనమీదే బెడిసికొడుతుందేమో! చివరకు మందుతో రోగిహ్రై, ఆయన స్వభావానికి లోబడిపోయిన వ్యక్తి ఒకతను దొరికాడు. డాక్టరుగారి కోరికవల్ల అద్దెదారుడుగా ప్రవేశించాడు. ఆ యింటివాళ్ళమ్మాయి నర్సా అభిమానపు చూపులకు చిక్కాడు. డాక్టరుగారి అభిప్రాయం ప్రకారమే ఇంటివారికి, నగలన్నా ఇతర ఏ అలంకరణ సామగ్రిఅన్నా నచ్చదు. కాని ఒక పెళ్ళి సందర్భంలో డాక్టరుగారి తండ్రి తన మనవరాలికి పెట్టిన నగలను సైతం డాక్టరుగారు వెనుకకు పంపిస్తాడు. అవి తెచ్చిన విద్యార్థిని ఆయన అభిమానంతో తన ఇంటికి రమ్మంటాడు. ఇతని పెళ్ళి ప్రస్తావనకూడా వచ్చిన సందర్భంగా అతడు విడిదిలో కాలము గడుపుతాడు. డిసెంబరులో పిక్నిక్ అప్పుడు అతనికి చాల గొప్ప అనుభవం కలిగింది. డాక్టరుగారి అమ్మాయి స్నానం చేస్తున్నప్పుడు చెరువులోపడిపోగా ఆవిద్యార్థి రక్షిస్తాడు. అతడు డాక్టరుగారి తండ్రి ఆ ఊరు వచ్చినప్పుడు కలుసుకొని నర్సాకు తాతగారి అభిప్రాయం తెలియజేస్తాడు.

డాక్టరుగారికి ప్రాక్టీసు బాగాతగ్గిపోయింది.

"ఏ ప్రాక్టీసున్న డాక్టరైనా అసిస్టెంటుగా పెట్టుకుంటే సంతోషంగా ఉంటాను. నెలకో వంద ఇచ్చినా చాలు. నెలకు పది, పదిహేను వందలు సంపాదించే డాక్టర్లున్నా రీ వూళ్ళో," అన్నా డాయన.

"ఆ మాట తెలియాలిసినవాళ్ళ కెట్లా తెలియాలి?" అన్నాను.

"నేను కొందరితో మాటవరసగా చెప్పి ఉంచాను. రూరల్ డిస్పెన్సరీ ఏదన్నా టేకప్ చెయ్యటానికి కూడా సిద్ధంగా నే ఉన్నాను. చూస్తాం. అంత గండగత్త రేమీ లేదు."

డాక్టరుగారొకప్పుడు మనిషిలోఉండే స్పిరిట్ గురించి చెప్పాడు. నాలోకూడా ఇప్పుడొక స్పిరిట్ బయలుదేరింది. ఊళ్లో బాగా డబ్బున్న రోగులదగ్గిరికి వెళ్ళి, "మా డాక్టరుగారిచేత వైద్యం చేయించుకోండి. అంతకన్న మంచిడాక్టరు జిల్లాలో లేడు." అని కాన్వాస్ చేద్దామనిపించింది. లేకపోతే ఒక ప్రైవేటు ఆస్పత్రి కట్టించి దాన్ని డాక్టరుగారి కిచ్చేద్దా మనిపించింది. కనీసం ప్రాక్టీసున్న డాక్టర్లదగ్గిరికి వెళ్ళి; డాక్టరుగారితో జాయింటు ప్రాక్టీసు పెట్టుకోమని హెచ్చరిద్దా మనిపించింది. ఏమైనా నా స్పిరిట్ అంతా కలిసి డాక్టరు కొక చిన్న గజ్జిచిడుము కేసుకూడా ఇప్పించలేదన్నది స్పష్టమయింది. సృష్టిలో బోలెడన్ని రోగాలున్నాయి – క్షయా, రాచపుండూ, గుండె జబ్బూ, పక్షవాతమూ, ధనుర్వాతమూ, గుర్రపువాతమూ, కడుపులో పుళ్ళూ, గర్భకోశంలో పుళ్ళూ, సిఫిలిసూ, గనోరియా, ఉబ్బసమూ, ఇంకేమేమిటో ఉన్నాయి. వందలాది మనుషులకు ఈ రోగాలు వచ్చేసి అందులో కనీసం కొందరైనా డాక్టరుగారి దగ్గిరికి రాకూడదూ?

నా స్పిరిట్ అట్లా ఆలోచించింది.

ఎటుచూసినా నిరాశే కనిపిస్తున్నది. "నే నీ ఫిప్తుఫారం తప్పకుండా తప్పుతాను," అని చెప్పేసింది నర్సు ఆఖరుపరీక్షరాసొచ్చి.

"నాకు ఫస్ట్‌క్లాసు మార్కు లొచ్చే సూచనలేవీ లేవు ... ఈసారి సెలవుల్లో మావాళ్లు నన్ను పెళ్ళి చేసుకోమని థర్డ్ డిగ్రీ పెడతారు. నే నందరికీ విరోధి నవుతాను ... వచ్చే జులైలోనో ఆగస్టులోనో గుంటూర్లో కలరా పగలేస్తుంది – ఇట్ విల్ బ్రేకౌట్!... ప్రపంచయుద్ధం కూడా రావచ్చు." అన్నాను వీపింగ్ ఫిలాసఫర్ ధోరణిలో.

శలవు లిచ్చెయ్యగానే రమ్మనీ, బోలెడన్ని వ్యవహారాలు మాట్లాడా లనీ మా బావ రాశాడు. ఆ ఉత్తరాన్ని బుట్టదాఖలా చేసిఉందును. కాని నేను డాక్టరుగారింటి

కొడవటిగంటి కుటుంబరావు

నుంచి మకాం ఎత్తెయ్యవలసిన పరిస్థితి వచ్చింది — ఆయన కోరుకున్న రూరల్ డిస్పెన్సరీ పని లభ్యమయింది; ఆయనే గుంటూరునుంచి మకాం ఎత్తేసి వెళ్ళి పోతున్నాడు.

"శలవులంతా మీ బంధువులతోనే గడి పెయ్యకు. మే ముందేచోటుకూడా కొన్నా ళ్ళుండొచ్చు. వేసవిలో ఒక్కోఏడు మంచి నీళ్ళు దొరకవుటగాని మంచి పల్లెటూరేనని విన్నాను," అన్నాడు డాక్టరుగారు నాతో.

పార్టింగ్ గిఫ్ట్ కింద నర్సు నాకు హాండ్ షే కిచ్చింది. రహస్యంగా కాదు, బహిరంగం గానే.

పెట్టే బేడా తీసుకుని బస్సెక్కి గుంటూరు దాటగానే, సినిమా చూసి బయటికి వచ్చి నట్టుగా నా మనస్సు మరొక వాతావరణంలో పడింది. అందులో ఆశ్చర్యమేమీ లేదు. డాక్టరుగారింటి వాతావరణం విలక్షణమైనదే. మనం జీవితంలో ఒక విధమైన అష్టావ ధానం — మళ్ళా మాట్లాడితే సహస్రావ ధానం — చేస్తాం. కొత్తచోటికి వెళ్ళినప్పు డల్లా ఒకకొత్త చిత్తవృత్తి మనలో మొల కెత్తుతుంది. పాతచోటు వదిలేసి కొంత కాలం ఎటో వెళ్ళి తిరిగివస్తే, ఆ చోటుకు సంబంధించిన భావాలు ఎక్కడ వదిలే శామో అక్కడినుంచి మళ్ళీ ప్రారంభ మవుతాయి. కాలేజిలాటిదికూడా శుక్రవారం ఎక్కడ వదిలామో సోమవారం అక్కడే అందుకుంటాం. మధ్య శని ఆదివారాలు మరొక కథ, మరొకగ్రంధం.

మా బావ చాలా పెద్ద జిడ్డు పట్టించాడు.

"ఒరే, మనం రెండేళ్ళక్రితం దొర పోగాకు వేశాం చూడూ, అందులో ఈయేడు మళ్ళా చెరకు వేయించా. చెరుకెందుకు గిట్టదో. దాని అంతు తేల్చా లనిపించింది. ఈసారి ఫరవాలా. పసుపుకూడా బాగానే అయింది. దుగ్గిరాలవాళ్ళే కొన్నారు. జనుమే అంతబాగా కాలా. విత్తనం మంచిది దొరకలా..."

ఆది అసలు జిడ్డుకాదు. అసలుజిడ్డు నా పెళ్ళి కోసం బావ తహతహలాడి పోతు న్నాడు. వాళ్ళవాళ్ళలో ఎవరో ఇద్దరాడ పిల్లలు పెళ్ళి కున్నారుట. ఇద్దరినీ చూసి వాళ్ళలో ఎవరు నచ్చితే వాళ్ళను చేసుకో మన్నాడు.

"బావా, నీ కేమన్నా వెర్రా? బ్రహ్మ దేవుడు వెయ్యందీ ముడి పడదు. మన ప్రయత్నా లన్నీ వృధా. కల్యాణంఘడియ దానంతట అదే తోసుకొస్తుంది. కల్యాణం వచ్చినా, కక్కొచ్చినా ఆగదుట."

"ఈ పోసుకోలుకబుర్లు నాకూ తెలుసు లేరా! తాతకు దగ్గులు నేర్పుతావేం?" అన్నాడు బావ.

ఆయన పోరు పడలేక, "చూతాంలే," అన్నాను.

"అయితే బయల్దేరు. ఒకపిల్ల దగ్గర్లోనే ఉంది." అంటూ బావ పైపంచ దులిపి మీద వేసుకున్నాడు.

బయలుదేరాను చచ్చినట్టు. తాటాకుల దడిఉన్న ఒక ఇంటికి తీసుకుపోయాడు. పెంకు టిల్లు. అదేదో అవిభక్త కుటుంబంలాగుంది. ఇంటినిండా జనం. కనీసం నాలుగు తరాల వాళ్ళు కనిపించారు — రకానికి ఇద్దరు మొదలుకుని పదెనిమిదిమందిదాకా.

"పైకి కనిపించరుగాని, పెద్ద ఆస్తి పరులు. నూరెకరాల పైబడ్డఆస్తి. అయిదా రేళ్ళక్రితం డబ్బుకాటకం వచ్చింది, చూడూ, అప్పుడు బాకీదార్లకింద వొడుచుకున్న ముద నష్టమే ముప్పై ఎకరాలదాకా ఉంది." అన్నాడు బావ రహస్యంగా,

"పంచుకుంటే తలా రెండెకరాలూరాదు," అన్నాను.

బావ గట్టిగా, "ఆఁ! ఏం, రావయ మావా? వీడే మా బావమరిది." అని ఎవరితోనో అన్నాడు.

'రావయమావ' మమ్మల్ని ఆహ్వానించి లోపలికి తీసుకుపోయాడు. పిల్లది వచ్చి పాఠంరాని విద్యార్థిలాగా తల వంచుకుని మాముందు నిలబడింది. తల వంచుకోవ టంలో 'సిగ్గు' ఉండనవసరంలేదని తెలుసు కున్నాను. ఆపిల్లకు ఏపన్నెండేళ్ళో ఉండొచ్చు.

"వీణ్ణి పెళ్ళి చేసుకుంటావుటే?" అని బావ ఆపిల్ల నడిగాడు.

"ఛే!" అంటూ ఆ అమ్మాయి తల ఎత్తకుండానే నవ్వింది. బుగ్గలు సొట్టలు పడ్డాయిగాని, చూడటానికా సొట్టలేమీ సొంపుగాలేవు.

"ఏంరా? చూశావుగా? అదీ ఉన్నసరుకు. ఇక నువు పోయి నీపని చూసుకోవే."

తిరిగివచ్చేటప్పుడు బావ, "పిల్ల బాగానే ఉందికదూ?" అన్నాడు

"ఎవరికో నిక్షేపమంటి ఇల్లాలవుతుంది," అన్నాను.

"ఏవిటీ?" అన్నాడు బావ, నా మాట అర్థంకాక.

"నాకింకా పెద్దపిల్ల కావాలి. బాగా ఏపైన పిల్ల! నాసంగతి ఇప్పుడెట్లా ఉందో నీకు తెలీదు!" అన్నాను.

"ఓరి పిడుగా!" అన్నాడు బావ.

నాకా నందివెలుగులో ఒక్కపూట గడవటమే ఎంతో కష్టమయింది. మళ్ళా వస్తానని చెప్పి పెట్టే, బేడా తీసుకుని తెనాలి చేరుకున్నాను. అక్కడ ఎన్నాళ్ళు గడప గలనో నా కర్థంకాలేదు. ఇంత విశాల ప్రపంచంలో నా వేసవిశలవలు గడపటానికి తగిన చోటులేదు!

అయినా తెనాల్లో నాకు బాగానే గడిచింది.

వేపవి ఎక్కడైనా తీవ్రంగానే ఉంటుందిగాని, గుంటూరు బెజవాడకన్న తెనాలి చాలానయం.

మా బాబాయివాళ్ళ యింటి కెదురుగా ఒక రచయిత ఉన్నాడు అతను కథలు రాస్తూంటాడు. గుంటూరులో రాతగాళ్ళ వాతావరణం నాకంతగా కనిపించలేదుగాని తెనాల్లో బాగా కనిపించింది. పద్యాలు రాసేవాళ్ళూ. కథలు రాసేవాళ్ళూ చాలామంది ఉన్నారు. వాళ్ళలో కొందరిని చూశాను

అంతదాకా నాకు పాశ్చాత్య సాహిత్యం మీదనే మోజుండేది. వీళ్ళను చూసి నాక తెలుగు సాహిత్యం మీద కూడా ఏదో అభిమానం పుట్టుకొచ్చింది. వీళ్ళు మొపాసాలాగా, మామ్‌లాగా రాయక పోవచ్చుగాక - వాళ్ళొచ్చి తెలుగులో సాహిత్యం సృష్టిస్తారా?

వాళ్ళందరికీ చలమంటే గౌరవముంది. ఆయనా తెనాలివాడేట. ఎదురింటి శేషాచలం దగ్గిర చలంపుస్తకం ఒకటి తీసుకున్నాను చదువుదామని.

"చదవక చదవక ఆ బూతుకథలే చదువుతున్నావ్?" అన్నాడు బాబాయి.

"బూతులేని సాహిత్యం ఎక్కడుంది, బాబాయ్? నీ బీరువాలో ఆ మనుచరిత్రలూ ఏమిటి? బూతుకథలు కావూ?" అన్నాను.

"అవి అంత తేలిగ్గా అర్థమవుతాయా? వసుచరిత్రా ఆముక్తమాల్యదా తీసి చదివి అర్థంచెప్పు చూస్తాం."

"అందుకే వాటికన్న ఇది మంచిది. ఇందులో ఉండే బూతు చక్కగా అందరికి అర్థమవుతుంది."

బాబాయి కొంచెం ఆలోచించి. "బూతు ఉంటేఉంది. నీతికూడా ఉండాలిగా ఆ చలం కథల్లో నీతిలేదు," అన్నాడు.

"నీతిలేకేం, బాబాయ్? ఉంది. నువ్వొప్పుకునే నీతికాదేమో."

"ఒప్పుకోవటానికి వీల్లేని నీతిని అవినీతి అంటారు. అమాత్రం తెలీదురా?" అన్నాడు బాబాయ్.

"నిజమే బాబాయ్. కాని ఒకరి నీతి ఒకరికి అవినీతి కావచ్చు. నన్నడిగితే పురాణాలన్నీ బూతూ అవినీతినూ. కుంతి అడ్డమైనవాళ్ళకూ పిల్లల్ని కినటమూ, వ్యాసుడు వాళ్ళందరినీ పాండవు లనటమూ నాకు బాగా లేదు. వ్యాసుడు వెధవముండలకు కడుపులు చెయ్యటమూ, వాళ్ళ సంతానం దేవతాంశంతో పుట్టినవాళ్ళని చెప్పటమూ నా బుద్ధికి దారుణంగా ఉంది. ద్రౌపదికి అయిదుగురు మొగుళ్ళు! ఈ చండాలమంతా ఉంది కనక భారతం సాహిత్యం కాదని నేనంటున్నానా? చలం కథల్ని నువు కొట్టెయ్యకూడదు."

"అయితే ఈ దిక్కుమాలిన కథలను భారతంతో పోలుస్తావా?"

"ఎందుకు పోలుస్తాను? భారతంలో ఉండే మనుషులూ, వాళ్ళ బుద్ధులూ, కష్టాలూ, సుఖాలూ, ఆచారాలూ - ఏవీ నా కర్థంకావు. ఇందులో నాకు తెలిసిన మనుషులూ, జీవితమూ, బుద్ధులూ, ఆచారాలూ ఉన్నాయి. నాకిదే మంచి సాహిత్యంగా కనిపిస్తుంది."

"నీతో మాట్లాడుతూ కూర్చుంటే అయినట్టే. అవతల పేపర్లు దిద్దుకోవాలి," అంటూ బాబాయి తప్పుకున్నాడు. నాకు ప్రశాంతంగా కూర్చుని "పాపం!" చదువుకునే అవకాశం దొరికింది.

ఆ పుస్తకం పూర్తిచేశాక నాకూ కూడా కథలు రాయా లనిపించింది. నిజానికి చలం కథలు చదివి చాలామంది రచయితలై ఉండాలి. కొందరు రాసే కథలు గాలిలో కట్టిన పొగమేడల్లాగా ఉంటాయి. మరి కొందరు లోకాన్ని ఉద్ధరించటానికిగాను పనిపెట్టుకు రాస్తారు. చలం తీసుకునే కథా వస్తువులు ఉదాత్తంగా లేకపోవచ్చు. కాని



వాస్తవంగా ఉంటాయి. పాత్రలు సహజంగా ఉంటాయి. వాటిని చదివేటప్పుడు ఈ లోకాన్ని విడిచి మరో లోకంలోకి పోనవసరంలేదు. జీవితంమీది మూతలు తీసి చూపిస్తాడు చలం. కథలు రాసేవాడికి జీవితం గురించి ఒక స్పష్టమైనదృక్పథం ఉండటం రచనలకు బలమిస్తుందని చలం కథలు చదివి తెలుసుకున్నాను

అక్కడే నా దౌర్బల్యం నాకు తెలిసివచ్చింది. జీవితంగురించి నా కేదృక్పథమూ లేదు. నీటిపైన బెండులాగా జీవితంలో తేలి ఉన్నాను. నీతిగా బతికేవాళ్ళంటే నా కిష్టమే, అవినీతిగా బతికేవాళ్ళంటే నాకు కోపం లేదు. నేను ద్వేషించేదల్లా ఒకరి నొకరు హింసించుకోవటమూ, పీడించుకోవటమూ. ఒకరిసుఖాన్ని ఒకరు అపహరించటమూనూ.

"కొన్ని కొంపల్లో మొగుడు పెళ్ళాలు అస్తమానమూ కీచులాడుకుంటారు. అటువంటిచోట నేను అయిదుక్షణా లుండలేను. జీవితంలో నాకు దుర్భరంగా తోచేవి అత్తలు కోడళ్ళను కాల్చుకు తినటమూ, ఆడబిడ్డలపోరూ, పిల్లల్ని హింసించటమూ, సవతితల్లి ఈర్ష్యా - ఇటువంటివి. వాటికి ఆధునిక జీవితంలో స్థానం లేదనీ, అవి లేకుండానే మనుషులు సుఖంగా జీవించవచ్చు ననీ నా నమ్మకం. ఆస్తుల పంపకం తగాదాలూ, వ్యాజ్యాలూ, సాధింపులూ, అల్లుళ్ళ అలకలూ మొదలైనవికూడా నాకు రోతే. నాకు రోతపుట్టించేవన్నీ అవాస్తవికంగాకూడా కనిపిస్తాయి. అవన్నీ సంప్రదాయం రూపంలో మనుషులు తగిలించుకునే సంకెళ్ళు. అల్లుడైనంతమాత్రాన అలగాలని ఎవడికీ సహజంగా తట్టదు. దిక్కుమాలిన సంప్రదాయం సంకెళ్ళలాగా చుట్టుకుని, అల్లుడైనవాడిచేత అలిగింపజేస్తుంది.

నే నిటువంటి బంధాలలో చిక్కుకున్నవాణ్ణి కాను. బుద్ధెరిగినప్పటినుంచీ నా సుఖానికి అవసరమైనంత స్వేచ్ఛను నే ననుభవిస్తూనే ఉన్నాను. నాపైన నేను పెట్టుకునే నిర్బంధాలు నిర్బంధా లనిపించుకోవుగద.

ఏమైనా కథలు రాయాలని నాలో గట్టిగా నిశ్చయం ఏర్పడింది. బాబాయివాళ్ళ పెట్టెలమంచం నాకు బాగా దొరికింది. కథ రాసేవాడికి కలమూ, కాగితాలూ చివరలో కావాలిసిఉంటుంది. ఈలోపల కథావస్తువు చూసుకోవాలి, సన్నివేశాలు అమర్చుకోవాలి, ముగింపు నిర్ణయించుకోవాలి. అదేదీ లేకుండా. 40 పేజీల ఎక్సర్‌సైజు బుక్కుముందేసుకుని కథకు పేరు ఆలోచించటంతో కథారచన ప్రారంభించాను! మంచి పేరు కుదిరితే కథ దానంతట అదే వస్తుందని నా నమ్మకం!

రెండు వారాలపాటు బుర్రంతా పాడుచేసుకుని, కాగితాలు ఖరాబుచేసి, ఇక నేను కథ రాయలేనన్న నిర్ణయానికి వచ్చాక కథ దానంతట అదే తట్టింది. పగటి అనుభవాలే రాత్రిపూట మరొక విధంగా కల వచ్చినట్టుగా ఆ కథ తయారయింది. వెంటనే ఒక ఎక్సర్‌సైజు పుస్తకం కొనుక్కొచ్చి అందులో కథ రాసేశాను.

అది నర్సు కథేకాని చాలా మారిపోయింది. నర్సు శ్యామల అయింది. శ్యామల తండ్రి కాలేజీలో చదువుకుంటూ తన స్నేహితుడి చెల్లెలిని, ఒక బాలవితంతువును, రహస్యంగా ప్రేమిస్తాడు. వితంతువు గర్భవతి అవుతుంది. తప్పనిసరిగా ప్రేమికులు భార్యాభర్తలు కావలిసివస్తుంది. వారికి శ్యామల పుట్టుతుంది. శ్యామల తాతగారు ధనికుడు. వ్యాపారం చేసి లక్షలు గడిస్తాడు. (ఏ వ్యాపారం చేశాడో నేను చెప్పలేదు. ఏ వ్యాపారం లక్షలు గడించవచ్చునో నాకు స్పష్టంగా తెలీక, దాన్ని పాఠకుల ఊహకు వదిలేశాను.) కొడుకు చేసిన పనికి మండిపడి ఇంటికి రానివ్వడు. తరవాత కొంత కాలానికి శ్యామల తండ్రి చనిపోతాడు. శ్యామల తాత ఒకనాడు వచ్చి తన మనవరాలిని మాత్రం తీసుకుపోతాడు. శ్యామల తల్లి ఏడుపు మహా హృదయవిదారకంగా రాశాలెండి. ఆమెకు ప్రపంచంలో ఉన్నదే ఒక్క కూతురూ ... మాతృహృదయం ... ఒక్క కూతురూ తనకు కాకుండాపోతే ఇంకేముంది? వగైరా, వగైరా. అయిందా? శ్యామల పెరిగి పెద్దదవుతుంది.

ఇన్నేళ్ళూ ఐశ్వర్యంలో ఓలలాడుతూ తల్లిని మరిచికూడాపోయింది తాతే సమస్తమూనూ. ఈస్థితిలో శ్యామలను చూడటానికి తల్లి వస్తుంది. బిచ్చగత్తె అనుకుని కూతురు ఒక రూపాయి ఇచ్చి పొమ్మంటుంది. (అణా ఇప్పింతా మనుకున్నాను కాని హీరోయిన్ చేత తన ఓన్‌తల్లికి అణా ఇప్పించటం మరీ హీనమనిపించింది అంచేత రూపాయి చేసేశాను. కావలిస్తే నారాతప్రతి చూడండి. అణా అన్నమాట కొట్టేసి పైన రూపాయి అని రాసిఉంటుంది) ఆ తల్లి చేతుల్లో పడ్డ రూపాయికేసి చూడదు. కళ్ళనీరు కారుస్తూ కూతురికేసే చూస్తుంది. ఆ అభాగ్యురాలు కన్నీరుమూలంగా కూతురి మొహమైనా సరిగా చూడలేకపోయింది. తరవాత కొన్నాళ్ళకి ఆమె తనతల్లి అని శ్యామల తెలుసుకుంటుంది. ఆమె ఆవూళ్ళోనే ఒక పూరిగుడిసెలో ఉంటున్నది. (ఎట్లా బతుకుతున్నదీ నేను చెప్పలేదు ప్రపంచంలో బీదా బిక్కీ ఎట్లా బతుకుతున్నారో ఎవరికి తెలుసు? ఎవరు విచారిస్తున్నారు?) ముఖ్యమైనవిషయ మేమంటే, శ్యామల తాతకు తెలియకుండా తల్లి ఉండే గుడిసెకు వెళ్ళి

తల్లిని కౌగిలించుకుని "అమ్మా!" అని ఒక్క కేక పెట్టుతుంది. తాత పరవళ్ళు తొక్కుతాడు. శ్యామలకోసం వెతికిస్తాడు. పోలీసు రిపోర్టిస్తాడు. చివరకు శ్యామల ఎక్కడఉన్నదీతెలుసుకుంటాడు. స్వయంగా వెళ్ళి శ్యామలను ఇంటికి వచ్చెయ్యమంటాడు. శ్యామల తల్లిని విడిచి రానంటుంది. తాతకు డిఫీట్! తల్లికూతుళ్ళ నిద్దరినీ తీసుకుపోతాడు. అంతా సుఖంగా వుంటారు. క్లోజింగ్ డయలాగ్ ముసలాడిది:

"అమ్మా నువ్వింత యోగ్యురాలవని తెలిస్తే నా కొడుకు బతికఉండగానే మీ ఇద్దరినీ తెచ్చి ఇంట్లో ఉంచుకుందునే!"

పాత్రలకూ వాస్తవవ్యక్తులకూ పోలికలేమీ లేవని మనవిచేస్తున్నాను. శ్యామలకూ, నర్సుకూ పోలికలేదు. శ్యామల తల్లికీ సుందరమ్మగారికీ అసలు సంబంధమే లేదు. ఉండటానికి వీల్లేదు. రాసేటప్పుడు నా మనస్సులో అసలు వ్యక్తులుంటేకదా. అసలు వ్యక్తులంత తేలికగా అర్థంకారు. నర్సు ఆనాడు వాళ్ళతాతనుచూడటానికి ఎవరితోనూ చెప్పకుండా, రహస్యంగా ఎందుకు వెళ్ళిందో నాకు తెలీదు. శ్యామల, కథలో, వాళ్ళమ్మను ఎందుకు చూడబోయిందో నాకు తెలుసు. కథ చదివినవాళ్ళకూ తెలుసు. నర్సుకన్న శ్యామల మరింత ఆకర్షవంతంగా ఉండేటట్టుగా కథ రాశానంటారా? అనండి. అది వాస్తవంకూడా కావచ్చు.

ఒక్క నర్సునే కాదు, నన్నుకూడా నేను (కథకుడి రూపంలో) కాస్త మెరుగు దిద్దుకున్నాను. వాస్తవజీవితంలో నన్ను నేనే అర్థంచేసుకోలేకపోయాను. నర్సు తన తాతను కలుసుకోవటం నా కిష్టమా? కాదా? ఏమో? ఆమె తాతను చూడరాదని ఉంటే, ఆయన సర్కిలుగారింట్లో ఉన్నట్టు చెప్పకుండా ఉంటే సరిపోయేది. ఆపని చేశాను కాను. కాని నర్సు నిజంగానే వెళ్ళి ఆయనను చూసిరావటం నా కెందుకో అసంతృప్తి కలిగించింది. కథకుడుగా నాలో అటువంటి అయోమయ మేమీ లేదు. నా భావాలూ, ఆదర్శాలూ, విలువలూ విస్పష్టమైనవి... నాలో ఉన్న లోట్లు పూడ్చటానికే నేను కథకుణ్నయానేమో!

నేను కథకుణ్నయినమాట నిజమే కద! నా మొదటికథ అచ్చువేసిన పత్రిక ఆ తరవాత కొద్దిమాసాలకే ఆగిపోయింది. ఈ లోపల నేను రెండుమూడు ఇతర పత్రికలలో ప్రచురించి కాలు నిలవదొక్కుకొన్నాను.

మొత్తంమీద ఆశలవల్లో నేను డాక్టరుగారుండే గ్రామానికి వెళ్ళలేకపోయాను. గట్టిగా తలుచుకుంటే వెళ్ళిఉందును, కాని తలుచుకో బుద్ధిపుట్టలేదు. డాక్టరుగారి ప్రభావానికి దూరమైనానన్న విచారంతోబాటు ఆ ప్రభావంనుంచి బయటపడి విముక్తుణ్ణి అయినానన్న సంతోషంకూడా కొంత లేకపోలేదు. ఆయనద్వారా నాకు కొంత సంస్కారం అబ్బిందనటానికి సందేహం లేదుగాని, నా పెరుగుదల నిలిచిపోయినట్టయింది. ప్రపంచంలో అనేక రకాల ప్రభావాలుంటాయి. వాటిలో ఒక్కదానికోసం మిగతావాటిని దూరంగా ఉంచటం పెరుగుదలకు అడ్డం. నేను డాక్టరుగారింటనే ఉంటే చచ్చినా కథలు రాయాలనిపించి ఉండదు. డాక్టరుగారి జీవితంలో దుష్ప్రభావాలు లేవన్నమాటేగాని అదిచాలా పరిమితమైన జీవితం. ఆ పరిమితిలోనే ఆయనకు జీవితానందం లభించవచ్చు, కాని నాకు లభిస్తుందా?

శలవల్లో ఒకపెళ్ళికి వెళ్ళాను. ఒక తిరపతియాత్ర చేశాను. అటునుంచి చెన్నపట్నం వెళ్ళాను. కాంచనమాలను కారులో పోతుండగా చూసి గుర్తుపట్టాను. ఆంధ్రపత్రికా, ప్రజామిత్రా ఆఫీసులకు వెళ్ళాను. ప్రజామిత్ర కొక కథకూడా ఇచ్చాను. కాలేజీ తెరిచే రోజు కొకరోజు ముందుగా వచ్చి, రాధాకృష్ణమూర్తి అనే క్లాసుమేటుతో కలిసి ఒకగది తీసుకున్నాను.

ఆరోజే డాక్టరుగారికి ఉత్తరం రాశాను. శలవుల్లో వాళ్ళను చూడనేలేకపోయినందుకు క్షమాపణ చెప్పుకుంటూ. అందులోనే నర్సుకు వేరే చిన్న ఉత్తరం పెట్టాను. నర్సు ఫిప్తుఫారం తప్పలేదు, పాసయింది. మళ్ళీ ఎప్పుడు వచ్చి స్కూల్లో చేరుతుంది? అందు కేం ఏర్పాట్లు చేస్తున్నారు? ఇత్యాది విషయాలు రాసి, అడిగి, సుందరమ్మగారికి నా నమస్కారాలు చెప్పమని ఉత్తరం ముగించాను.

అయిదారు రోజులకు జవాబు వచ్చింది. పల్లెటూరి జీవితం డాక్టరుగారికి చాలా బాగున్నదిట. కపటంలేని మనుషులూ, తాజా కూరలూ, మంచిపాలూ, పెరుగూ, నెయ్యీ, మంచిగాలీ, ప్రశాంతీ, పొలాలకేసి షికార్లూ— ఇవన్నీ ఆయనకు కొత్త చైతన్యం కలిగించాయట. నర్సు తనకు చదువక్కర్లేదంటున్నదిట. డిస్పెన్సింగ్ నేర్చుకుంటున్నదిట.

నర్సుకు పుస్తకాలంటే ఎన్నడూ ఆసక్తి లేదు. చదువులోకూడా లేదన్నమాట. నర్సు విరాగి కాకపోతే జీవితం గురించి ఏవో కలలు కంటూ ఉండాలి. ఏమిటా కలలు? ఒకవేళ విరాగేనేమో! ఆ మాట అనుకుంటే నాకు నర్సును తలుచుకుని భయం వేసింది. జీవశక్తి ఎంతో తక్కువ మోతాదులో ఉంటేగాని ఆ యీడుపిల్ల విరాగిగా ఉండదు.

(సశేషం)

ఋ తు రా గ ము

— జె. బా పు రె డ్డి

వర్షఋతువు

కడలిలోని నీరు మబ్బు
కడవలతో మోసి తెచ్చి
మండిపోవు పుడమి తల్లి
గుండె సేద తీర్చినాను.
మాడిపోవు మట్టిలోన
మరకతాలు గూర్చినాను—
వర్షాసుందరి నేను
ఇల
కర్షకలోకానందము నేను
జలజల గిలగిల ఆడుచు పాడుచు
చరా చరాలకు గిలిగింతల నిడు
నవజీవన సంధాయిని నేను
భువన భవన కళ్యాణి నేను—
ఆకసమ్ములో సింగిణు లవిగో
నాకు స్వాగత పతాకలు కట్టెను.
మెరుపుకన్నియలు పులకితాంతులై
మురిపముతో హారతులను పట్టెను—
నాకను చూపులు సోకిన యెల్లెడ
నదీనదమ్ములు నాట్యము చేయును
నాపదముద్రలు తాకిన నేలలు
నవీన సస్యశ్యామల సీమలు—
మదీయ జీవన రాగములో కల
మయూరాలు నాట్యమ్ములు చేయును.
మదీయ క్రీడాజల పాతమ్ముల
మహత్వ విద్యుచ్ఛక్తులు పూయును—
నేను లేనిచో లోకమంతయును
ప్రాణములేని ఎడారి సుమా !
నేను రానిచో మానవజాతికి
నిత్య నరక యాతనలె గదా ?

శరత్తు


చాలు చాలు నీ గొప్పలు
చాలించవె వర్షర్తూ
నింగినుండి దిగివచ్చిన
నీరదాల రాణిగారు.
ఎదురెవ్వరు లేరనుకొని
ఏమేమో వాగుతావు
అంతా నేనే యంచు
ఎంతొ మిడిసిపడతావు
చీటిమాటి కలకబోయి
కాలకాలు తెస్తావు
వచ్చావో దేశమంత
వరదలు పట్టిస్తావు
గంగా గోదావరులను
పొంగజేసి పోయినపుడు
నిండుబ్రతుకు లెన్నెన్ని
నీళ్ళపాలు చేశావో
సీమ లెన్నిటనో నీవు
క్షామము రగిలించినపుడు
ఆకలి మంటల కెందరి
నాహుతి కాజేశావో
ఎప్పుడైన తలచావా ?
ఇంగితమ్ము తెలిశావా ?
గుండెలన్ని నీరు జేయు
దండి మబ్బు దండులన్ని
కంపము గల్గించెడి నీ
శంపాలత సర్పమ్ములు
పారిపోవు నవే నేను
పాదమ్మిడ జగతిలోన—

౨ అందాలకు రాణిని
అమృత కళా వాణిని
దివినుండి భువికి రాలిన
నవ శారద లక్ష్మిని
చల్లనైన వెన్నెల
చానుపు చల్లాను
తెల్లనైన జలదాల
తెరలు కట్టినాను
వింత వింత చిరుగాలుల
వీవనలను వీచినాను
లోకమెల్ల కళానంద
లోకములో తేర్చినాను—
నీటిలోని కలవలను
నింగిలోని నెలరాజును
వలపు కౌగిలింతలలో
మలచిన ప్రణాయత్మ నేను—
ఏటిగట్టు రెల్లుపూలు
ఏమెరుగని పేద గుండె
విరిసె నవే నీకనులు
తెరచినంతనే
నా రాకే లోకానికి
నవజీవన స్వర్గము
నా వెలుగే ప్రజలకు దీ
పావళి పండుగ నిజము—


హేమంతం

౧. వెన్నెల కోకలు కట్టగనే
వన్నెలాడివి కాలేదు
మబ్బుల దండలు పట్టగనే
మహియే స్వర్గము కాలేదు
గర్వపడకుమో శారదరాణి
కలదిట నిను మించిన దొరసాని
వెడలిపొమ్ము నీ అర్థములేని
వింత వింత వాదమ్ములు మాని

౨. మంచుపైట సవ
రించి ఆడు నీ
మంతిని నే. హే
మంతిని నేను—
పొలాలన్ని పం
టలు పండించిన




జూలై 27 న జూబిలీహాల్‌లో జరిగిన సాంస్కృతిక ప్రదర్శనాన్ని శ్రీమతి ఇందిరాగాంధీ తిలకిస్తున్న దృశ్యం



శ్రీమతి ఇందిరాగాంధీ, జూబిలీహాల్‌లో జరిగిన జవహర్‌లాల్ నెహ్రూ స్మారకనిధి ప్రాంతీయసంఘ సమావేశంలో ప్రసంగించారు





నెహ్రూ స్మారకనిధి సంఘసమావేశపు రెండు దృశ్యాలు




శ్రీ వి. బి. రాజు ఈ సమావేశంలో ప్రసంగిస్తున్నప్పటి దృశ్యం




శ్రీమతి ఇందిరాగాంధీ, జూలై 29 న ఆర్. వి. వి. ఆర్. ఆర్. మహిళాకళాశాల వసతిగృహానికి ప్రారంభోత్సవం చేశారు




నూతన వసతిగృహంలో జ్యోతిని వెలిగిస్తున్నప్పటిచిత్రం



వసతిగృహం ప్రారంభోత్సవం సమయంలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తున్న దృశ్యం



శ్రీమతి ఇందిరాగాంధీ ప్రసంగిస్తున్నదృశ్యం




శ్రీ జె. వి. నర్సింగరావు ప్రసంగిస్తున్న దృశ్యం




ఆర్. బి. వి. ఆర్. ఆర్. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి ఇందిర, కేంద్రసమాచార, ప్రసారశాఖలమంత్రికి స్వాగతం చెప్పుతున్నదృశ్యం




ప్రేక్షకుల దృశ్యం



జూలై 28 వ శ్రీమతి ఇందిరాగాంధీ, 'గబ్బిలం' హిందీ అనువాద గ్రంథం ప్రతిని ముఖ్యమంత్రికి సమర్పిస్తున్న దృశ్యం



ముఖ్యమంత్రికి 'గబ్బిలం' హిందీ అనువాద గ్రంథం సమర్పణ ఉత్సవంలో శ్రీ పి. వి. నరసింహారావు ప్రసంగిస్తున్న దృశ్యం



రవీంద్రభారతిలో శ్రీ వి. వి. గురుమూర్తి, శ్రీ పి. వి. నరసింహారావు, శ్రీ రామమూర్తి రేణులతో శ్రీమతి ఇందిరాగాంధీ




జూలై 29 న సరోజినీదేవి హాల్‌లో జరిగిన బాలల చలన చిత్రకేంద్రానికి ప్రారంభోత్సవం చిహ్నంగా శ్రీమతి ఇందిరా గాంధీ జ్యోతిని వెలిగిస్తున్నప్పటి చిత్రం




జూలై 29 న మహిళా నవజీవన మండలి నిర్వహించిన బాలల చలనచిత్ర కేంద్రం ప్రారంభోత్సవ సందర్భంలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తున్న దృశ్యం



జూలై 29 న మహిళా నవజీవన మండలి సభ్యులను శ్రీమతి ఇందిరాగాంధీకి పరిచయం చేస్తున్న దృశ్యం




'గబ్బిలం' రచయిత శ్రీ జాషువాను ముఖ్యమంత్రి పుష్ప మాలాలంకృతులను చేస్తున్న దృశ్యం



ఈ ఉత్సవంలో శ్రీ బి. వి. గురుమూర్తి ప్రసంగిస్తున్న దృశ్యం






'గబ్బిలం' కావ్యం అంకితం సందర్భంలో శ్రీమతి ఇందిరాగాంధీ ప్రసంగిస్తున్న దృశ్యం – "ఇటువంటి కృషి జాతీయ సమైక్యతకు దోహదం చేస్తుంది" అని అన్నారు



శ్రీ యల్. యన్. గుప్త. ఐ. ఎ. యస్. యీ ఉత్సవంలో ప్రసంగించారు




రవీంద్రభారతిలో శ్రీ జాషువా. శ్రీ వేదాంతకవి, శ్రీ రామమూర్తిరేణు. శ్రీ జాషువా 'గబ్బిలం' తెలుగులో రచించారు. శ్రీ రేణు యీ కావ్యాన్ని హిందీలోకి అనువదించారు




నవజీవన్ మండలి నిర్వాహకులతో శ్రీమతి ఇందిరాగాంధీ.



ఆర్థికమంత్రి శ్రీ ఎం. చెన్నారెడ్డి, ఆంధ్రప్రదేశ్ వాణిజ్యమండలి సభ్యులతో శ్రీమతి ఇందిరాగాంధీ



జూలై 28వ తేదీన తాను యిచ్చిన విందుకు హాజరైన ముఖ్యమంత్రి, శ్రీమతి ఇందిరాగాంధీగార్లకు శ్రీ పి. వి. రాజు స్వాగతం చెప్పుతున్న దృశ్యం




సర్వశ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్య, జె. వి. నరసింగరావు, పి. తిమ్మారెడ్డి, డా॥ ఎం. ఎస్. లక్ష్మీనరసయ్య, ఎన్. రామచంద్రారెడ్డిగార్లతో శ్రీమతి ఇందిరాగాంధీ




విందులో




జూలై 28వ తేదీ పి. వి. రాజు దంపతులతో, ముఖ్యమంత్రి దంపతులతో శ్రీమతి ఇందిరాగాంధీ




పార్లమెంటు సభ్యుడు శ్రీ హరిశ్చంద్ర హెడాగృహానికి
జూలై 29 వ తేదీన విచ్చేసిన శ్రీమతి ఇందిరాగాంధీ



శ్రీమతి హెడా, తదితరులతో



మురికివాడల నిర్మూలనా పథకం క్రింద హైదరాబాదులో ఒక
కొత్త కాలనీకి శంకుస్థాపన చేస్తున్న శ్రీమతి ఇందిరాగాంధీ



"అత్తలాది పేదప్రజానీకానికి చక్కటి గృహవసతి, ఇతర సౌక
ర్యాలను కలిగించే బాధ్యత ప్రభుత్వానిదీ, అధికార్లదీనూ"



ఆ సందర్భంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ 'ఉచిత, నిర్బంధ
విద్యా ప్రయోజనాన్ని ప్రతిఒక్కరూ పొందండి' – అన్నారు




ఖైరతాబాదులోని మురికివాడల్ని జూలై 29 వ తేదీన శ్రీమతి
ఇందిరాగాంధీ, ముఖ్యమంత్రిగారలు సందర్శించినప్పటి చిత్రం




బాలానంద సంఘ సభ్యులు శ్రీమతి ఇందిరాగాంధీకి స్వాగతం పలుకుతున్న దృశ్యం



రాజ్‌భవన్‌లో శ్రీమతి ఇందిరాగాంధీకి యిచ్చిన విందు సందర్భంలో ముఖ్యమంత్రి, గవర్నరులతో శ్రీమతి ఇందిరాగాంధీ



రేడియో బాలానంద సంఘ కార్యదర్శిని నివేదిక చదువుతున్నదృశ్యం



రాజ్‌భవన్‌లో శ్రీమతి ఇందిరాగాంధీ



బాలానంద సంఘ సభ్యులతో ముఖ్యమంత్రి




ఆంధ్రప్రదేశ్‌కు విచ్చేసిన విదేశీయ విద్యార్థులతో జూలై 29 వ తేదీన శ్రీమతి ఇందిరాగాంధీ




జూలై 29 వ తేదీన రేడియో బాలానంద సంఘం వారు శ్రీమతి ఇందిరాగాంధీకి సన్మానం చేసినసందర్భంలో ప్రసంగిస్తున్న శ్రీమతి పొన్నమ్మ థానుపిళ్ళె




శ్రీమతి ఇందిరాగాంధీకి స్వాగతం ఇస్తున్న శ్రీమతి రాఘవమ్మా బ్రహ్మానందరెడ్డి




ఆ సందర్భంలో ప్రసంగిస్తున్న శ్రీమతి ఇందిరాగాంధీ






బాలానంద సంఘం సభ్యులతో జూలై 29 వ తేదీన యువతీమందిరంలో శ్రీమతి ఇందిరాగాంధీ



శ్రీమతి ఇందిరాగాంధీ. జూలై 29 న ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరోలో స్థానిక పత్రికా సంపాదకుల నుద్దేశించి ప్రసంగించారు.




శ్రీమతి ఇందిరాగాంధీ. ఆలిండియా రేడియో సిబ్బంది సమావేశంలో ప్రసంగిస్తున్న దృశ్యం




కేంద్ర సమాచార ప్రసారశాఖ మంత్రిణి. జూలై 29 న ఆలిండియా రేడియో కేంద్రాన్ని సందర్శించారు




జూలై 29 న పి. ఐ. బి. కార్యాలయంలో 'ఆంధ్రప్రదేశ్' మాస పత్రిక ప్రధాన సంపాదకులు. శ్రీమతి ఇందిరాగాంధీకి పరిచయం చేయబడుతున్న దృశ్యం




ఢిల్లీ బయలుదేరి వెళ్ళేముందు బేగంపేట విమానాశ్రయంలో




బేగంపేట విమానాశ్రయంలో శ్రీ పి. తిమ్మారెడ్డితో శ్రీమతి ఇందిరాగాంధీ




శ్రీమతి ఇందిరాగాంధీ హైదరాబాదు సందర్శనకు చెందిన ఫోటోల అల్బమ్‌ను ముఖ్యమంత్రి ఆమెకు అందజేశారు. శ్రీ వి. బి. రాజు, సమాచారశాఖ డైరెక్టరును కూడ చిత్రంలో చూడవచ్చు






శ్రీమతి ఇందిరాగాంధీ, జూలై 29 న ఢిల్లీ వెళ్ళేముందు ముఖ్యమంత్రి, శ్రీమతి బ్రహ్మానందరెడ్డిగారలనుండి వీడ్కోలు తీసుకుంటున్న దృశ్యం


ఉత్తమ చిత్రాలకు రాష్ట్ర బహుమతులు




విమానాశ్రయంలో చలనచిత్రపరిశ్రమకు చెందిన సభ్యులు



రవీంద్రభారతిలో శ్రీమతి జానకి



'డాక్టర్ చక్రవర్తి' చిత్రప్రదర్శనకు విచ్చేసిన ప్రఖ్యాత హాస్య నటుడు రేలంగికి సమాచార పౌర సంబంధశాఖ డైరెక్టరు స్వాగతం చెప్పుతున్న దృశ్యం



శ్రీ యల్. వి. ప్రసాద్, శ్రీ జగ్గయ్య, శ్రీ పి. పుల్లయ్య శ్రీ ఎ. యల్. శ్రీనివాస్, రవీంద్రభారతికి విచ్చేసినదృశ్యం




ఫిల్మ్ తారలు జానకి, కృష్ణకుమారి 'డాక్టర్ చక్రవర్తి' చిత్రప్రదర్శనను తిలకించడానికి దీపక్ మహల్ థియేటరుకు విచ్చేసినదృశ్యం




ముఖ్యఅతిథి ఆగమన నిరీక్షణ




ముఖ్యఅతిథి ఆంధ్రప్రదేశ్ గవర్నరుకు సమాచారశాఖ డైరెక్టరు స్వాగతం పలుకుతున్న దృశ్యం



సమాచారశాఖ డైరెక్టరు శ్రీ జి. రామచంద్రరావు ఉత్సవంలో సందేశాలను చదువుతున్న దృశ్యం



ముఖ్యమంత్రి కార్యక్రమం వివరాలను తిలకిస్తున్న దృశ్యం




ఈ ఉత్సవానికి అధ్యక్షత వహించిన గవర్నరు శ్రీ పట్టం థానుపిళ్ళై ప్రసంగిస్తూ చలనచిత్ర నిర్మాతలు మంచి చిత్రాలను నిర్మించాలని ఉద్బోధించారు



ఉత్సవం సందర్భంలో వెలువరించబడిన సావనీర్‌ను సమాచారశాఖామంత్రి తిలకిస్తున్న దృశ్యం



సమాచారశాఖామంత్రి శ్రీ బి. వి. గురుమూర్తి స్వాగతోపన్యాసం యిస్తూ చలనచిత్ర పరిశ్రమను ప్రోత్సహించడానికి ప్రభుత్వం తీసుకున్న వివిధ చర్యలను వివరించారు




ఈ ఉత్సవంలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ' ఆంధ్రప్రదేశ్‌లో నిర్మింపబడే చిత్రాలకు సబ్సిడీలు యిచ్చే పథకం మరో రెండు సంవత్సరాలకు పొడిగించబడునని అన్నారు




భారతఫిల్మ్ ఫెడరేషన్ అధ్యక్షులు శ్రీ ఎ. ఎల్. శ్రీనివాసన్ ప్రసంగిస్తూ 'రొక్కం బహుమతులు, సబ్సిడీలు యిస్తున్న ప్రప్రథమ రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అయినందుకు శ్లాఘనీయ'మని అన్నారు




1964 వ సంవత్సర ఉత్తమ ప్రథమ కథాచిత్రంగా ఎన్నిక అయిన 'డాక్టర్ చక్రవర్తి నిర్మాత శ్రీ డి. మధుసూదన రావు, గవర్నరు స్వర్ణనంది విగ్రహాన్ని ముఖ్యమంత్రి నుంచి స్వీకరిస్తున్న దృశ్యం



గవర్నరు, ముఖ్యమంత్రి, ఆర్థికమంత్రి, సమాచారశాఖ మంత్రులతో 'డాక్టర్ చక్రవర్తి' బృందం



1964 వ సంవత్సర ఉత్తమ రెండవ కథాచిత్రంగా ఎన్నికైన 'కీలుబొమ్మలు' నిర్మాత శ్రీ పి. గంగాధరరావు, ముఖ్య మంత్రి రజిత నంది విగ్రహాన్ని ముఖ్యమంత్రి నుండి స్వీకరిస్తున్న దృశ్యం




'కీలుబొమ్మలు' బృందం






ఆర్థికమంత్రి డాక్టర్ యం. చెన్నారెడ్డి యీ ఉత్సవంలో ప్రసంగిస్తూ నాలుగవ ప్రణాళికా కాలంలో హైదారాబాదులో చలనచిత్ర నిర్మాణానికి సంబంధించి మరికొన్ని సౌకర్యాలు కల్పించడానికి కృషి జరుగుతుందని ప్రకటించారు

శ్రీ డి. మధుసూదనరావు ప్రసంగిస్తూ ప్రోత్సాహక పథకాలను ప్రవేశపెట్టినందుకు చలనచిత్ర పరిశ్రమ, ప్రభుత్వానికి కృతజ్ఞతలు అందజేస్తున్నదని అన్నారు






అది పెళ్ళిపెద్దు కాదు. మనోహరంగా నిర్మించబడిన వేదిక. అనేకమంది చలనచిత్ర ప్రముఖులతో గవర్నరు, ముఖ్యమంత్రులను యీ చిత్రంలో చూడవచ్చు






గవర్నరు, ముఖ్యమంత్రి, ఆర్థికమంత్రి, సమాచారశాఖ మంత్రి, రాష్ట్రీ బహుమతుల గ్రహీతలు, చలనచిత్ర సరిశ్రమ ప్రముఖులు




1984 ఉత్తమ కథా చిత్రానికిగాను తృతీయ బహుమతి పొందిన 'గుడిగంటలు' నిర్మాత శ్రీ పి. రామేశ్వరరావు ముఖ్యమంత్రివద్దనుంచి బహుమతిని అందుకుంటున్నదృశ్యం



ముఖ్యమంత్రివద్దనుంచి బహుమతి అందుకుంటున్న శ్రీ ఎ. నాగేశ్వరరావు



గుడిగంటలు బృందం



డాక్టరు చక్రవర్తి దర్శకుడు శ్రీ ఆదుర్తి సుబ్బారావు ముఖ్యమంత్రివద్దనుంచి బహుమతిని అందుకుంటున్న దృశ్యం



ముఖ్యమంత్రివద్దనుంచి బహుమతి అందుకుంటున్న రేలంగి



బహుమతి అందుకుంటున్న శ్రీమతి జానకి




కీలుబొమ్మలు దర్శకుడు శ్రీ సి. ఎస్. రావు ముఖ్యమంత్రి వద్దనుండి బహుమతిని అందుకుంటున్న దృశ్యం



ముఖ్యమంత్రివద్దనుంచి బహుమతి అందుకుంటున్న శ్రీ జగ్గయ్య




బహుమతి అందుకుంటున్న కృష్ణకుమారి




బహుమతి అందుకుంటున్న శ్రీమతి జమున



బహుమతి గ్రహీతలు



సభికులు



అక్కినేని నాగేశ్వరరావు ప్రసంగిస్తున్న దృశ్యం
'సబ్సిడీ పథకాన్ని మరో అయిదేళ్ళపాటు పొడిగించమంటున్నాను'




హాస్యనటుడు రేలంగి మాట్లాడుతున్న దృశ్యం
'హైదరాబాదులో తయారయ్యే చిత్రాలలో తక్కువ డబ్బు తీసుకుని. మరీ మాట్లాడితే ఉచితంగానే. నేను నటిస్తాను.'



దర్శకుడు శ్రీ వి. మధుసూదనరావు మాట్లాడుతున్న దృశ్యం
'బహుశా భారతదేశంలోనే తొలిసారిగా సినిమా వ్యక్తులు ప్రభుత్వాతిధులుగా పరిగణింపబడుతున్నారనవచ్చు'



ఉత్తమ చిత్రం ప్రధాననటుడు, నిర్మాత, దర్శకుడు—
శ్రీ ఎ. నాగేశ్వరరావు, శ్రీ డి. మధుసూదనరావు
శ్రీ ఆదుర్తి సుబ్బారావు






శ్రీమతి జమున ప్రసంగిస్తున్న దృశ్యం 'కార్క్- అంతర్జాతీయ చలనచిత్రోత్సవానికి ఒక తెలుగు చిత్రం పంపబడింది'



చలనచిత్ర బహుమతీ ప్రదానోత్సవంలో శ్రీమతి బ్రహ్మా నందరెడ్డితో కృష్ణకుమారి, జానకి.




గవర్నరు, శ్రీ రమణారావు, శ్రీమతి జమునారమణారావు, ముఖ్యమంత్రి, ఆర్థికమంత్రి



వేదికమీద శ్రీమతి జమునారమణారావు. ఆ వెనుక రామప్ప దేవాలయంలోని నందికి అసలు సైజు నంది నమూనా



ముఖ్యమంత్రి రజితనంది బహుమతి లభించిన 'కీలు బొమ్మలులో' ప్రధాన పాత్రధారులు శ్రీమతి జమున. శ్రీ జగ్గయ్య




షావుకారుజానకి తదితరులతో శ్రీమతి రాఘవమ్మా బ్రహ్మానందరెడ్డి



శ్రీమతి జమునారమణారావు. శ్రీమతి రాఘవమ్మా బ్రహ్మానందరెడ్డి




డా॥ చక్రవర్తి హీరోతో ఒకచర్చ



గవర్నరు, ముఖ్యమంత్రి, ఆర్థికమంత్రి, సమాచారశాఖ మంత్రులతో నటులు, దర్శకులు, నిర్మాతలు



రవీంద్రభారతిలో నిర్మాత–దర్శకుడు సి. ఎస్. రావు శ్రీమతి రాజసులోచన, హాస్యనటుడు రేలంగి, సమాచార శాఖ డైరెక్టరు, నిర్మాత డూండేశ్వరరావు, కృష్ణకుమారి



ప్రేక్షకులు



సి. ఎస్. రావు దంపతులతో స్పీకర్ శ్రీ బి. వి. సుబ్బారెడ్డి ముఖ్యమంత్రి, సాంస్కృతిక వ్యవహారాల మంత్రి




మాఫోటోగ్రాఫరుముందు చిరునవ్వుతో నిలచిన కృష్ణకుమారి



జూబిలీ హాలులో విందు



విందు సమయంలో జగ్గయ్యతో ముఖ్యమంత్రి



విందులో శ్రీమతి రాజసులోచన, శ్రీమతి బ్రహ్మానందరెడ్డి





విందులో శ్రీమతి జానకి, కృష్ణకుమారిగార్లతో గవర్నరు

కాంతినే నం
క్రాంతిని నేను
హిమబిందువుల మ
హీతల మెల్లిడ
చల్లిన చల్లని
తల్లిని నేను—
గుమ్మడి పూవుల
గుండెలు విచ్చెను
సెనగపూవు చెలి
సిగ్గులు పీడెను
నా చిరునవ్వుల
రోచులలో—
జవరాంద్రకు అటు
చెలికాంద్రకు ఇటు
ఎదలలోన వె
చ్చదనము విందెను
గాఢపరిష్వం
గమ్ములలో చిర
కాలపు తీయని
కలలవి పండెను
నా చల చల్లని
వీచులలో
నా చిరునవ్వుల
రోచులలో—

శైశిరము

౧. ఎంత కర్కశ హృదయ
వే: నీవు హేమంతి!
ఇలను శీతలపు సం
కెళుల బంధించితివి
వయసు బరువున వడుము
వంగిన ముదుసళ్ళ
ముసుగు మూటలలోన
ముచ్చటించితివి——ఎంత.
ఉభయ సంధ్యలు చలికి
ఉబ్బితబ్బిబ్బాయె
పాప మంటని, పసి
పాపగజగజలాడె
తొలగిపో! తొలగిపో
తల వంచుకొని నేడు
చలిరంపమున కుత్తు
కలు కోయుటలు మాని
తొలగిపో!, నే సాగు
త్రోవ కడ్డము రాకు—

౨. శిశిరబాలను
చిన్నదానను,
ప్రేమభావము
పెంచుదానను
మంచి కలతల
వంచుదానను—
త్యాగశీలము
దయాధర్మము
శాంతిసహనము
సహృదయత్వము
వెన్నతోనే నాకు పెట్టిన
విద్దెలూ
ఎన్నటికి పడలేని ఉన్నత
బుద్ధులూ—

౩. ఏమి టీ స్వాగతము
ఏమి టీ సన్మాన
మెందుకో నేనంటె
ఇంత అభిమానమ్ము
ఈ పేదవడిన వనలక్ష్మికి
జీర్ణమ
య్యె తరుపు తరుపు, లతలతకూ
కురిపించె నా మీద
వరదా యివ్వనకాంత
తనకు గలకమి సర్వస్వమూ
మిగిలిపో
యిన నాల్గు పసిడి పత్రమ్ములూ
నా బ్రతుకు వెచ్చించి
నలిగిపోయిన బ్రతుకు
లో జీవనము నించగలను
ఈ ధరణి
లో కళల పోషించగలను

వసంతము

౧. ఎందుకు? ఎందుకు? ఎందుకూ?
ఈ విలయనాట్య మెందుకూ
అందము జూచి స
హించని దానా!
అనురాగములు స
శించిన దానా!
ఓ శైశిరమా!
విష కృపాణమా!
సన్మానాలని
సాకులు చెప్పుచు
సుగుణరాశి నని
సూక్తులు పలుకచు
ఆటలు సాగిస్తానను కోకూ
అందరి నమ్మిస్తా వనుకోకూ—

౨. అడవిపడచు మానధనం
దోచుకొన్న దొంగ వీవు.
అసురత్వం హాసంలో
దాచుకున్న జాణ వీవు.
కళలను వెలగిస్తానని
కధలు చెపితే నమ్మగలదె
పారిపొమ్మ జారిపొమ్మ
శూన్య దిగంతాలు దాటి—
ఈ లోకము నీ చేతుల
లో బూడిద కాకముందె.
పారిపొమ్మ పారిపొమ్మ
ఈ దారిని తిరిగి రాకు—

౩. కోకిల పాటలు
పూవుల తోటలు
నేను నడచిన
బాటలలో
నేను నిలిచిన
చోటులలో—
మామిడి ఫలముల
మధుకర రవముల
నేను, తాకిన
కొమ్మలలో
నేను ఊపిన
రెమ్మలలో
మోడుల పువ్వుల
మోడలు చేసిరి
శిధిలాలకు నవ
జీవము పోసితి
నా మధూహల
రంగులతో
నా, సుగాన సు
ధాధునితో—

కొండలు ప్రాకితి
కొలనుల దూకితి
ప్రతిచెట్టును ప్రతి
లతికను చేరితి
బాధలను తొల
గించుటకై
ఆశలను చిగు
రించుటకై
ఉగాది నైతిని
యుగాది నైతిని
ఊరూర ఇంటింటికినీ
మనిషి మనిషి ప్రతి జీవికినీ
నవతను
యువతను
నవజీవిత పరు
వమ్మును దెచ్చిన దేవిని నే
వింగికి
నేలకు
నిర్మల చాంద్రీ
దోలలు కట్టిన బాలను నే,
కన్నెల
మనసుల
కమ్మని తలపుల
మల్లెలు నాటిన బోటిని నే
అందమ్ముల ఆ
నందమ్ముల జగ
మంతట పరచిన ఆమని నే—

గ్రీష్మము

౧. వాసంతమా ఈ వి
లాసమేలా; వి
లాసమ్ములో ఇంత
మోసమేలా ?
బాల పల్లవఖాది
నీ పికాలాపాల,
వికచ కుసుమప్రేమ
మధుపాయి గానాల
మత్తిల్లివోయె జగ
మంతచూడూ ! నీ
మాయలోపడె ప్రకృతి
కాంత నేడూ
క్షేత్రాలలో పంట
చేలు లేవూ;
ఝరులలో జలకాల
జాడలేదూ.
నవరసాలోపవన
విజన కాంతారముల
గిరిశిఖాంతర విహా
ర వినోదివై నీవు
ఎవరికిసుఖాలు కలి
గించినావే;
ఇకనైన ఆట చా
లించి పోవే;
నా మహాకోప తా
పాగ్నిలో దగ్ధమై
పోకముందే. వెడలి
పో కదలి పోవే !

౨. వచ్చాను. వచ్చాను
గ్రీష్మఋతువును నేను
శిరముపై సూర్య బిం
బ ఘటమ్మును వహించి,
శివుని ఫాలాగ్ని కీ
లా మాలలు ధరించి — వచ్చాను...
మత్త విశ్వంభరకు
ఉత్తేజకమ్మునై
వేదనలు విదలించు
విప్లవోపస్విని — వచ్చాను...
ఇందరు వీప్రవా కవ్య
లిన్ని చలివేంద్రములు,
నేను చెరగిన చంద్ర
నిప్పు లార్పగలేవు
నన్ను ఎదిరించు మా
కవులుభూమినలేరు.
అంబుధీ హృదయమ్ము
ఆవిరై పై కెగసి
నా జగత్తున జీవ
నామృతమ్మై కురిసి
మట్టిలో భాగ్యాల
మణులు మేల్కొల్పాలి
అప్పుడేగాని నా
ఆత్మ శాంతిల్లాలి—వచ్చాను...

కాలపురుషుడు

ఓహోషడ్
ఋతువులార !
నా హృదయ
జ్యోతులార !
మీలో మీరిట్లు హద్దు
మీరి పోరు పడకండి;
ఈ కాలపురుషుని బ్రతుకు
లో తుపాను రేపకండి;—
లోకమునకు మీరందరు
ఏకరీతి ప్రియతమ్ములు.
నా అనంత జీవన గం
గా చలత్తరంగమ్ములు
ఒకరు లేక ఒకరు లేరు
సకలమ్మెవ్వరు గారు—
విశ్వమహాంగణములోవ
వెలసిన ఈ కాలదేవు
యుగయుగాలు కొలవండి
ప్రగతిని సాధించండి—
ఓ వర్షఋతు జలధిజా !
ఓ శారద చంద్రముఖీ !
ఓ హేమంత కామినీ !
ఓ శైశిర శాతోదరి !
ఓ వసంత కుసుమాంగి !
ఓ గ్రీష్మ జ్వాలాముఖి
కలహమ్ములు మానండీ
కలసి మెలసి మెలగండీ
కలకాలము నాట్య గాన
కళలతోడ వెలగండీ !

బృందగానము

ఋతు రాణులము
ప్రకృతి బాలలము
ఒకరి నొకరు ప్రేమించెదము
ఒకరివెంట ఒకరము
భూగోళము. చుట్టు ముట్టి
నర్తించెదమూ
నవరసమ్ములను
నవచైతన్యము
ప్రాణి జగత్తుకు పంచెదమూ
కాలదేవునికి కన్నుల పండువ
గా నిత్యము జీవించెదమూ.

★

మిహిరకులుడు

సీరియల్ నవల :

పదునొకండవ యధ్యాయము

విశ్వనాథ సత్యనారాయణ

జీవితములో కొంతదీర్ఘాయుర్దాయము కలిగిన సర్వజనులకు ననేకవాంఛ లుండును. అందులో నొకవాంఛ బలవత్తరముగా నుండును. ఆవాంఛ తీరుటయన్నది యే యదృష్టవంతునకో కాని జరుగదు. ఎవని జీవితములో నీ వాంఛ తీరునో ఆవాంఛ యిప్పుడు తీరుననిలేదు. అది యెప్పుడు తీరునో తెలియరాదు. ఒక్కొక్కని వాంఛ వృద్ధుఁడై పండి రాలిపోవునన్నప్పుడు తీరవచ్చును. కొందరి కా వాంఛ తీరియు ప్రయోజన ముండదు. ఒకని కొకవ్వు డొకయప్సరస్త్రీయందు వాంఛ యుండును. యౌవ్వన కౌమారములు దాటిపోయిన తరువాత వృద్ధాప్యములో వానికి నచ్చర లభించును. ఫలితమేమి? ఇట్లు బహుజనుల కోరికలు ఫలించియు ఫలించనివే యగును. ఇట్టికోరికలు వారికి భగవంతుఁడు ఫలింపచేయుట కన్నీళ్ళు తుడిచినట్లు. కోరిక ఫలించుట యనఁగా తదుపభోగక్షమమైన వయస్సునందు తదితరపరిస్థితుల యానుకూల్యమునందు నది సంఘటించుట. కాని కొన్నికోరికలు తా మెప్పుడు ఫలించినను వాని నూతనత్వము పోదు. దానికి కారణము కోరికల లక్షణము, పంచేంద్రియ సంబంధ పరితృప్తి. వాంఛించవి యొక మనోనిష్ఠమైన వాంఛ యున్నచో నది పరమవార్ధక్యమున లభించినను నష్టములేదు. మిహిరకులునకు నొక వాంఛ కలదు. కొన్నివాంఛలు రూపుకట్టవు. ఏదో మొయిళ్ళ వెనుక నున్న చందమామవలె గాఢహేమంతమున ప్రాగ్దిశను దట్టముగా నల్లుకొన్న గుమ్మమంచువెనుక నున్న సూర్యోదయమువలె ఆ ప్తునివలె దూరముగా కనిపించిన యొక మానిసివలె నిదమిద్ధమని నిర్ణయింపరాకుండఁగొన్నివాంఛలుండును. ఒకని కొక సంగీతము మిక్కిలి శ్రావ్యముగా నున్నది. వినుటయం దభిలాష యుండును. వాని జీవితపరమార్ధ మదియే. వాఁడు తద్విషయమున దనకు సంపూర్ణమైన పరితృప్తి కలుగుటకు పరితాపులకుఁ బోవుచుండును. సంపూర్ణమైన పరితృప్తి యెచ్చోటను గలుగదు. కించిదూనమైన పరితృప్తి అందందు కలుగుచుండును. దానిని తన జన్మయొక్క చరితార్ధ్యముగ భావించుచుండును. కాని వానికేదో సమయమున వానికి తెలియకుండ హఠాత్తుగా నొకని సంగీతము వినుటతటస్థించును.

ఇదివరకున్న సంగీతములు సంగీతములు కావని, ఇది పరమావధీభూతమని ఇదివరకు బొందిన తృప్తి భ్రాంతిహేతువని వానికప్పుడు తెలియును. మిహిరకులుఁడు తన యొకతృప్తిభావమునకై తాను రాజ్యమునకు వచ్చిన అరువదియేండ్లుగా నిరంతరకృషి చేయుచుండెను. అతఁ డింతమందిని వధించెను; ఇన్నివిధములుగా వధించెను; ఇన్నిచోట్ల వధించెను అన్నదానికి మొదలులేదు తుదలేదు. మరియొకరాజంతటి క్రూరుఁడైనచో సేనాపతులును ప్రజలును వానినెప్పుడో తుదముట్టించియుందురు. అతనిని సంహరింపవలెనని ప్రయత్నము చేసెడివాడేలేడు. అట్టి యూహ నెవరిహృదయముననైన నంకురించినచో నా యంకురము బీజద్విధాభూతి నేర్పడకమున్నే యెలుక కొట్టివేయుటయో కాకియో పిచ్చుకయో ముక్కుతో పొడిచి లాగివేయుటయో జరుగుచుండెను. కొన్నియెడల నిట్లు జరుగును. ఒకొక్కఁడు విశిష్టమైన సత్కార్యమునో క్రూరకార్యమునో చేయుటకు జన్మించును. అది పరమేశ్వరసంకల్పము. దానికి విఘటన ముండదు. అంతరాయము లన్నియు వాని యంతట నవియే పటాపంచ లగుచుండును.

ఆరీతిగా మిహిరకులునియొక్క జీవితము మహాక్రూరకార్యభరితమై యెనుబదియేండ్లుసాగెను. అతనిరాజ్యమరువదియేండ్లు సాగెను. అతని హృదయమును దహించుచున్న వాంఛ యెట్టి దనగా :- మరణావస్థయందు జీవు లనుభవించు నొక వచియింపరాని వేదనాభరమునజేసెడిరోదనము వినుట. ఇది వానికి పరమభావుకుఁడైన గానవిద్యారహస్యవేత్తకు తుంబురునారదుల సంగీతము వినుటవంటిది. కాశ్మీరమున సింహళద్వీపమున గాంధారమున కటకోత్తర జ్యోతిష సింహపురీ ప్రముఖ బహురాష్ట్రముల నతఁడు స్త్రీ శిశు బాల వృద్ధ యువకులను చిత్రచిత్రములుగా సంహరించెను. వారి యేడ్పులను వినెను. గుఱ్ఱముల నేన్గుల వధించెను. గుఱ్ఱములను గుద్ది చంపెను. ఒంటెల మెడల మలపించెను ఏన్గుల తొండముల నలికించెను. బహుజంతువుల యాయువుపట్లు తెలిసికొని యచటకత్తులతోఁ బొడిపించెను. గునపములతో గ్రుచ్చిం చెను. అవి యన్నియు నతనియొక్క తాత్కాలిక సంతృప్తిహేతువులే యయ్యెను. గాని జన్మసాఫల్యము కలిగించినట్లు వానికి తోచలేదు. ఇట్లుండగా నతనికి కళ్యాణవతీదేవితోడి పరిచయము నామెతోడి సంబంధము భార్యాభర్తృత్వమాత్ర మర్యాదావశిష్టముగా మిగిలిపోయెను. కొడుకు బకుఁ

డున్నాడు. అతనికి సుమారిప్పుడు ముప్పది యేండ్ల వయస్సు. ఎప్పుడో నీలాంకునితో బరాచికముగా, "నేను బకుఁడను గాను. నా కొడుకైన బకుఁ డగును" అని చెప్పి తన కొడుకున కా పేరు పెట్టెను. యువరాజైన బకునియందు తన లక్షణములేమియు కనుపించలేదు. అతఁడు సాధువు. ధర్మాత్ముఁడు. క్రూరకార్యముల పొంతపోఁడు. అట్టివాడైనచో తండ్రిని మట్టుపెట్టి రాజ్యమును తానే సంపాదించుటకు నీపాటికే యెన్నోప్రయత్నములు చేసెటివాడు. తండ్రుల కొకకోరిక యుండును, తండ్రి తన జన్మలో నొక మహాకార్యమేదో సాధింపనెంచును. తాను బ్రతికియుండఁగా నది తనకు సాధ్యముకాదు. అట్టిపనిని తన కొడుకు సాధించవలె నని తండ్రి కోరును. అట్టికోరిక మిహిరకులునకు తనకొడుకైన బకునియందు సిద్ధించునన్న యాశ నిర్మూలమయ్యెను.

తాను బ్రతికియుండగనే తన తృప్తి తనకు జరుగవలయును. మిహిరకులుడప్పుడప్పుడు పట్టమహిషి సౌధములకు బోవును. రేయి యచట నిద్రించును. మిహిరకులుఁ డచ్చటకు బోవుట కామతృప్తి కొఱకు కాదు. ఆమెతో రాచకార్యముల ప్రసక్తి చేయుటకు కాదు. తొలుతటి నాళ్ళలో నతనికి పౌనఃపున్యముగా స్వప్నాగతుఁ డయ్యెడి మిథ్యాప్రజ్ఞానదేవత కల్యాణవతీసౌధములందు తాను నిద్రించినప్పుడే కనుపించుచుండెను. తన ఇంటివద్ద స్వప్నములు వచ్చును. యముఁడును బేతాళుఁడును కనుపింతురు. స్వప్నములుకూడ రానక్కఱ లేదు. ఏకాంతముగా నుండి కన్ను మూసి మనస్సు నంత నిద్రాభిముఖముగా నున్నచో చాలును. వారు కనుపింతురు. కనుపించి యేమిలాభము ? తనతో మాటాడరు. తాను మాటాడినచో బదులు చెప్పరు. వారు తనకు గనుపించినపుడు వారును తానొక్కటియేయన్న యొక తన్మయీభావము కలుగుటయు మనస్సు క్రూరతామయమై యుండుటయు ప్రళయాభిముఖమైమాత్రమే యులకుటయు జరుగుచున్నది. తన కేదైన హిత ముపదేశింపవలయు నన్నచో తనతో వాగ్వాదము చేయవలయు నన్నచో మిథ్యాప్రజ్ఞానదేవతయే గావలయును. అతఁడు కొన్నియేండ్లు కనుపించలేదు. యాదృచ్ఛికముగా నొకనాడు కళ్యాణవతీ సౌధములలో నిద్రింపగా నతఁడు కనుపించెను. అప్పటినుండి యతఁడు గనుపింపవలె ననగా నచటికిపోయి నిద్రించక తప్పకవచ్చెను. రాజసౌధములయందుగూడ కొన్నాళ్ళెడమెడముగా నున్న భార్యాభర్తలకు తిరిగి సౌహార్దము కలిగెనని చెప్పుకొనుటకు వీలైనది. సాధువైన యువరాజులయొక్క మనస్సులోఁ తండ్రి తన తల్లిని సరిగా చూచుటలేదన్న చింత వదలినది. మిహిరకులుని కిపు డెనుబదియేండ్లు. కళ్యాణవతి డెబ్బదియైదేండ్లు. మిహిరకులుఁడు నలుబదియేండ్లవానివలె నుండును. కళ్యాణవతి ముప్పదియైదేండ్ల యువతి వలెనుండును. కళ్యాణవతియు బకుఁడు నొకచోట నిలుచున్నచో నెవ్వరును తల్లి కొడుకు లనుకొనరు. అప్పగారు తమ్ముఁడు ననుదురు. తనయందు తన భర్తయొక్క యీ తూష్ణీంభావమువలన కళ్యాణవతి జీవితమే మారిపోయెను ఆమె తన చిన్ననాడు తన తండ్రివద్ద నున్నట్లుగా నుండెను. కొడుకుయొక్క సర్వవిద్యాపరిశీలనాపరీక్షలు తానే చేయును. దినదిన మతనితో కత్తియుద్ధ మాడును. తన నేర్చిన సర్వఖడ్గవిద్యయు బకున కుపదేశించెను. తాను క్రొత్తగా కాపురమునకు వచ్చిన తొలుతటిదినములు నతనితండ్రి రెండుగడియలకాలములో దన శిరస్త్రాణమును తొలగించలేనికథ కొడుకుతో ననేకపర్యాయములు చెప్పును. ఆమె బకునకు వేదశాస్త్రపురాణేతిహాసము లన్నియు జెప్పించెను. యుధిష్ఠిరుని రాజ్యాంగవిధానమంతయు సర్వంకషముగా బోధించెను. అప్పుడప్పుడూ గాంధారదేశమునకు బోవును. తన దత్తత తమ్ముఁడైన నీలాంకుఁడు చనిపోగా నతని కుమారుడైన గోవర్ధనునకు రాజ్య మర్పించి వానిని పట్టాభిషిక్తుని జేసి రాజ్యము భద్రపఱచి పైపరామరికగా నప్పుడప్పుడు మేనల్లుని రాజ్యపరిపాలనమును పర్యవేక్షించి వచ్చుచుండును. ఆనాడు మిహిరకులుఁడు కళ్యాణవతీసౌధములయందు నిద్రించెను. అతనికి దెలవారుకడ మిథ్యాప్రజ్ఞానదేవత కనుపించెను.

మిహిర:— నాకు తృప్తి కలుగలేదు.

మి. ప్ర. దేవత:— నీ కింకను పదియేండ్ల రాజ్యకాల మున్నది. నీ కప్పుడే తృప్తి కలుగరాదు. నీవు చేయవలసిన పనులు చాల నున్నవి.

మిహిర:— తృప్తి కలుగనిమ్ము. తరువాత చేసెదను.

ప్ర. దేవత:— ఒకసారి రాజాన్నము తినిన తరువాత మన యింటిలోని తిండి సయించదు.

మిహిర:— అట్లుకాదు. క్షుత్తు నివారించుకొనవలయునుగదా? మనుజుఁడు తిండి తినక నేమి చేయును? ఆనాటి రాజాన్నమును స్మరించుకొంచు ఆమరణము తన యింటిలోని తిండి తినుచునేయుండును.

ప్ర. దేవత:— అట్లేయైనచో నీవు నేడు నిద్ర లేచినవెంటనే నీ కా తృప్తి కలుగు హేతువు సమకూడును.

రాజసౌధములు పెద్దపర్వతము నంటి యుండెను. రాణిగారిసౌధము మరియు నొక కొండడొక్కలో నుండెను. ఆ సౌధము నంటియున్న కొండప్రక్క నొక పెద్ద యఖాత మున్నది. ఆ పర్వతముమాత్ర ముత్తరదిశగా వాలుగా నుండును. దక్షిణ దిశ యంతయు నొక యఖాతము. రాజసౌధము లచట నిర్మింపబడుటకు గారణ మేమనగా దక్షిణమునుండి శత్రుభయ మెప్పుడు నుండదు. రాజ్యసౌధము లన్నియు ప్రాగ్దిశాభిముఖములుగా నున్నవి. పశ్చిమ దిశ యంతయు మహాపర్వతములు. రాజసౌధముల వెనుక నున్న పర్వతములమీదికి

శత్రువులు రావలయునన్న నుత్తరదిశా మార్గ మొక్కటియే మిగిలి యున్నది. అందుచేత రాత్రిందివములు రాజసౌధ పశ్చాద్భాగ పరిస్తీర్ణ పర్వతోపరిభాగమున రక్షణ చేయుచుండు; పగ లశ్వములమీద తిరుగుచుండు; రాత్రులం దేనుగులు రక్షించుచుండు. మిహిరకులుఁడు నాటి ప్రొద్దున మేల్కనెను. మేల్కొన్నంతనే యతనికి నొక దుర్భరనిగాఢవేదనాసంజనిత మహాభయంకరారావము వినిపించెను రాజసౌధములలో నున్న సర్వజనుల గుండియలలో నెత్తురు కఱడుగట్టెను. కొందరు నిశ్చేతనులైరి. కొందరు సొమ్మసిలి పడిపోయిరి. కొందరు భయగ్రస్తులైరి. రాజసౌధములలో భిన్నప్రదేశములయందు రక్షణార్థము నిలచి యున్న సాయుధపాణులైన భటులు దిగ్భ్రాంతి పొందిరి. శత్రువులు వచ్చుటకు వీలులేని యా మహాశిలామయప్రదేశము నిత్యసుభటరక్షితమైన యా ప్రదేశమున నిట్టి దారుణధ్వని యుద్భవిల్లుటకు హేతు వెవ్వరికిని తెలియలేదు. ఆ సహస్రాశని నిపాత దుర్భరనిరంతరితమహాధ్వానము మిహిరకులుని కర్ణరంధ్రము లన్న బోదెకాలువలలోనుండి వాని మన స్సన్న దున్ని సిద్ధము చేసి జలాగమనప్రతీక్ష చేయుచున్న సస్యక్షేత్రములోనికి దొవదొవ చిరుకెరటములై సన్నని తెల్లని పసిత్రాచులు ప్రాకినట్లు ప్రవేశించెను. అతని యొడ లతనికి తెలియలేదు.

మహాకాంతారమున దావాగ్ని చెలరేగును. పక్కనున్న పచ్చనిచెట్లు తొలుత పార్శ్వతరుసమేధమాన మహాగ్నిజ్వాలాకరాళదంష్ట్రాస్పృష్టములై పసిమి వాయును. ఇంతలో శుష్కపత్రములవలె నగును. మరింతలో నా మహాగ్ని నందుకొనుటకు యోగ్యమైన కృతకమైన యెండుతనమును రెమ్మలలో కొమ్మలలో కల్గించుకొనును. ఉషద్బుధుఁడు తాను గ్రహించటకు యోగ్యముగా నున్నదా లేదా యని తన జిహ్వలను చాచును. ఇట్లు పరిణతమైన శుష్కతరువులు తాముకూడ వెంటనే యగ్నిదేవుని జిహ్వలుగా పరిణమించును. మిహిరకులుని మన స్సారీతిగా నయ్యెను. ఒక మహాగ్నియొక్క విహారము చిత్రచిత్రములుగా నుండును. కొన్ని లక్షణములయందు క్రొత్తగా ప్రవహించు నీటికిని క్రొత్తగా దహింపబోవు నగ్నికిని భేద ముండదు. నీరు జలజలలాడును. అగ్ని సురసురలాడును. రెండును ప్రారంభదశయందు గ్రుడ్లు పగిలి అప్పుడే వెలికి వచ్చిన తాచుపిల్లలవలె ప్రథమాభ్యస్తఫణావివరణ లజ్జాకములై క్రొత్తగా దున్నిన పొలము చాళ్ళలో బ్రవేశించుచున్నట్లు బయలుదేరును. క్రమముగా ముందున్న పొలమును వశము చేసికొనును. నీళ్లు ముందునకుచెమ్మ నురికించును. అగ్ని చెమ్మ నిడియించును. ఆక్రాంత దేశమున జలము కెఱటము లెత్తును. అగ్ని జ్వాలలుగా రేగును. ముందటికి పోగా



వెనుకటివేలలో జలముతరంగములు తగ్గి యుయ్యాలలూగును. అగ్ని కళవెళలాడును. ఆ మహాభయంకరారావ శ్రవణమువలన మిహిరకులుని మన స్సంట్లుండెను. స్వీకరించిన తృప్తివిషయమున జలప్రవాహమువలె భిన్నానుభవదశావిషయమున వగ్నివలె నతని మనస్సు పరవళ్ళుత్రొక్కెను. స్తిమితత్వము నొందెను. ఒక సాధుకార్యకరణజనితమైనదియో, ఒక క్రూరకార్యకరణజనిత మైనదియో తృప్తి విలువరించుకొని యనుభూతిదశాపారమ్యమును బొందినపుడు వస్తుతః భేద మున్నను పరిణామపర్యాప్తివేళ సాదృశ్యమునే భజించును. అచ్ఛమైన, శిశిరమైన, సుఖశీతలమైన, మందవాయుపరిసంచాలితమైన పుండరీకకల్హారసుమవనీడోలాయమానమైన స్థిరత యేర్పరచుకొన్న మంచినీటి చెఱువు కలదు. కలుషితమై బహుపట్టణములనుండి సముద్భూతమైన మాలిన్యభరితజలప్రవాహనిబిడమై మృతబహుజంతుకళేబరదుర్గంధమిశ్రితమై యున్న యొక పెద్ద దుష్టజలసమృద్ధమైన స్థలమున్నది. రెంటిభేదము చూచువారికున్నది. వానిమీదినుండి వచ్చువాసనల నాఘ్రాణించువారికున్నది. నీరునిలుచుటలో తటములచేత నాపబడుటలో గాలి చేతకొట్టబడుటలో నంతస్థితద్రవ్యములను బైకి తెలియుటలో భేదమేమున్నది? మిహిరకులుని మనస్సులో నొక తృప్తి కలిగినచో నది దేనిచేత పూరింపబడినది, దాని స్వరూప మెట్టిది యన్న వివక్ష లేనిచో నిండుతన మున్నది. ఒకనిమేషములో వాని జన్మ సార్థక్యమందిన ట్లనిపించినది. అది యానందమన్నచో వాని మనఃక్షేత్రమున నానందపర్యాప్తి కలిగినది. కొంత సేపటికి ననుభూతిపారమ్యముయొక్క చివరిదశ కలిగిన తరువాత నీ మహాధ్వని యెక్కడిది దన్న ప్రశ్న యుదయించెను.

అంతర్వేశికుని బిలిపించెను. వాడు తన తొల్తటిదిగ్భ్రాంతి తొందరగా విదిలించుకొని నీ మహారావముయొక్క స్వరూపమంతయు వెంటనే తెలిసికొనెను. అది రాజసేవకుని ధర్మము. వాని యుద్యోగమును వాని జీవనమును దానిమీద నాధారపడియుండును. రా జేనిముసమున పిలుచునో? దాని కారణ మడుగును. చెప్పలేనిచో తన తల యెగిరిపోవును. రా జడుగగా నంతర్వేశికు డిట్లు చెప్పెను. "మహారాజా! మహారాజ్ఞియొక్కసౌధ పశ్చాద్భాగమున నున్న మహాపర్వతమునకు నధిరోహణప్రవేశ ముత్తరదిశనుండి. దక్షిణదిశ పెద్దలోయ. ప్రభువులకు దెలియును. రాత్రులందు గజసైన్యము పశ్చాద్భాగ గిరి ప్రవేశమును రక్షించుచుండును. తెలవాఱబోవుచున్నది. కాని తద్గిరిప్రాగ్భాగ మంతయు నెత్తైన ప్రాకారముచేత సంరక్షితమైయుండుటచేత నుషఃకాంతి యచట తెలుపును తేదు. దక్షిణదిశాస్థితి మహాగర్తాంచలమున నొక పెద్దకొండరాయి సూక్ష్మమైన శైథిల్యమును పొందియున్నది. ఎప్పుడు పొందినదో యెందుకు పొందినదో తెలియదు. నిశావసానరక్షిశీలు డైన మావటివాడు తన దంతావళము నా యంచలమువఱకు తీసికొనిపోయెనట. ప్రతిదిన మట్లు పోవును. నది రాత్రులందు పెద్దపెద్ద యగ్నిగోళములను లోతులలోనికి విసరుదురు. తదగ్నిజ్వాలాపరివ్యాప్తమైన స్థలములలో శత్రులున్నచో నశించిపోదురు. దూరముగానున్నచో గనుపింతురు. తెలవాఱుకడ నగ్నిగోళమును విసరరు. ఒక యినుపగొలుసునకు చివర నగ్నిగోళమును కట్టి యఖాతములోనికి దింపుదురు. మావటివాడును గజారోహకుడును గజముయొక్క కుంభస్థలమునకు వచ్చి యేన్గు నచట మోకరింపచేసి లోనికి చూతురు. అప్పు డేన్గుయొక్క బరువంతయు ముందటికాళ్ళమీద నుండును. ఆ బరువు కాక మనుష్యుల యిద్దరిబరువు గజసైనికుని డాలు, వాని ఈటె వాని వక్షఃకవచము ఇది యంతయు కలిసి మరియు బరువుకదా! అప్పు డాయేనుగుయొక్క ముందటిరెండుకాళ్ళు శైథిల్యాభిముఖమైయున్న యా రాతిమీద నున్నవి. రాయి జారినది. ఏన్గు తూలినది, అందరును కలిసి యఖాతమున పడిపోయినవి. ఆ సమయములో మహాభయవిహ్వలమైన యా మత్తదంతావళి మఱచినది; గీ పెట్టినది. ఆ మహాజంతువు తన ప్రాణభయముచేత నిస్సంశయమైన మృత్యుసమయమున హఠాదాపతితమైన యా దుష్టసమయమున నట్టిబీభత్సమైన యట్టియఱపఱచినది;" అని యంతర్వేశికుడు చేతులు జోడించి భయముతో నిలుచుండెను. మహాయుద్ధగజము సైనికులయొక్క యనాలోచనమువలన చనిపోయెనని రాజు కోపించునేమో! ఆ మహాశిల భద్రముగా నున్నదా లేదా యన్న విషయము నిత్యజాగ్రదవస్థావిషయ మేల కాలేదని కోపించునేమో! చనిపోయిన గజసైనికు డెవడని ప్రశ్నించునేమో.

అంతర్వేశకుని ప్రాణములు ప్రాణములలోలేవు. మహారాజొక యానందములో నున్నాడు. అత డానందములో నున్నాడని అట్టి సమయమందు మిహిరకులుని చూచి తెలిసికొనగలవారిసంఖ్య తక్కువ. మిహిరకులుని కనులు కళకళలాడుచున్నవి. గల్లోచ్చైస్థితాస్థికోణోపరిమాంసపిండము బికియున్నది. చిబుకము సన్నవారియున్నది. పుస్తీలలోని సగము కత్తిరించిన వెంట్రుకలు సుంత తెలుపు తిరిగినవి. నిక్కపొడిచికొనియున్నవి. రాజప్పుడే నిద్ర లేచెనుకాబోలు. దంతధావనాదికములు చేయలేదు. నిద్రామాలిన్యము మొగమునం దున్నది. మొగమంతయు జిడ్డుగా నున్నది. కనురెప్పలలోని వాలికతనము పూర్తిగా పోలేదు. అతని మొగము భయంకరముగా నున్నది. కాని యతని ఆనందాతిశయలక్షణ మంతర్వేశికునకు తెలియును. తాను బ్రతికితి నను కొన్నాడు. రాజు కాల్యకృత్యములను తీర్చి కొలువుసావడి వెనుక నున్న యాంతరంగిక విషయచర్చాయోగ్యమైన సావడిలో కూర్చున్నాడు. మంత్రిని పిలిపించెను. సేనానాయకుని పిలిపించెను. దర్పమల్లుడు

చనిపోయి నాలుగేండ్లయినది. ఇపుడు మహాసేనాధిపతి నిష్కరుణుడు. మంత్రి పేరు ఖంకుఁడు. ఇతరసేనాపతు లున్నారు. ఇతరమంత్రు లున్నారు. ఖంకుఁడు ప్రధానమంత్రి. నిష్కరుణుఁ డెంతవాడో ఖంకు డంతవాడు. వారి మువ్వురి కలయికవలన రాజ్యము మహాయాజ్ఞికుని అగ్నిగృహము వలె త్రేతాగ్నులతో మండుచున్నది. ఒక్కటే భేదము. అది స్వర్గసీమసోపానపంక్తి. ఇది నరకలోకమునకు సోపానపంక్తి.

అదిమొదలు సాయంతనమువఱకు నిరంతరముగా రాజాజ్ఞలు సాగుచునేయుండెను. ఆ పడిపోయిన మహాశిలను తెచ్చి ప్రొద్దు క్రుంకులోపల నది యేచోటినుండి జారినదియో యాచోటున నుంచవలయును. అది యెట్లు వచ్చును. కొండమీద పెద్ద యంత్ర మేర్పరుపవలయును. ఇనుపకప్పీలు నినుప గొలుసులు క్రింద వందమంది జనము పైన వందమంది జనము క్రింద నా యఖాతములో వందమంది యా రాతిని గొలుసులతో కట్టవలయును. పైన వందమంది కప్పీలమీద దానిని లాగవలయును. మధ్యాహ్నము దాటి జాము ప్రొద్దున్నదనగా నా రాతిని పైకి చేర్చిరి. ప్రొద్దు క్రుంకులోపల నది బెసకి పోయినచోట నమర్చిరి.

ఈ మహాప్రయత్నములో వందమంది మరణించిరి. మరల నింకొక రాజాజ్ఞ. ఆ కప్పీలు తీయగూడదు. ఆ యంత్రము లచటనే యుండవలయును. అట్లే యున్నవి. మరల నింకొకరాజాజ్ఞ. మరునాడు తెలవాఱుకడ మరియొక ఏనుగును రాతిమీద మొగ్గించవలయును. ఆ తాయి మరల పడవలయును. ఎవ రేమిచేయుదురు? ఇది మహాభయంకరముగా నున్నది. ఏ మావటివా డంగీకరించును? ఏగజసైనికుఁ డొప్పికొనును? యొప్పికొనక యేమిచేయుదురు. అట్లు చావనిచో వా రింకొకట్లుచత్తురు. ఆచావే మంచిది. పై నుండి యఖాతములో పడునపుడు ప్రాణము నడుమనే పోవచ్చును. ప్రాణము పోయిన తరువాత తల పగిలిన నేమి? కాలుసేతులు విరిగిన నేమి? అట్లు కానిచో రాజు విచిత్ర వధచేయించునుకదా! దానికన్న నిదేనయము. ఆ సాయంకాలమువఱకు మరునా డే యేనుగో యే గజసైనికుఁడో యే మావటివాడో తెలియదు. మరునాటి నియమము వెనుకటి దినముయొక్క సాయంకాలమున తెలియును. ఆయూ రేకచక్రపుర మయ్యెను. ఒక్కటే లాభము. పుట్టెడన్నము బండిమీద తోలికొని పోనక్కరలేదు. రెండుదున్నలను కొననక్కరలేదు. వీనికి ప్రాణనష్టముదక్క దానితోపాటు సొమ్మునష్టము లేదు. ఈ మహాసంహారములలో కొన్ని యెదురుతిరిగిన యేనుగులుకలవు. ఎదురుతిరిగిన మావటివాండ్రును కలరు. గజసైనికులు గలరు. ఏమిప్రయోజనము. అందరును స్థూలదృష్టికి సుఖమైనచావును పరిత్యజించి దుఃఖమైన చావును తెచ్చికొన్నవారే – ఈ మహానందమును మిహిరకులుఁడు నూటయేబదిదినము లనుభవించెను. ఉత్తమమత్తదంతావళముల యొక్క యీ మహాబీభత్సరావము మిహిరకులునకు నైదునెలలు వందిమాగధస్తోత్రప్రాయ మైనది. అప్పటికి రాజునకు తృప్తి కలిగెనని చెప్పవలయునో విరక్తి కలిగెనని చెప్పవలయునో తెలియలేదు. ఆ ఘోర మంతరించినది. ఈ భయము తీరినదని శ్రీనగరప్రజల గుండెలు నిబ్బరపడుటకు నెలనాళ్లు పట్టినది. అంతేకాదు. తరువాత మిహిరకులుఁడు దినదినవధలు మానివేసెను. కారాగారమునందలి చివరి రెండుప్రాకారముల నడిమి సుంత విశాలమైన ప్రదేశమున సాయంకాలముయందలి కొలువులు లేవు. వధ్యులైనవారి వికారరోదనధ్వనులును లేవు.

ఈకాలమున మహిరకులుఁడు మరల తా నొకదేవాలయమును గట్టించెను. ఒక మఠమును నిర్మించెను. అతఁడు మరల నిన్నాళ్ళు కళ్యాణవతీసౌధములకు బోలేదు. మిధ్యాప్రజ్ఞానదేవత నాడు కనుపించుటయే కనుపించుట. అతని ఈ ఏనుగులవధపూర్వము చేసిన మహాక్రూరకార్యముల నన్నింటిని కలిపి కలిగించిన భయము నేవగింపును కలిగించెను ప్రజలకు మిక్కిలియు వైముఖ్యము కలిగించెను. తత్పూర్వకృతక్రూరకార్యములకు క్రౌర్య మెట్లున్నను కారణ ముండెను. ఒక శత్రుదేశమును పట్టుకొనెను. మ్లేచ్ఛులను నిర్మూలింపవలయునని బయలు దేరెను. పరదేశాధిపతియొక్క పదచిహ్నములు తన భార్య కంచుకమున కనిపించినవని వాని నిర్మూలింప బయలుదేరును. ఇట్టి కారణములు కలవు. వాని నిర్మూలింప బయలుదేరి సహజక్రౌర్యమును తత్తత్కాలములయందు నెఱపుట జనులకు కొంతయర్థమయ్యెను. దినదినమీ యేనుగులను కూలద్రోయించుటలో అతని యుద్దేశ్య మేమో దానివలన నతనికి కలిగిన పరితృప్తి యెట్టిదో జనుల కవగాహనకాలేదు. అతని జీవితరహస్యము విద్వాంసులకుగూడ నగమ్యముగా కనుపించెను. భయంకరహింసాసంజాతమైన జీవు లరోదనధ్వనియందు వేనిచిత్తమైన రమించునని యనుకొనుట యెట్లు?

అట్లు ద్రవించెడిచిత్తముండునా? ఉన్నచో నది ద్రవీభావ మగునా! ఇది సహజమైన మానవబుద్ధికి నగ్రాహ్యమైన విషయ మయ్యెను. తన చేసిన క్రూరకర్మములు పరులయందు జుగుప్సకలిగించుచున్నవని మిహిరకులునకు దెలియును. పరుల ముఖాద్యవయవములయందు నా జుగుప్సద్యోతమాన మైనచో నతడు వారిని వెంటనే వధించును. కొందరువ్యక్తుల ముఖములయందు వారి భావములు వ్యక్తములు కావు. వారికి యూహలు కలుగవని చెప్పుట యెట్లు? ఊహలు వారు గోపనము చేయుదురన్న భావము మనకు కలుగవచ్చును. అప్పుడు ఊహలు కలుగనివారు గోపనముచేసెడివారు నొకకక్షయందే యుందురు. భేదము చేయలేము. లోకమంతయు నెట్లున్ననేమి. తన భార్యయు తనకుమారుడును తన ఈ క్రూరకార్యములనుగురించి యెట్లు భావించుచున్నారన్నది ప్రశ్న? మిహిరకులుఁడును బకుఁ

డును సామాన్యముగా కలిసికొనరు. అతడు యువరాజు. అతనిక్రింద కొంతరాజ్యము వున్నది. అతని సంపద యతని కున్నది. అతఁడు తన భోగములకొఱకుగాని మరి యొకదానికిగాని తండ్రి నడుగవలసినపని లేదు, ఒక మహారాజకార్య ముత్పన్నమైన పుడు రాజ్యాంగమైన పదునెనిమిదిమంది మహాధికారులును సమకూడుట యుండును. అట్టి సమావేశము మిహిరకులుఁ డెప్పుడును చెయ్యలేదు. రాజసౌధములు రాణిసౌధములు యువరాజసౌధములు సన్నిహితరాజబంధువుల సౌధములు నన్నియు నొకచోటనేయున్నను నన్నియు పరిస్తీర్ణములై యది యొక పెద్ద గ్రామమంత యుండుటచేత పనిపెట్టికొని వెళ్ళినగాని యొకరికొకరు కన్పడరు. మహాపండితులో గొప్ప గాయకులో నాట్యప్రదర్శనము చేసెడివారో వచ్చినప్పుడుగాని పండుగపబ్బముల యందు వినోదములు కలిగినప్పుడుగాని బంధువు లందరు సమావిష్టు లగుదురు. అప్పు డొకరికొకరు కన్పడుట తప్పదుగదా. అట్టి సమయములయందుగూడ మహారాజు తన మొగము చూపించిపోవును. మ్రొక్కుబడి చెల్లించిపోవును. మహారాజు వచ్చినపుడు యువరాజు రాకపోవచ్చును. యువరా జున్నాడుకదా, అతని పర్యవేక్షణక్రింద నీ వినోదములు సాగనిమ్మని చెప్పి మహారాజు వెడలిపోవుటయు గలదు. ఈ విధముగాఁ దండ్రికొడుకుల సమావేశములు సామాన్యముగా జరుగనే జరుగవు. నూటికి కోటికి జరిగినచో బకుడు తండ్రికి నమస్కారము చేయును. తండ్రి మందహాసము చేసి కుమారుని స్నిగ్ధదృష్టులతో చూచును. ఆ కన్నులలోని స్నిగ్ధత మిహిరకులుని హృదయమునకు తెలియును, గాని బకుని మనస్సునకు తెలియదు.

ఇంక కళ్యాణవతియొక్క భర్తృసాన్నిధ్యమందలి యార్ద్రితయు సౌకుమార్యమును శృంగారరసమును నెట్టివో తెలియదు. తొలినాళ్ళల భర్త తన్ను సుస్నిగ్ధదృష్టిప్రసారమున తిలకించుటయు దన కభిమతములైన కార్యములను చేయుటయు నతనికి దాననుగుచెలి ననుకొనుటయు హృదయగత లక్షణముకంటె కాంతులయందు పెదవి కదలించుటలయందు నడకయందు హేలావిలాసముల యావిర్భావములయందు నామెకు దెలిసెడిది. క్రమక్రమముగా నట్టిస్థితి వెనుకబట్టెను. బకునకు నిరువదియేండ్లు వచ్చు నాటికి నామె మరల గర్భవతి; కాని నాటికి నిద్దఱకు యౌవనము గడచి కౌమారము కూడ నర్ధాధికముగా చెల్లిననాటికి నొకరన్న నొకరికి ప్రేమ లేదనియే చెప్పవలసి వచ్చెను. తొలినాటి సంపర్కము కలదు. ఈ శరీరము లున్నంతవఱకు నా సంబంధము త్రెంచరానిది. జీవుఁ డనంతప్రయాణములు చేయుచుండును. ఒక్కొక్క జన్మ యొక్కొక్క ఘట్టము. మానవుఁడై పుట్టును. ఏ పదునారేండ్లకో యొకజ్ఞానము కలుగును. కొన్ని యేండ్లయిన తరువాత మరణించును. జ్ఞానము కలిగినతరువాత మరణాంత మనుస్యూతముగా వచ్చిన యీ జ్ఞానమునం దొక యేకాకృతి గలదు. పూర్వాపరసమన్వయము కలదు. దానియందు విచ్ఛిత్తి యున్నట్లు కనిపించదు. ఒకదేహి తద్దేహపతనావధి యొక యేకాకృతి. చిన్నప్పుడు పెండ్లి యాడెను. తాను చనిపోవువఱకు నామె భార్య. తా నామెను పాలించును, పాలించడు. అయినను నామె వాని భార్యయే. ఈ సంబంధము వా రిద్దరు బ్రతికియున్నన్నినాళ్ళు నున్నది. అట్టి సంబంధము కళ్యాణవతీ మిహిరకులులనడుమ యున్నది. ఈ భార్యాభర్తల సంబంధము వారికి సంతానము కూడ కలిగినచో త్రెంచరానిదిగా నుండును. వారు మహాధనవంతులైనచో రాజులైనచో మానవసంసార నియమితసూత్రముఁచేత కొడుకు తండ్రియాస్తికి వారసుఁ డగుటచేత నీ బంధములు పరిచ్ఛేద్యములు కావు. కళ్యాణవతీ మిహిరకులు లిద్దరును వృద్ధులనియే చెప్పవలయును. వారి యిద్దరినడుమ కామవ్యాపారము లేదనియే చెప్పవలయును. సామాన్యలౌకిక స్త్రీపురుష సంబంధము వారి యందులేదు. కాని యొకనాటిసంబంధము యొక్క స్మృతికలదు. మానవజీవితమునందు సంబంధముకంటె తత్స్మృతి బలీయసి. ఇట్టిపరిస్థితిలో మిహిరకులుడు కళ్యాణవతీ సౌధములకు బోయినచో దప్పులేదు. పోవక పోవుట తప్పు. తన యీ మహాక్రూర కార్యములు చూచి విని కళ్యాణవతి యేమనుకొను నన్న ప్రశ్నకూడా నెప్పుడో పూర్తియైనది. ఆమె యేమనుకొనినను తాను పాటించడు. కాని మానవునియొక్క మనస్సు పుండువంటిది. పుండు మానును. మానిన ట్లుండును. లోన పచ్చిగానే యుండును. నిముసములో మరల పుండగును. లేదా లోన సలపరింత యుండును. అందుచేత క్రొత్తదుష్కార్యము క్రొత్తక్రూరకర్మ కలిగినపుడు వ్యాధి తిరుగబెట్టిన ట్లుండును.

మిహిరకులుడు తన భార్యాసౌధములకు బోయి యారునెలలైనది. మరల మిథ్యాప్రజ్ఞానదేవతా దర్శనము లేదు. అతని దర్శనములేక ఇతనికి శాంతిలేదు. కళ్యాణవతి యేమనుకొనినను సరే మిహిరకులునకు నచటికి బోవుట తప్పదు. ఆమెకు తా నన్నిష్టము లేదని యనుకొందము, మహారాజు రాగా జరుగవలసిన సముదాచారము జరుపబడవలయునుగదా. ఒకవ్యక్తియందు రెండు ధర్మము లున్నచో నిట్టిసందర్భములందు కార్యకారి యైనవారికి లాభము. తాను భర్త యగుటచేత నేస్వాగతము నెఱపబడదో ఆ స్వాగతము రాజగుటచేత నెఱపబడితీరవలయును. ఇద్దరినడుమ నొకవ్యవహారమున్నది. వ్యవహారము విషమించినది. వారొకరినొకరు చూచుకొనుటకు వీలులేదు. కాని యా యిద్దరును కలిసి మరియొకరి వ్యవహారమునందు పరిష్కర్తలు. కలిసికొనకతప్పదు అచట నన్యవ్యవహారపరిష్కారప్రసంగమే చేయుదురుగాని స్వవ్యవహారవైషమ్యమునుగూర్చి మాటాడరు. మిహిరకులుడు భార్య యింటికి రాజుగా పోవును. ఈ రాజ్యమంతయు తనది. తన్ను కాదనుటకు

వీలులేదు. తనకు వేరపని యున్నది. మొగ మోటపడిపోనిచో నింకొకపని చెడిపోవును. మిథ్యా ప్రజ్ఞానదేవతా దర్శనము వానికి కొడుకుకంటె భార్యకంటెఁ బ్రియమైన విషయము. ఎట్టి దుష్కరవిషయమైనను మునుగునంతవఱకే చలి. ఒక్కసారి హర హరమహాదేవ శంభోశంకర యని తలను ముంచుము. తరువాత నీ ప్రయత్నము లేకుండగనే చెవు ముక్కులు మూసికొని పదిమునుకులు గబగబ చేయుటయే సహజత్వము. ఒకనాడు మిహిరకులుడు సాహసించి కళ్యాణవతీ సౌధములకు బోయెను. తానేమో యనుకొనెను. అచ్చట నేమియు లేదు. మహారాజ్ఞితొల్లిటివలెనే వచ్చెను. మాటాడెను. మహారాజు చాల దినములకు వచ్చెనన్న భావము పరిచారికలలో గన్పించెను. మనము చేసినతప్పునుగూర్చి మనమనుకొన్నంతగా నితరులనుకొనరేమో.

రాజు సుఖముగా విద్రించెను. తెలవారు జామున మిధ్యా ప్రజ్ఞానదేవత కనుపించెను.

దేవత : తృప్తి కలిగినదా.

రాజు : ఆకంఠముగ కలిగినది.

దేవత : మనస్సు శాంతముగా నున్నట్లున్నదే:

రాజు : ఆ తృప్తికిని ఈ శాంతికిని సంబంధము కనిపించుటలేదు. తృప్తిపరమ క్రూరలక్షణమునకు సంబంధించినది. శాంతి సత్ప్రదార్థమునకు సంబంధించినది. దానినుండి యిది పముద్భవించుట యేమి.

దేవత : నీ కీ జన్మలో తెలియదు. కలి ప్రవేశించినది. రెండువేలయేండ్లు గడచినవి. ఇంకొకవేయియేండ్లు గడచిన తరువాత నీవంటివారు పలుమంది సముద్భవింతురు. వారు క్రూరకార్యములకు నెలవులు, జనసంహారకారులు, క్రొత్తరాజ్యమును సంపాదింపవలయునని తమ మతములను వ్యాపింప చేయవయునని వారు చేయబోయెడి హింస ముందు నీ హింస లెక్క యేమి? వారికిని నీకువలెనే తృప్తికలుగును. తృప్తి యనగా నొకనిండుదల. స్వచ్ఛజలపూరితమైన చెఱువునకును నిండుదల యుండును. కలుషజలపూరితమైన చెఱువునకును నిండుదన ముండును. పరమసత్కార్యము నెఱపిన వాని మనమునను తృప్తి కలదు. పరమ దుష్కార్యము చేసినవాని మనమునకును తృప్తి కలుగును. ఆ తృప్తితరువాతఁ దాదృశములైన యితరకార్యములయందు మనసును మరల చొప్పించుటకే సమర్థముకాదు. కాని సహజమైన యసత్ప్రదార్థమును తొలగించుటకు సమర్థముకాదు. ఈ శాంతి శాంతికాదు. ఇది వట్టి నిష్క్రియత్వము. శాంతి రెండు విధములుగ నుండును. ఇంద్రియోపరతి వలన కలిగెడి శాంతి వేరు, ఆయాసము వలన గలగెడి శాంతి వేరు. దేవి కదే.

మరునాడు మిహిరకులుఁడు మేల్కాని కాలకృత్యములు దీర్చి వెలికి వచ్చినంతనే వానికొక బ్రాహ్మణుడు కన్పించెను. అతఁడు రాజదర్శనమునకు వచ్చెను. మిహిరకులుఁడతనిని జూచి "ఎవరు నీవు" అనెను. ఆ బ్రాహ్మణుఁడు "నేను" అనెను, రాజునకు జ్ఞాపకమునకు వచ్చెను.

రాజు : ఎప్పుడో వత్తు నంటివి.

బ్రాహ్మ : వచ్చితిని అపుడు ప్రభువులు సింహళద్వీపమునం దున్నారు. ఏడాది వఱకు రాలేదు. ఆ ముంపు పోయిన తరువాత నెప్పుడు వచ్చిన నేమి యని యిప్పుడు వచ్చితిని.

రాజు : నా బాల్యగురువును తెచ్చితివా ?

బ్రాహ్మ : అతఁడు నా కెచ్చటను కనిపించ లేదు.

రాజు : అతడు వృద్ధుడై యుండును. చనిపోయెనేమో తెలియదు.

బ్రాహ్మ : నేనే వృద్ధుడ నైతిని. నా కిప్పు డెనుబదియేండ్లు.

రాజు : నాకును నెనుబదియేండ్లే.

బ్రాహ్మ : మీ కింక పదియేండ్ల రాజ్యకాల మున్నది. నేను మరల వత్తును —
రాజున కాశ్చర్యము వేసెను. తా నతనిని చంపనని అతని కెట్లు తెలియును ?

— సశేషము.



జైలుకి పోయివచ్చిన యువనటుడు :—
"జైల్లో ఉన్నప్పుడు భోజన సదుపాయాలవీ బావున్నయ్ కాని చాల యాతనపడ్డా. మేకప్ చేసుకుందామంటే ఒక్క అద్దం ముక్కకూడా దొరకలే."

వ్యవసాయ ప్రగతి

అశోక మెహతా

కేవలం ఏ పరిశ్రమాభిముఖంగానో, వ్యవసాయకంగానో, లేదా ఏ రవాణా, వార్తా సౌకర్యాల విషయంలోనో భారతప్రజలను ఆధునికం చేయడానికిగాక మొత్తం జీవితాన్నంతటినీ — వారి ఆర్థిక, సాంఘిక, మానసిక, సాంస్కృతిక విషయాలన్నిటిలోనూ ఒక కొత్తదనం, ఒకమార్పు, ఒకప్రగతిని సాధించడానికి బృహత్తరమైన ప్రయత్నంగా మనం పంచవర్ష ప్రణాళికలను చేపట్టాము. భవిష్యత్తులో ఫలించనున్న అందమైన కలలపంటకు ఆలంబనమైన ఆధునిక జీవన చైతన్యస్రవంతిని అటువైపుగా మళ్ళించి ఆ జలాలతో పునీతమూ, సారవంతమూ చేయడానికి జరుగుతున్న కృషి యిది. భారత దేశాన్ని ఆధునాతనంగా తీర్చిదిద్దడానికి కొనసాగిస్తున్న మహాయజ్ఞం. భారీఎత్తున పారిశ్రామికీకరణ, వ్యవసాయాభివృద్ధి, గ్రామీణుల పురోగతి — యివన్నీ సమిష్టిగా కొనసాగినప్పుడే ఆర్థికవ్యవస్థ చక్కబడుతుంది. వ్యవసాయాన్ని అలక్ష్యం చేసి పరిశ్రమనుగానీ, పరిశ్రమను అలక్ష్యంచేసి వ్యవసాయాన్నిగానీ అభివృద్ధి చేయబూనడం అవివేకమే అవుతుంది. ప్రగతియాత్రలో దేశానికి యీ రెండూ రెండు చక్రాలు.

సాంప్రదాయకమైన సమాజంలో వ్యవసాయానికి ఎదుగూ బొదుగూలేదు. ఎప్పుడూ **ఒకే తరహా** వ్యవసాయ కార్యక్రమాలు; తగినంతగా ఎరువుల్నీ, నీటి సరఫరానీ వాడకపోవడం; భూసార పరిరక్షణ కార్యక్రమాలు మృగ్యం కావడం; బలహీనమైన, ఉపయోగంలేని విత్తనాల వాడకం, పాతరకాలైన పనిముట్లను ఉపయోగించడం, వృధా శ్రమ — ఇవన్నీ యిలాంటి సమాజంలో తరచుగా మనకు కనిపిస్తాయి, మన ఆర్థికవ్యవస్థను అధునాతనం చేసి, ఆర్థిక ప్రగతిని శీఘ్రతరం చెయ్యాలంటే వ్యవసాయ రంగంలోని యిప్పటి నిస్తబ్ధతను తొలగించివేయాలి. ఈ పాతద్ధతులను వదిలివేయాలి, అయిదు పంచవర్ష ప్రణాళికలతో కూడిన ప్రణాళికా కాలం తొలి 25 సంవత్సరాలు - అంటే 1950-51 నుండి 1975-76 వరకూ వున్నకాలం — పై ప్రాతిపదిక మీదనే రూపొందించబడింది.

అయితే యీ విధానాన్ని శంకించేవారూ, నిరుత్సాహ పరచేవారూ లేకపోలేదు. వారికి నేను యిచ్చే సలహా ఒకటే. ఏదో ఒక అంశంమీద అధిక ప్రాధాన్యతను యిచ్చి ఏ ఒకటో రెండో పంచవర్ష ప్రణాళికలను చూసి అభివృద్ధిని గూర్చి బేరీజు వేసుకోకుండా మొత్తం మనం సాధించిన ప్రగతిని యావత్తూ దృష్టిలోకి తీసుకుని పరిశీలించమంటాను. ఆ విధంగా చూచినప్పుడు కేవలం పరిశ్రమాభిముఖంగానో, వ్యావసాయకంగానో, లేదా ఏ రవాణా, వార్తా సౌకర్యాల విషయంలోనో భారత ప్రజలను ఆధునికం చేయడానికి గాక మొత్తం జీవితాన్నంతటిని— వారి ఆర్థిక, సాంఘిక, మానసిక, సాంస్కృతిక విషయాలన్నింటిలోనూ ఒక కొత్తదనం, ఒకమార్పూ, ఒక ప్రగతినీ సాధించడానికి యీ 25ఏళ్ళ పంచవర్ష ప్రణాళికాకాలం ప్రయత్నిస్తున్నదని అర్థం కాగలదు. భవిష్యత్తులో ఫలించనున్న అందమైన కలలపంటకు ఆలంబనమైె ఆధునిక జీవన చైతన్య స్రవంతిని అటువైపుగా మళ్ళించి ఆ జలాలతో పునీతమూ సారవంతమూ చేయడానికి జరుగుతున్న కృషి యిది. భారతదేశాన్ని అధునాతనంగా తీర్చిదిద్దడానికి కొనసాగిస్తున్నమహాయజ్ఞం. భారీఎత్తున పారిశ్రామికీకరణ, వ్యవసాయాభివృద్ధి, గ్రామీణుల పురోగతి— యివన్నీ సమిష్టిగా కొనసాగినప్పుడే ఆర్థిక వ్యవస్థ చక్కబడుతుంది. వ్యవసాయాన్ని అలక్ష్యం చేసి పరిశ్రమనుగానీ, పరిశ్రమను అలక్ష్యంచేసి వ్యవసాయాన్నిగానీ అభివృద్ధి చేయబూనడం అవివేకమే అవుతుంది. ప్రగతియాత్రలో దేశానికి యీ రెండూ రెండు చక్రాలు.

విదేశాలలో వ్యవసాయాభివృద్ధి

ఈ సందర్భంలో కొంతమంది ఆర్థిక శాస్త్రజ్ఞుల అభిప్రాయాలనుగూర్చి యిక్కడ ప్రస్తావించదలచాను. ఇంగ్లాండులోగాని,

పశ్చిమ యూరపు దేశాల్లోగాని 1750–1850 మధ్యకాలంలో పరిశ్రమలు వృద్ధిచెందాయి అంటే అప్పటికి ఆయా దేశాల్లో వ్యవసాయోత్పత్తులు సమృద్ధిగా వుండడమే కారణమని ఆర్థిక వేత్తలు సెలవిస్తున్నారు. రష్యాలో – వాళ్ళు అవలంబించిన పద్ధతి ఏమైనప్పటికీ – సమృద్ధికరమైన వ్యవసాయోత్పత్తిమీదనే ఆర్థిక ప్రగతికి పునాది వేసుకున్నా రనికూడా అంటున్నారు. వీరు పంథొమ్మిదవ శతాబ్దాంతంలోని చివరి రెండు దశాబ్దాలు మొదలుకొని ఇరవైయో శతాబ్దపు తొలి రెండుదశాబ్దాలవరకు – ఈ మధ్య కాలంలో జపానులో సాధించిన అధికాహారోత్పత్తి విజయమే ఆర్థిక వ్యవస్థను జాజ్వల్యమానం చేసి తద్వారా జపానులో పారిశ్రామిక విప్లవానికి కారణమయ్యిందని వీరు అంటున్నారు.

అంతెందుకు, యిటీవలి కమ్యూనిస్టు చైనానుగాని, నేషనలిస్టు చైనానుగాని పరిశీలించండి. వ్యవసాయప్రగతే పారిశ్రామికాభివృద్ధికి నిజమైన ప్రాతిపదిక అన్న సూత్రంమీద అవి పనిచేస్తున్నా యనేది స్పష్టమౌతుంది అని వీరివాదం. ఈ చారిత్రక సత్యాలను దృష్టిలో పెట్టుకుని పరిశీలించిన ఆర్థిక శాస్త్రవేత్తలు ఒక విషయం గట్టిగా చెప్తున్నారు.

భారీ పరిశ్రమలపై భారతదేశం మోజు చూపడం అర్థరహితమూ, ఆలోచనా శూన్యమూ అనిన్నీ; తొలుత మనం మన వ్యవసాయోత్పత్తిని సమృద్ధివంతం చేసుకోవాలనిన్నీ, ఆ కారణంచేతనే భారతదేశం యీనాడు ఆదర్శాల మధ్య చిక్కుకుపోయినదనిన్నీ వారు సెలవిస్తున్నారు.

పారిశ్రామికాభివృద్ధికి అధిక వ్యవసాయోత్పత్తి అవసరాన్ని గూర్చి నే నేమీ సందేహించడంలేదు. సాధారణంగా పరిశ్రమల ఫలితాలు అందుకోవడానికి కొంత ఆలస్యం అవుతుంది. అందువల్ల పరిశ్రమల లోని వ్యక్తులకు, ముఖ్యంగా భారీపరిశ్రమల లోని వ్యక్తులకు, తమ శ్రమకు తగిన ప్రతిఫలం చేతి కొచ్చేవరకూ తిండీ, గుడ్డా, యిల్లూ అవసరంకదా. ఇందుకు దేశంలో ఆహారోత్పత్తి సమృద్ధిగా వుండాలనడంలో ఎలాంటి సందేహమూ లేదు. కాని యింత ఎక్కువమంది ప్రజలు భూమిమీద ఆధారపడి, రెక్కల్ని ముక్కలు చేసుకుంటూ తాతలనాటి పద్ధతుల్ని వీడలేకపోతుంటే లాభమేమిటి? సామాన్యవ్యక్తి–ఏ బీద వ్యవసాయదారుడో – జీవితంలో తనూ, తన కుటుంబమూ ఒకవంకన అనేక పస్తులు పడుతూవుంటే ఆ సాధారణవ్యక్తియైన ఆ వ్యవసాయదారునికి రాజకీయ స్వాతంత్ర్యాన్నీ, ఆర్థిక స్వేచ్ఛనూ అందిచ్చే ప్రజాస్వామిక పథాన్ని దేశం ఎన్నుకుంటే మాత్రం ప్రయోజన మేమిటి?

పై విషయాలను అంగీకరించినప్పుడు, పరిశ్రమలలో పెట్టుబడికై వ్యవసాయోత్పత్తిని అధికారికంగా సమీకరించడం ఎంత మాత్రమూ తగదు. అందువల్ల యీ మూడింటినీ–అంటే సాధ్యమైన విధానాల్లో అధిక వ్యవసాయోత్పత్తిని సాధించడం, వ్యవసాయాన్ని ఆధునికం చేయడానికి వీలున్న చోట్లల్లా పరిశ్రమలను ప్రవేశపెట్టడం, వ్యవసాయం – పరిశ్రమలను ఒక దానికొకటి అనుబంధాలుగా మార్చి నిరంతర బాంధవ్యాన్ని నెలకొల్పడం – ఈ మూడింటినీ ఒక్కటిగా సమీకరించే ఏదైనా ఒక విధానాన్ని మనం వెతకాలి. ఆ విధమైన విధానం ఆలోచనామాత్రంగానైనా; గత 18వ 19వ శతాబ్దాల కాలాల్లో ఇంగ్లాండు, పశ్చిమయూరపులలో నెలకొన్న విధానానికిగాని లేదా యిటీవలి కాలంలో మరేదేశంలోనైనా ఆచరణలోవున్న విధానానికిగానీ మించిన సూక్ష్మమైన, నాగరికమైన విధాన మని నేను నమ్ముతున్నాను. నాకు అర్థమైనంతమట్టుకు భారతదేశపు ప్రణాళికలు యీ విధానాన్ని ఏర్పాటు చేయడానికే అంకిత మయ్యాయని తేలుతుంది.

పరిశ్రమల లోపం

వ్యవసాయ కార్యక్రమాలు ద్వితీయ ప్రణాళికలో పరిమితం కావడానికి, తృతీయ ప్రణాళికలో ఈ విషయమై మన అంచనాలు తారుమారు కావడానికీ కారణం వ్యవసాయానికి తగిన ప్రోత్సాహం లేకపోవడం కాదని కొద్దిమందే గుర్తించగలరు. అసలు కారణం పెరుగుతున్న వ్యవసాయావసరాలకు అనుగుణంగా పరిశ్రమ, విద్యుచ్ఛక్తి, నీటి పారుదల సౌకర్యాలు లేకపోవడమే. మరొక విధంగా చెప్పాలంటే ఎరువులు, క్రిమిసంహారక మందులు, వ్యవసాయ పరికరాలు, యింకా వ్యవసాయం నిమిత్తం పరిశ్రమలలో తయారయ్యే వస్తువులు తగినంతగా లేకపోవడమూ; నీటి పారుదల సౌకర్యాలు తగినంతగానూ, తగిన సమయంలోనూ లభ్యం కాకపోవడమూ; వ్యవసాయ పనులకు నానాటికీ అభివృద్ధి చెందుతున్న విద్యుచ్ఛక్తిని పూర్తిగా మనం వినియోగించుకునే ప్రయత్నం చెయ్యకపోవడమూ – ఇవే అసలు కారణాలు. అసలు వ్యవసాయ రంగంలోనే సంభవిస్తుందే లోటుపాట్లను– అంటే ఉదాహరణకు భూసంస్కరణల్ని అమలుపరచడంలో మందగమనం, ఎక్స్టెన్షన్ సర్వీసులు తగినంతగా లభ్యంకాకపోవడమూ, సరైన ధరలవిధానం లోపించడమూవంటి వాటిని – మీ దృష్టినుండి మభ్యపెట్టాలని పైలిస్టు చెప్పలేదు నేను;

ప్రజాస్వామిక పద్ధతిలో పనిచేస్తూ వ్యవసాయాభివృద్ధీ, పారిశ్రామిక ప్రగతీ – యీ

రెండూ సమాంతరంగా నడిపించడమే మన ధ్యేయంగా భావించి, మనం వ్యవసాయ రంగంలో గొప్ప మార్పును తీసుకొచ్చేందుకు వ్యవసాయాభిముఖంగా ప్రయాణం చేస్తున్నాము. ఈ రకమైన మార్పు చూడడానికి చాలా తేలికతో కూడుకున్నట్టిదిగా అనిపిస్తుంది. మన పంటభూముల్లో అధిక దిగుబడికి ప్రయత్నం చేస్తే చాలు. అయితే అధికదిగుబడిని సాధించాలంటే ఎరువుల్ని వాడాలి. చక్కటి నీటిసాగు సౌకర్యాల్ని కల్పించాలి. క్రిమిసంహారక మందుల్ని వాడాలి. ఇంకా దీనికి ఆధునిక వ్యవసాయ పద్ధతులు, మొక్కలు నాటడం, కలుపు తీయడం మొదలయినవి ఆచరించాలి. అధిక ఎరువులను తట్టుకో కలిగే ఏవో కొన్ని మేలురకాల వరి, గోధుమ, యితర పంట ధాన్యాల రకాలను ఎన్నుకుని, వాటినే ప్రచారంలోకి తీసుకురావాలి. చూడడానికి యిది చాలా తేలిగ్గావున్నా, నిజానికి యీ రకమైన వ్యావసాయిక మార్పును తీసుకురావడం కష్టమే. బాగా జాతిలో జీర్ణించుకుపోయిన పాతకాలపు వ్యవసాయ పద్ధతులు తొలగిపోవాలి. వ్యవసాయానికి సంబంధించిన కొత్తపద్ధతులను బహుళ ప్రచారం చేయాలి. వాటి ఫలితాలను నలుగురికీ చూపించాలి. బంజరు భూములమీద తీవ్రతరంగా వృక్షసంబంధమైన పరిశోధనలు కొనసాగాలి. ఈ దేశంలోని ఆరుకోట్లమంది వ్యవసాయదారు లందరికీ తెలిసేటంతగా అందుబాటయ్యేంత అధికంగా వ్యవసాయ రంగంలో ఆధునిక పద్ధతులను ఉద్యమంగా తీసుకురావాలి. ఆ నిర్వహణ సామర్థ్యాన్ని మనం కలిగేంత శక్తిసమన్వితులం కావాలి. ఇది ఏమంత తేలికైన విషయం కాదు.

జపాన్ ఉదాహరణ:

అయినా 1881–90నుంచి 1911–20 వరకు నాలుగు దశాబ్దాలు యీ విధంగానే జరిగింది. జపాన్ వ్యవసాయరంగంలో యీ మూలవిధానాల మార్పు ఫలితంగా యీ కాలంలో వ్యవసాయ ఉత్పత్తులు 75 శాతం పైగా పెరిగాయి. సేద్యపు భూమి విస్తీర్ణం 20 శాతం పైగాను, ఎకరా రాబడి 45 శాతం పైగాను పెరిగాయి. ఈ కాలంలో జపాన్ జనాభా 44 శాతం పెరిగింది. అయితే వ్యవసాయ కూలీలసంఖ్య 14 శాతంఉన్నది. తలసరి ఆహారం సరఫరా 70 శాతం పైగా పెరిగింది.

జపాన్‌లో ప్రారంభదశలో వ్యవసాయ ఉద్యమంకూడా దాదాపు నేడు మన భారత దేశంలో మాదిరిగానే ఉండేది. అధిక జనాభా, తక్కువ తలసరి ఆదాయం, సగటున 2 లేక 3 ఎకరాల భూకమతాలు — యిదీ స్థితి.

అయితే దాదాపు అన్నివిషయాలలో సామ్యంగల ప్రజలు ఉన్న జపాన్‌వంటి చిన్నదేశంలో సాధ్యమైన పనులు, పెద్ద విస్తీర్ణం కలిగి వివిధ సంస్కృతులు గల అధిక జనాభా ఉన్న మనవంటి పెద్దదేశంలో మనకు యిది అంత సులువుగా జరగదని గుర్తుంచుకోవడం చాలా అవసరం. వ్యవసాయంలో, రసాయన భౌతికశాస్త్రాలలో యితోధిక పరిశోధనలు జరిగి, పరిశోధనా ఫలితాలను విస్తృత ప్రాతిపదికపై ఉపయోగించినప్పుడు మాత్రమే భవిష్యత్తులో మంచి ఫలితాలు కలుగుతాయి. ఒకసారి యివి నిర్వహింపబడి, అధీనంలోకి తీసుకోబడితే మిగతా విషయాలలో అభివృద్ధి దానికదే సాధ్య మవుతుంది. వ్యవసాయ రంగంలో యంత్రపరికరాలను విరివిగా ఉపయోగంలోకి తేవాలనేదే నా భావం.

ప్రభుత్వ విధానం సరి అయినది:

నాలుగవ ప్రణాళికలో నిర్దేశించిన లక్ష్యాలను గమనించినప్పుడు మనం యీ ఉద్యమంలో సరిఅయిన పంథాను అనుసరించామని తెలుస్తుంది. వ్యవసాయంలో ప్రైవేటు పబ్లిక్ రంగాలతో కలుపుకుని రు 3,100కోట్ల ప్రణాళికా పెట్టుబడి ఉంటుంది. అదే విధంగా వ్యవసాయం, నీటిపారుదలకు కలుపుకుని రు 4,100 కోట్లు ఉంటుంది. వ్యవసాయానికి పబ్లిక్ రంగంలో మాత్రమే రు 2,400 కోట్లు ఉంటుంది. ఇది మూడవ ప్రణాళికా పెట్టుబడికన్నా 2½ రెట్లు ఎక్కువ. వ్యవసాయం, నీటి పారుదలలకు కలుపుకుని పబ్లిక్ రంగంలో కేటాయించిన రు 3,400 కోట్ల మొత్తం, మూడవ ప్రణాళికా మొత్తంకన్నా రెండింతలు ఎక్కువ ఉంటుంది. నిర్దిష్ట లక్ష్యాల విషయంలో మేలిరకం విత్తనాలను వాడే విస్తీర్ణాన్ని పచ్చి ఎరువులు వాడే విస్తీర్ణాన్ని రెండింతలు చేస్తారు. రసాయనిక ఎరువుల వాడకం మూడింతలు, సస్య రక్షణ విస్తీర్ణం నాల్గింతలు చేయబడుతుంది. భారీ నీటిపారుదల ప్రాజెక్టుల క్రింద సాగుబడి దాదాపు 50 శాతం, చిన్న తరహా నీటి పారుదల వనరుల క్రింద సాగుబడి దాదాపు 25 శాతం, భూసార రక్షణ క్రింద దాదాపు 70 శాతం పనులు ఎక్కువ అవుతాయి. సస్యరక్షణ క్రింద దాదాపు 50 శాతం విస్తీర్ణం హెచ్చు అవుతుంది. మేలిరకం విత్తనాలను వాడే విస్తీర్ణం 80 శాతం పెరుగుతుంది. రసాయనిక ఎరువుల వాడకం విస్తీర్ణాన్ని అంచనా వేయడం యీ దశలో కష్టమైనప్పటికీ మనకు అవసరమైన నత్రజని రసాయనిక మొత్తంలో 40 శాతం లభిస్తుంది. వ్యవసాయ శాస్త్రజ్ఞులు, పరిపాలకుల ముందు యెంతటి బృహత్తర సమస్య ఉన్నదో పై లక్ష్యాల వివరణ తెలుపుతుంది. ఈ సమస్యను పరిష్కరించే విధంగా పరిపాలనా యంత్రాంగాన్ని ఏర్పరచి దేశం

లోని మారుమూల ప్రాంతాలకు కూడ శాస్త్రీయ విజ్ఞాన పరిశోధన ఫలితాలను విస్తృత ప్రాతిపదికపై వినియోగించే విధంగా చేయాలి.

బృహత్తర సమస్య :

మూడవప్రణాళికలో నిర్దేశించిన లక్ష్యాల కన్నా ఫలితాలు చాలా తక్కువగా ఉండే విషయాన్ని గుర్తించినప్పుడు వ్యవసాయ రంగంలో వాస్తవంగా ఎంతటి బృహత్తర సమస్యను ఎదుర్కోవాల్సిఉన్నదో తెలుస్తుంది. 100 మిలియనుటన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తి మన లక్ష్యంకాగా 90 లేక 92 మిలియన్ టన్నుల ఉత్పత్తి మాత్రమే జరిగేటట్టు ఉన్నది. అదే విధంగా నూనెగింజల ఉత్పత్తిలక్ష్యం 9.8 మిలియన్ టన్నులుకాగా యిప్పుడు 7 నుంచి 8 మిలియన్ టన్నుల ఉత్పత్తి జరుగుతుందని ఆశించబడు తున్నది. 7 మిలియన్ బేళ్ళ పత్తి ఉత్పత్తి లక్ష్యంగా ఉండగా 6 మిలియన్ బేళ్ళఉత్పత్తి జరుగుతున్నది.

నేను మొదటనే చెప్పినట్టు యీ అసంతృప్తికరమైన పరిస్థితులకు కారణం వ్యవసాయరంగంలో ఎక్కువశ్రద్ధ తీసుకోకపోవడమే అవుతున్నది. భారీమధ్యతరగతి ప్రాజెక్టుల నిర్మాణంద్వారా 29.3 మిలియన్ ఎకరాలకు నీటిపారుదల సౌకర్యం కలిగించే వనరులను సమకూర్చాలని లక్ష్యం ఉండగా 20మిలియన్ ఎకరాలకు నీటిపారుదల సౌకర్యం కల్గించే వనరులనుమాత్రం సమకూర్చాము. ఇందులో నికరంగా 16 మిలియన్ ఎకరాలనుమాత్రం వినియోగించుకో గలుగుతాము. ఒక మిలియన్ టన్నుల రసాయనిక ఎరువులను ఉత్పత్తి చేయాలని లక్ష్యం ఉండగా ప్రస్తుత సంవత్సరం ఆఖరువరకు 500 వేల టన్నులకన్నా తక్కువగా ఉత్పత్తి జరగవచ్చు. వ్యవసాయరంగంలో ఉపయోగార్థం 166 వేల యూనిట్ల డిసెల్ ఇంజనుల ఉత్పత్తి లక్ష్యంగా ఉండగా 78 వేల యూనిట్ల ఉత్పత్తి జరుగుతుందని ఆశించబడుతున్నది.


నాలుగవ ప్రణాళికలో వ్యవసాయ రంగంలో నిర్దేశించిన బృహత్తరకృషి ఫలితంగా వ్యవసాయఉత్పత్తులలో వార్షికంగా కనీసం 5 శాతం చొప్పున పెరుగుదల ఉంటుందని మనం ఆశించవచ్చునని మన నిపుణుల అభిప్రాయం. ఈ మామూలు రేటులో ఉత్పత్తి జరగడానికి కూడా 2.5 మిలియన్ టన్నుల రసాయనిక ఎరువులు; 2.5 మిలియన్ టన్నుల ఉక్కు, ఇనుము; 5.5 మిలియన్ టన్నుల సిమెంటు; 2.5 మిలియన్ టన్నుల క్రిమిసంహారక మందులు అవసరమవుతాయి. దీనికి తోడు అసంఖ్యాకమైన చిన్నతరహా యంత్రపరికరాలు, ఇతర పారిశ్రామిక ఉత్పత్తులు అవసరమౌతాయి.

రైతుల అవసరాలను సరఫరా చేయడానికి గ్రామీణ సహకార సంఘాలు మరింత సమర్ధవంతంగా పనిచేయాల్సి ఉంటుంది. 1962—63 సంవత్సరాంతం వరకు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు సర్వీసు సంఘాల సభ్యులు సంఖ్య 2 కోట్లకుమించినదని చెప్పడంతో సరిపోదు. 6 కోట్లకుపైగా ఉన్న వ్యవసాయ కుటుంబాల సంఖ్యతో పోల్చితే యీ సభ్యుల సంఖ్య తక్కువగానే ఉంటుంది.

సభ్యుల సంఖ్య కన్నా యీ సంఘాల కార్యనిర్వహణ, పరిపాలన, పర్యవేక్షణ అభివృద్ధి చెందడం అతి ముఖ్యమైన విషయం. భూసంస్కరణలను త్వరిత గతిని పూర్తిచేయాలి. ఈ విషయంలో పురోభివృద్ధి సంతృప్తికరంగాలేదు. మన భూ సంస్కరణ చట్టాల అమలును పర్యవేక్షించే పరిపాలన సంబంధమైన ఏర్పాట్లు తగినంతగాలేవు. అనేక రాష్ట్రాలలో కౌలుదార్ల హక్కులకు సంబంధించిన రికార్డులు పూర్తిగాలేవు. వీటన్నిటి ఫలితంగా అతిబీద రైతులు, భూమిలేని కార్మికులు, భారత వ్యవసాయ రంగంలో ఏకైక బలహీన వర్గంగా మిగిలిపోయారు. అయితే నాలుగవ ప్రణాళిక అమలు ప్రారంభించడానికి ముందే భూసంస్కరణలను పూర్తిగా అమలు జరపడానికి కృషి చేస్తున్నారు.

సకాలంలో యీ పనిని పూర్తిచేయడానికి రాష్ట్రాలు సత్వర చర్యలు తీసుకుంటున్నాయి. ఈ పని అభివృద్ధిని కేంద్రం పర్యవేక్షిస్తున్నది.

వచ్చే కొన్ని సంవత్సరాలవరకు దివారాత్రులు నిర్విరామంగా కష్టించి కృషి చేయాలనేదేభావం. వ్యవసాయ విప్లవంలో స్వల్పకృషితో పనులు జరగవనే సత్యాన్ని ఇప్పుడైనామనంగుర్తించాల్సిఉన్నది. వివిధ ప్రాంతాలలో, వివిధ పైరులకు అనువైన వివిధ ఉత్తమ విధానాలను అనుసరించే మన సామర్థ్యంపైననే వ్యవసాయ రంగంలో మనం ఆశించిన విజయాలు ఆధారపడి ఉన్నాయి. రైతులకు విద్య, క్షేత్రప్రదర్శన, శిక్షణ యివ్వడంద్వారా యీ నూతన విధానాలను అనుసరించేటట్లు చేయాలి. అంతేగాక రైతులకు అవసరమైన సహాయ సహకారాలను సకాలంలో అందజేయాలి. ఇటువంటి విజ్ఞానం అందజేసినప్పుడే సన్నకారురైతులు, భూమిలేనివ్యవసాయ కూలీలు యీవిప్లవంలో ముఖ్యపాత్ర వహించ గలుగుతారు. వీరు లేనితీరున యీ విప్లవం ఆదిలోనే విఫలమౌతుంది.


మానవత్వానికి
మారుపేరు
Y H. SURI

స్కెచ్ :   'ప్రేమేంద్ర'

మద్రాసు మెయిలు వేగాన్ని అందుకుని సాగిపోతోంది. కిటికీదగ్గరి సీటులో కూచుని బాహ్య ప్రకృతిని తిలకిస్తూ, పరవశుడౌతున్నా డొకవ్యక్తి. అతనే భరతరావు. అతను ధరించిన దుస్తులు చూస్తే, మిలటరీ వ్యక్తి అని చప్పున తెలిసిపోతుంది. ఆ మొహంలో ఓ విధమైన తృప్తి, సౌమ్యత, కొట్టవచ్చినట్టు కనిపిస్తున్నాయి.

భరతరావుకి యెదురుగావున్న సీటులో కూచున్న ఓ యువకుడు, భరతరావుకేసి ఆసక్తితో చూస్తున్నాడు. ఏదో అడగాలన్న ఆసక్తి అతనిలో వురకలు వేస్తోంది. చివరికి ఆ ఆసక్తిని అణచుకోలేక పోయాడు.

"మీరు మిలిటరీలోవున్నారా?" ప్రశ్నించాడు.

బాహ్య ప్రకృతిని పరికిస్తూ, తన్మయుడైన ఆ జవాను ఆ ప్రశ్న వినిచప్పున ఆయువకునికేసి తిరిగాడు మందస్మిత వదనంతో.

"ఔనండీ!" అన్నాడు.

"ప్రస్తుతం యెక్కడ వున్నారు? సరిహద్దు ప్రాంతాల్లోనా?" మళ్ళా ప్రశ్నించాడా యువకుడు.

"గత సంవత్సరం చైనీయులు దురాక్రమణ జరిపినప్పటికి నేను ఆ ప్రాంతాల్లోనే వుండేవాణ్ణి లెండి. బొమ్డీలా పడిపోయిన తర్వాత, వారికి పట్టుబడిన వారిలో నేనూ ఒకణ్ణి. మొన్ననే అంటే ఓ నెలక్రితం తిరిగి వచ్చాం. స్వస్థలం వెళ్ళిరావడానికి ప్రభుత్వం అవకాశం కలిగించింది గాబట్టి యిలా బైలుదేరాను..." అన్నాడు యెంతో వుత్సాహంగా.

అతను యుద్ధఖైదీలలో ఒకడని వినడంతో అక్కడున్న చాలా మందికి, చైనీయుల దురాగతాలను తెలుసుకోవాలన్న ఆసక్తి జనించింది. చాలామంది దృష్టి అతనిమీద కేంద్రీకరించింది.

"అవుతే, మీరు చైనావారి నిర్బంధంలో యుద్ధ ఖైదీలుగా యున్నాళ్ళూ వున్నారు కదా, వారు మిమ్మల్ని యుద్ధ ఖైదీలుగానే గౌరవించారా?" మరోవ్యక్తి ప్రశ్నించాడు.

భరతరావు ఒక్క నిట్టూర్పు విడిచాడు. "అదే విచారించ వచ్చిన విషయమండీ, వారు మమ్మల్ని యుద్ధఖైదీలుగా చూడలేదు. కేవలం బానిసలలాగా భావించి ప్రవర్తించారు. ప్రపంచ సూత్రాలతోనూ, ధర్మాలతోనూ వారికి ప్రమేయమే లేదు. ఈ విశ్వమంతటికీ తా మొక్కరే నియంతల మనుకుంటారు చైనా అధికారులు. వారి ప్రతి నడవడిలోనూ భావంలోనూ యీ విషయం విస్పష్ట మౌతుంది. ఇక అక్కడ మా సౌకర్యాల విషయం చెప్పాలంటే, మాకు సరైన భోజనం లభ్యమయ్యేది కాదు. మేం మాకు కావల్సింది అడగాలని వారి అభిమతం వుండేదేమో; కాని అనన్యమైన స్వాభిమానంగల భారతీయులం. ఏ విషయంలోనూ అభిమానాన్ని వదులుకునేవాళ్ళం కాదు. అదీగాక, అక్కడి ప్రజలకే తిండికి లేకుండావుంటే, యింక వారు మాకు పెట్టేదేమిటి? మా ఆఫీసర్లను మానుండి వేరుచేసి ఒక్కొక్క ఆఫీసర్నీ ఒక్కో శిబిరంలో వుంచారు. అది ధర్మవిరుద్ధం. అయినా, వారికి ధర్మాధర్మాలతో ప్రమేయమే లేదుగా? చైనాదేశం, ఆ ప్రజలగురించి తప్పించి, మేం మరో పుస్తకం చదవడానికి వీలులేదు. భారతదేశంగురించి యే విషయమూ తెలిసేదికాదు. రేడియో సమాచారాలు కేవలం చైనాదేశంగురించే వినబడేవి. కొన్ని సందర్భాలలో మేం పూజాపునస్కారాలు చేసుకుందుకూడా వీలుండేదికాదు..." అంటూ చెప్పుకుపోతున్న భరత్‌రావుకి ఓ వ్యక్తి అడ్డుపడ్డాడు.

"ఆదేవిటండీ? ఆ మధ్య కొంత ప్రచారం సాగించారు, మీ పూజలకు వారు యెట్టి అభ్యంతరమూ చెప్పలేదని; అందుకు నిదర్శనంగా కొన్ని ఫోటోలుకూడా ఆఫ్రికా మొదలగు దేశాల్లో పంచిపెట్టారనుకుంటాను..." అంటూ అడిగాడు.

భరతరావు మొహం కోపంతో రాగరంజిత మయ్యింది.

"చైనీయులలో జీర్ణించుకుపోయిన కుతంత్రాలలో యిది ఒకటండీ; వారు ప్రచారం చేసిందానికి యెప్పుడూ విరుద్ధంగా వుంటుంది వాళ్ళు జరిపింది. అది మనం అయిదేళ్ళగా చూస్తూ వస్తున్నాం. ఆఫోటోలు ఒకటి రెండు సందర్భాల్లో కావాలని తీశారు, అంతే; అప్పట్నుంచీ యెవరికీ పూజచేసుకునే అవకాశం లేకపోయింది. దేవుడు లేడనే నాస్తికవాదాన్ని మాలో మొలకెత్తించడానికి ప్రయత్నించి విఫలులయ్యారు. అంతే కాదు...మన దేశనాయకులపై యేవేవో అర్థంలేని అభాండాలు వేసి, వారిని మేం అసహ్యించుకునే విధంగావుపన్యాసాలుదంచేవారు. అవన్నీ అరణ్యరోదన లనితెలుసుకున్నాక, విసిగిపోయి, ద్వేషంతో, యీర్ష్యతో మమ్మల్ని అప్పుడప్పు డూహింసించేవారు." అంటూ ఆగాడు. ఇంకాఅతను చెప్పాల్సింది యెంతో వుంది. అవుతే, ఆ విషయాలు చెప్తుంటే అతనిలోని ఆవేశం వురకలు వేస్తోంది. అందుకే క్షణం ఆగాడు.

"అంత విద్వేషం వున్నవాళ్ళు మిమ్మల్ని యెందుకు తిరిగి అప్పజెప్పారు?" ఒకరు ప్రశ్నించారు.

"ఔను; అదీ ఒక ప్రశ్నేనండీ; కాని, యిందుకుగల కారణాలు యేవిటో యెవరమూ యిదమిత్థమని చెప్పలేం...అవుతే, మేం వూహించిన కారణాలు యివి: అక్కడి ప్రజలకే తిండిలేదు. ఇంక మాకు వాళ్ళేం తిండి పెడతారు? అదీగాక చైనా నియంతలు ప్రథమంలోనే తమవద్ద యుద్ధఖైదీలుగా ఫలానా యింతమంది వున్నట్టు ప్రకటన చేశారు తమ ఆధిక్యతను వెల్లడిచేసుకుందుకు. తర్వాత అదే వారికి విషమ సమస్య అయ్యింది. మా బాధ్యత వారిపై పడింది. ఆ ప్రకటనే చేసి వుండకపోతే, యేం జరిగివుండేదో యెవరమూ చెప్పలేం. అదీగాక, తమ విశాల హృదయం ప్రపంచానికి తెలియ పర్చుకుందుకు కూడా అలా చేశారు. అవుతే ఒకటి లెండి. రెండో

కారణం అంతగా నరిపడదు. ఎందుకు అంటే, యుద్ధ ఖైదీలను యెప్పుడో ఒక సారి విడిచిపెట్టక తప్పదు మొదటి కారణమే మనం నిర్ధారణగా చెప్పుకో వచ్చు .."

"అంత తిండికి లేని వారు, యుద్ధానికి యెట్లా బైలుదేరారు?"

"అది రెండువిధాల లాభదాయకం వారికి. వారి సైనికులు యుద్ధరంగంలో మరణిస్తే జనాభా తగ్గుతున్నందుకు సంతోషిస్తారు. వాళ్ళు కాస్త ముందుకు పోయి కొత్త ప్రదేశాలు ఆక్రమిస్తే, నిర్దాక్షిణ్యంగా అక్కడి ప్రజలను హింసించి వారిమండి తమకు కావల్సిన భోజనం సంపాదించుకుంటారు. గత దురాక్రమణలో యిదే జరిగింది. ప్రపంచంలో అధిక జనాభాగల దేశం తమదేశమే నని గర్వించడం తప్పిస్తే, ఆ జనాభా భుక్తికి తగిన ప్రయత్నాలు చేయలేక పోయారు చైనా అధినేతలు. వారికి తోచిందంతా అందర్నీ సైనిక సిబ్బందిగా మార్చడమే; మరి వారికి తిండి పెట్టాలంటే ఆక్రమంగా పొరుగు వారిని దోచుకోవాలి. టిబెట్టును వాళ్ళలాగే ఆక్రమించుకున్నారు. మనదేశంసాధిస్తున్న పురోగమనాన్ని సహించలేకయారు, వారి కళ్ళు కుట్టాయి. అందుకే యీ దురాక్రమణ గావించారు. సుమారు ప్రపంచమంతా మనకుఅండగా నిలబడేసరికి, విధిలేక వాళ్ళే వెనక్కి మళ్ళారు. ఒక మాటలో చెప్పాలంటే, వారిలో మానవత్వం లేదు. దయాదాక్షిణ్యాలు లేవు. తోటి మానవులతో సఖ్యంగా, సహృదయంతో సంచరించగల సంస్కారం లేదు. మన భారతీయులంటే, వారికి చెప్పలేని ద్వేషం...అందుకు కారణం వారికే తెలియదు. అవుతే మనం మాత్రం మన దేశంలో వున్న చైనీయుల పట్ల ద్వేషంతో యెప్పుడూ ప్రవర్తించలేదు ... ఆ మధ్య కొందరు అనుమానితులైన చైనీయులను దేవులీ శిబిరంలో వుంచినా, వారికి సకల సౌకర్యాలూ కల్పించారు మన ప్రభుత్వం. ఇదే మనకీ చైనావారికీ విభేదం." అంటూ ముగించాడు భరతరావు.

అక్కడ వున్న వారిలో ఒకరి దృష్టి కంపార్టు మెంటులో ఓ మూల కూచున్న ఒక చైనీయుని మీదపడింది. "చూడండి – అక్కడ ఒక చైనా దేశస్థుడు కూచున్నాడు వాడి మొహం చూడండి యెట్లా వుందో? సౌమ్యత యెక్కడా కనిపించదు..." అన్నాడు వుద్రేకంగా.

అందరి దృష్టి అటే మరలింది. భరతరావుకి అదో విషమ సమయంలా తోచింది. ఇక్కడున్న వారిలో చైనావారి పట్ల అమితద్వేషం గూడుకట్టింది. ఆ ద్వేషంతో వారు ఆ చైనీయునికి అపకారం తలపెడతారేమోనని భయపడ్డాడు.

"ఆ జాతివారిని చూసి మనం ద్వేషించడం మంచిది కాదండీ. వీరు మాత్రం యేంచేస్తారు? మన దేశంలో వున్న చాలామంది చైనీయులకు వారిదేశపు అధినేతల పశుప్రవృత్తి అసహ్యాన్ని కలిగించింది. అందుకే చాలామంది తమ స్వదేశం వెళ్ళడానికినిరాకరించారు; చైనా నాయకులనియంతృత్వం యెంత కఠోరంగా వుందో తెలుసుకుందుకు యింతకంటె మరో నిదర్శనం అనవసరం..." అన్నాడు భరతరావు.

అందరి దృష్టి తనమీదే కేంద్రీకరించి వుండటం, గమనించాడు ఆ చైనీయుడు. అతనికి యెందుకో చాలా బాధనిపించింది. తన తప్పు యేమీ లేకపోయినా, తను అసహ్యింపబడుతున్నాడు ... అందుకు కారణం యెవరు? తమ స్వదేశాన్ని పాలిస్తున్న నియంతలు ... చప్పునలేచి భరతరావు కూచున్న చోటికి వచ్చాడు. అతని రాకతో యిక్కడ మరింత సంచలనం చెలరేగింది. అతని కళ్ళలో నీరు గిర్రున సుళ్ళు తిరిగింది. భరతరావుని వుద్దేశించి, ఆ తర్వాత మిగతా వారిని వుద్దేశించి, హిందీలో చెప్పుకుపోయాడు.

"సోదరులారా: నేను చైనీయుణ్ణని చెప్పుకొందుకు ఖిన్నపడుతున్నాను. కాని, యేం చెయ్యను? దురదృష్టవశాత్తు నేను చైనాదేశంలో పుట్టాను. మా వాళ్ళు మీకు తలపెట్టిన అపకారానికి మేమూ బాధపడుతున్నాం. వారిలోగల రాజ్యకాంక్ష హద్దులు దాటి వారికి అవసాన కాలాన్ని తీసుకు వచ్చింది. అందుకే వారు అలా రెచ్చిపోయి అక్రమంగా ప్రవర్తిస్తున్నారు. భారత దేశంలో వున్న చైనీయులలో యే కొద్ది మందో తప్పించి, చాలావరకు ఇక్కడే శాశ్వితంగా వుండిపోదలచాం. అక్కడికి పోయి ఆ యినుప పాదాల క్రింద నలిగిపోవడం యిష్టం లేదు. ఈ మధ్య దేవులీ శిబిరంలో వుండి మొన్ననే తిరిగి వచ్చాను కలకత్తా, ఆ శిబిరంలో మా అందరికీ ఎంత ఆనందంగా గడిచిందీ మాటల్లో చెప్పలేం. ఏ ఒక్కరికీ లోటుకలుగలేదు. మా బంధువు ఒకాయిన మద్రాసునుండి చైనాకి బైలుదేరుతున్నాడు గాబట్టి అతణ్ణి కలుసుకోవాలని మద్రాసు వెళ్తున్నాను. బహుశా, అతణ్ణి మాతోపాటే వుంచేయడానికి ప్రయత్నం చేస్తాను. ఫలితం చెప్పలేను. భారతదేశంలో మేం రుచిచూస్తున్నది మానవత్వం. మానవత్వానికి మారుపేరు భారతదేశం. అటువంటి భారతదేశం వదిలి వెళ్ళడం, మాకు సుతరామూ యిష్టంలేదు. ప్రస్తుతం భారత దేశాన్నివదిలి స్వదేశం వెళ్తున్న మా సోదరులంతా తర్వాత పశ్చాత్తాప పడ్తారు. తప్పదు స్వదేశం యేదైతేనేం – యేచోట మానవత్వం, సర్వమానవ సౌభ్రాతృత్వం, వెల్లివిరుస్తూ వుంటాయో, అదే స్వదేశం: ప్రస్తుతం నాకు భారతదేశమే స్వదేశం:" అన్నాడు ఆ చైనాదేశస్తుడు.

భరతరావు ఒక్క వుదుటునలేచి, ఆ చైనీయుణ్ణి అమాంతంగా కౌగలించుకున్నాడు. మిగతావారంతా వాళ్ళిద్దర్నీ కళ్ళప్పగించి చూస్తున్నారు. మిత్రత్వంలో యెంత మాధుర్యం వుందో, ఆ ఘట్టం 'మావో' లాంటి వ్యక్తి కళ్ళారాచూస్తే అర్థంచేసుకుని వుండేవాడు అనుకున్నారు ప్రయాణీకులంతా. రైలుబండి వేగాన్ని తగ్గించుకుని. స్టేషను రాబోతుందని తెలియజేసింది...

Edited & Published by the Director of Information and Public Relations, Andhra Pradesh, Hyderabad
Printed at Yuva Press, Public Garden Road, Hyderabad.